అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 01-4-2024

సంపుటి : 10 | సంచిక : 91 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



దేశం ఏకమౌతోంది

- సీతారాం ఏచూరి

ఇండియా ఏకమవుతుందని, ఇండియా గెలుస్తుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 'భారత్ ఏకమై గెలుస్తుంది' అన్నది ఇండియా ఫోరం నినాదంగా మారిందన్నారు. 49 ఏండ్ల క్రితం రాంలీలా మైదానంలో జయప్రకాశ్ నారాయణ్ నిర్వహించిన లెజెండరీ ర్యాలీకి ప్రస్తుత ఇండియా ఫోరం ర్యాలీకి ఎంతో పోలిక ఉందని చెప్పారు. ప్రజలు మోడీ ...3లో



అవకాశం ఇస్తే నవ భారతాన్ని నిర్మిస్తాం

- కేజ్రీవాల్ సందేశం : ర్యాలీలో సునీత కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి మహార్యాలీకి సందేశం పంపారు. ఆయన సతీమణి సునీత చదివిన సందేశంలో.. తాను ఓట్లు అడగడం లేదని.. 140 కోట్ల మంది ప్రజలను నవ భారతాన్ని నిర్మించాలని అడుగుతున్నానన్నారు. వేల సంవత్సరాల సంప్రదాయం ఉన్న సంస్కృతి మనదని, భారతమాత కూడా బాధపడుతోందని, దేశం ఐక్యతకు అవకాశం ఇస్తే నవ భారతాన్ని నిర్మిస్తామన్నారు. ఆరు హామీలు కూడా ప్రకటించారు.. దేశంలో 24 గంటల ...3లో

ఇండియా గుండె చప్పుడు...

ఢిల్లీ రాంలీలా మైదానం నుంచి దేశ రాజకీయాల్లో కొత్త శక్తి పుంజుకుంది. బీజేపీని ఓడించి దేశాన్ని గెలిపించాలని పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఐక్యపోరాటానికి శ్రీకారం చుట్టింది. నియంతృత్వానికి వ్యతిరేకంగా ఒక్కటిగా నినదించింది. ఉప్పెనలా తరలివచ్చిన జనత దిక్కులు పిక్కటిల్లేలా గర్జించింది. సార్వత్రిక ఎన్నికలకు సమరశంఖం పూరించింది

అప్రకటిత ఎమర్జెన్సీని ప్రతిఘటించాలి

మోడీని గద్దెదించాల్సిందే..

- క్రికెట్ తరహాలో మోడీ మ్యాచ్ ఫిక్సింగ్
- బీజేపీ 180 సీట్లు గెలవడమే కష్టం : ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీలో ఇండియా ఫోరం నేతలు

'ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఓ నియంత. మతం పేరుతో సమాజాన్ని చీలుస్తున్నారు. రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసి, ప్రతిపక్షాలను వేటాడుతున్నారు. ఏకపక్ష విధానాలతో అధికారంలో కొనసాగాలని చూస్తున్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే అప్రకటిత ఎమర్జెన్సీని ప్రతిఘటించాలి. మోడీ సర్కారును గద్దెదించాలి. అని దేశ ప్రజానీకానికి ఇండియా ఫోరమ్ నేతలు పిలుపునిచ్చారు. 'సేవ్ డెమోక్రసీ' నినాదంతో ఆదివారం ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా ఫోరమ్ నిర్వహించిన మహార్యాలీ, బహిరంగ సభకు ప్రజానీకం వెల్లువెత్తింది. కేవలం 20 వేల మందికే అనుమతిస్తామని ఢిల్లీ పోలీసులు విధించిన ఆంక్షలను ప్రజానీకం ఏమాత్రం ఖాతరు చేయలేదు. లక్షలాది మంది తరలిరావడంతో రామ్‌లీలా మైదాన్ నిండిపోయింది. చిన్న చిన్న నదుల్లాగా ప్రదర్శనకు వచ్చిన ప్రతిపక్ష కార్యకర్తలు రాంలీలాలో జన సముద్రాన్ని తలపించారు.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు ముందు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత సోరెన్‌లను అరెస్టు చేసి, మొత్తం ప్రతిపక్షాలను వేటాడటంతో ఏకపక్ష ఎన్నికలతో అధికారాన్ని కొనసాగించాలని ప్రయత్నిస్తున్న మోడీని ఇండియా ఫోరం మహా ర్యాలీ హెచ్చరించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపాయ్ సోరెన్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, డిఎంకె నేత తిరుచ్చి శివ, టీఎంసీ నేత డెరిక్ ఓబ్రెయిన్, వీసీకే నేత తిరుమవళవన్, ఆప్ నేతలు, ఢిల్లీ మంత్రులు పాల్గొన్నారు.

మరిన్ని వివరాలు 3లో..

రెండు కుర్చీలు ఖాళీగా..

వేదికమీద మొదటివరుసలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్‌ల కోసం రెండు కుర్చీలను ఖాళీగా వదిలారు. శనివారం కేజ్రీవాల్‌ను కలిసిన సునీత ఆయన సందేశాన్ని వినిపిస్తున్నప్పుడు, హేమంత్ సోరెన్ భార్య కల్పన మాట్లాడుతున్నప్పుడు సభలో ఉద్వేగ భరితవాతావరణం నెలకొంది.



రాజ్యాంగాన్ని హైజాక్ చేశారు

- రాహుల్ గాంధీ

క్రికెట్‌లో ఫిక్సింగ్ తరహాలో ప్రధాని నరేంద్ర మోడీ లోక్‌సభ ఎన్నికలను మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధానమంత్రి, ముగ్గురు, నలుగురు క్రోనీ క్యాపిటలిస్టులు కుమ్మక్కయి రాజ్యాంగాన్ని హైజాక్ చేశారని దుయ్యబట్టారు. పూర్తి స్థాయిలో ఓటు వేయకుంటే వారి కుమ్మక్కు ఫలిస్తుందని, అది జరిగితే రాజ్యాంగం కూలిపోతుందని వివరించారు. రాజ్యాంగం ప్రజల గొంతుక, అది ముగిసిన రోజు దేశం అంతమవుతుందని ఆవేదన ...3లో



జార్ఖండ్, ఇండియా తలవంచవు

- హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ మాట్లాడుతూ "రెండు నెలల క్రితం, హేమంత్ సోరెన్‌ను జైలులో పెట్టారు. ఇప్పుడు నియంతను నిర్మూలించాల్సిన అవసరం ప్రజలపై ఉంది. జార్ఖండ్ తలవంచబోదు. ఇండియా ఫోరం ...3లో



బీజేపీలో ఉంటే నీతిపరులు.. లేకుంటే అవినీతిపరులా?


ప్రతిపక్షాల ఎన్నికల క్యాంపెయిన్ బలహీనం చేసేందుకు కుట్ర

- రాజ్యాంగ పునాదులను ధ్వంసం చేస్తున్న కేంద్రం
- బీజేపీని గద్దెదించడమే మా రాజకీయ కర్తవ్యం : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు
- తెలంగాణలో ఆ పార్టీ ఒక్క ఎంపీ స్థానం గెలవకుండా చూడాలి సీఎం రేవంత్‌రెడ్డికి సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, నీతి, నిజాయితీని రక్షించుకోవడం కోసమే మా ప్రధాన పోరాటం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోడీ నాయకత్వంలో రాజ్యాంగ మౌలిక విలువల పునాదులను ధ్వంసం చేస్తున్నది. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే వాటినికాపాడుకోలేం. దేశ భవిష్యత్తు అంధకారంలోకి పడిపోతుంది. దేశాన్ని రక్షించుకోవడం కోసమే ప్రతిపక్షాలు ఇండియా కూటమిలో ఉన్నాయి. బీజేపీకి 370, ఎన్డీయే కూటమికి 400కుపైగా సీట్లు అంటున్నారు ప్రధాని మోడీ. బీజేపీకి భయం పట్టుకుంది. 2019లో వచ్చిన ఫలితాలు రావేమోనసే ...13లో

ఓటమి భయంతోనే కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ అరెస్టు



ఎకరాకు రూ.25వేల పరిహారమివ్వాలి

- మళ్లీ బిందెలెందుకు ప్రత్యక్షమవుతున్నయ్..?
- రాష్ట్రానికి ఏం చెదలు పట్టింది
- 2వ తేదీన రైతుల పక్షాన కలెక్టర్లకు వినతిపత్రాలివ్వాలి
- అధైర్య పడకండి.. అండగా నేనుంటా :బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్
- మెదక్, సూర్యాపేట, జనగామ జిల్లాల్లో ఎండిన వరి పంటల పరిశీలన



నవతెలంగాణ-సూర్యాపేట/ జనగామ

రాష్ట్రంలో ఎండిపోయిన పంటలకు ప్రతి ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డిమాండ్ చేశారు. ఈ నష్టపరిహారం ఇచ్చేదాకా రాష్ట్ర ప్రభుత్వాన్ని 'వేటాడుతాం.. వెంటాడుతాం.. ధర్నాలు చేస్తాం' అని హెచ్చరించారు. అవసరమైతే ఎక్కడికక్కడ ...5లో

ఆ నలుగురి పని పట్టాల్సిందే..

- ఆ సీట్లు కచ్చితంగా గెలవాల్సిందే... : చేవెళ్ల, వరంగల్, పెద్దపల్లి, సికింద్రాబాద్ స్థానాలపై కేసీఆర్ నజర్
- రంజిత్‌రెడ్డి, కడియం, దానం నాగేందర్‌ను వదలొద్దంటూ ఆదేశాలు

చేవెళ్ల సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలంటూ సూచన

వివరాలు 5లో



మీ విధులు మీకు చెప్పాల్సిరావడం... అవమానకరంగా ఉంది

గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న వ్యాఖ్య

- పెద్ద నోట్ల రద్దు బ్లాక్‌మనీ ఉన్న వారికే లాభించింది
- సామాన్యులు ఇబ్బంది పడ్డారు

వివరాలు 3లో



రాష్ట్రపతికి ఇచ్చే మర్యాద ఇదేనా..!

న్యూఢిల్లీ: బీజేపీ నేత ఎల్‌కె అద్వానీకి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భారతరత్న ప్రదానం చేశారు. రాష్ట్రపతి నిలబడి ఉంటే ప్రధాని మోడీ కుర్చీపై ఆశీనులయ్యారు.కనీసం పక్కన మరో కుర్చీ లేకుంటే.. తన కుర్చీని ఇచ్చినట్లయితే ప్రధానికి గౌరవంగా ఉండేదని నెటిజన్లు తమ స్పందనను తెలియజేస్తూ పోస్టులు పెడుతున్నారు.

కాంగ్రెస్ గూటికి కడియం శ్రీహరి, కావ్య

- మాజీ ఎమ్మెల్సీ బీ. మోహన్‌రెడ్డి కూడా...
- కండువా కప్పిన సీఎం రేవంత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు, వరంగల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు.బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి కూడా ...13లో

కాంగ్రెస్ సీట్ల పంచాయితీకి నేడు శుభం కార్డు..!

సోనియా నేతృత్వంలో సీఈసీ భేటీ

- మిగిలిన నాలుగు స్థానాలపై నిర్ణయం
- ఢిల్లీకి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ సీట్ల పంచాయితీకి నేడు శుభం కార్డు పడనుందని ఆ పార్టీ వర్గాలంటున్నాయి. సోమవారం ఢిల్లీలో జరగనున్న సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి బయలుదేరి వెళ్లనున్నారు. పార్టీ అధినేత్రి సోనియా, రాహుల్, కేసీ.వేణుగోపాల్, అంబికా సోనీ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు పాల్గొనే ఈ సమావేశంలో మిగిలిన నాలుగు సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను కాంగ్రెస్ ఇప్పటికే మూడు విడుతలుగా 13 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్ స్థానాలకు నేడు అభ్యర్థులు ఖరారు కానున్నారు. ఖమ్మం నుంచి పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మల్లు నందిని, తుమ్మల యుగంధర్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ పేరు కొత్తగా తెరపైకి వచ్చింది. ఆ జిల్లాకు చెందిన మంత్రుల కుటుంబాల నుంచి ముగ్గురు టికెట్ ఆశిస్తుండటంతో వారందరినీ పక్కన పెట్టి రాజేంద్రప్రసాద్‌కు అవకాశం ఇవ్వడం ద్వారా ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అధిష్టానం ఓ ...13లో

గాజాలో కాల్పుల విరమణపై కైరోలో చర్చలు

- శాంతిని నెలకొల్పండి : ఈస్టర్ సందర్భంగా పోప్ పిలుపు
- శాశ్వత కాల్పుల విరమణకు మూడు దేశాల పిలుపు



గాజా : ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చేందుకు ఈజిప్ట్ రాజధాని కైరోలో ఆదివారం చర్చలు పునరుద్ధరించారు. ఇజ్రాయిల్ ...13లో

సికింద్రాబాద్‌లో.. బీఆర్ఎస్‌దే గెలుపు

- అంబర్‌పేట పాదయాత్రలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కిషన్ రెడ్డి ఓటమి ఖాయం
- హైదరాబాద్ ప్రజలు మరోసారి మద్దతివ్వాలని విజ్ఞప్తి
- 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండే పద్మారావు గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ఎంపీగా.. పదేండ్లలో రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన కిషన్ రెడ్డి హైదరాబాద్ నగరానికి, తెలంగాణకు ప్రత్యేకంగా అదనపు ప్రాజెక్టుగానీ, ఒక్క రూపాయి అదనపు నిధులు కానీ ఏమీ తెలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేట నియోజకవర్గంలో కేటీఆర్ పాదయాత్ర నిర్వహించారు. పటేల్ నగర్ ప్రాంతంలోని ప్రేమ్ నగర్ చౌరస్తా నుంచి ఆజాద్ నగర్, పటేల్ వాడల్లో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజల చేతిలో తిరస్కారానికి గురైన తర్వాత, గత ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచారన్నారు. గెలిచిన తర్వాత అటు అంబర్‌పేట నియోజకవర్గానికి గాని, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కానీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. కిషన్ రెడ్డికి దమ్ముంటే గత ఐదేండ్లలో తీసుకొచ్చిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచి ఈ ఎన్నికల్లో ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. గత ఎన్నికల్లో అనుకోకుండా గెలిచిన కిషన్ రెడ్డి, ఈసారి మాత్రం కచ్చితంగా ఓడిపోతారని అన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి చేసిన అభివృద్ధిని గుర్తుంచుకొని, తమ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కి మద్దతు ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గెలిచిన తర్వాత అధికారం కోసం ఢిల్లీకి పర్యటనలు చేసే నాయకులను కాకుండా, నిత్యం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండే పద్మారావు గౌడ్ లాంటి ప్రజా నాయకులు నియోజకవర్గానికి అవసరమని అన్నారు. బీఆర్ఎస్ కంచుకోటగా మారిన రాజధానిలో ఈసారి కూడా గులాబీ జెండా ఎగురుతుందని కేటీఆర్ తెలిపారు. కాగా, పాదయాత్రలో భాగంగా పలువురు ఇండ్లకు వెళ్లడంతోపాటు, మార్గమధ్యలో ఉన్న ప్రతి ఒక్కరిని కేటీఆర్ పలకరించుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, యువజన నాయకులు రామేశ్వర్ గౌడ్, ముఠా జై సింహ, డివిజన్ ప్రెసిడెంట్ సిద్ధార్థ ముదిరాజ్, సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, లింగారావు, మహేష్ ముదిరాజ్ భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేరళలో రూ.600.. తెలంగాణలో రూ.121

- ఉపాధి కూలి చెల్లింపులో భారీ వ్యత్యాసం
- ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే కొలతల పద్ధతి
- సగటు వేతనం రూ.272 కూడా అందని దౌర్భాగ్యస్థితి
- మూడు నెలలుగా కూలీల వేతనాలు పెండింగ్‌లోనే
- వేతనాల చెల్లింపు ఆధార్ అనుసంధానంతో తిప్పలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎర్రటెండలో పనిచేసినా ఉపాధి కూలీలకు కూలి అంతంతే దక్కుతున్నది. ఇప్పటిదాకా కూలీల రోజువారీ వేతనం రూ.272 ఉండగా...ఈ ఆర్థిక సంవత్సరంలో దాన్ని రూ.300కి పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం గొప్పలకు పోతున్నది. మరి క్షేత్రస్థాయిలో కూలీలకు అంత వేతనం అందుతుందా? అని పరిశీలిస్తే రాష్ట్రంలో సగటు వేతనం రూ.121.78 మాత్రమే వస్తోందని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా కేరళలోని వామపక్ష ప్రభుత్వం కూలీలకు రోజువారీ కూలి రూ.600ని చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం అమలు కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నది. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తూ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. వేతన చెల్లింపులో కేరళ, తెలంగాణ మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తున్నది. కర్నాటక, తమిళనాడు, ఏపీ, తదితర రాష్ట్రాలతో పోల్చి చూసినా మన రాష్ట్రంలో ఉపాధి కూలీలకు దక్కుతున్న వేతనం చాలా తక్కువనే. మళ్లీ అందులోనే రోజువారీగా ఖర్చులకు ఇచ్చే రూ.23 (మంచినీళ్ల ఖర్చు రూ.5, గడ్డపార సానకు రూ.10, రవాణా ఖర్చులు రూ.8)ను కలిపేస్తున్నారు. అంటే ఇక్కడ కూలీలకు వంద రూపాయల లోపే దక్కుతున్నది. సర్కారు ఇచ్చే అరకొర వేతనమూ నెలల తరబడి పెండింగ్‌లోనే ఉన్నది. గతంలో వారం వారం పేమెంట్ అందేది. ఒకవేళ 15 రోజుల్లోపు కూలి ఇవ్వకపోతే కూలీలు కోర్టుకెళ్లే అవకాశముంది. ఎన్నినెలలు ఇవ్వకపోతే చట్టప్రకారం వడ్డీ కట్టించి ఇవ్వాలనే నిబంధన ఉంది. కేరళలో ప్రతి 15 రోజులకోసారి కూలీల డబ్బులు చెల్లించబడుతున్నాయి. వేతనాల రెగ్యులర్ చెల్లింపు శాతం 99.98 శాతముంది. 0.2 శాతం కూడా టెక్నికల్, ఇతరత్రా సమస్యల వల్ల ఆలస్యమయ్యేవే. 'మూడు నెలలుగా వేతనాలు అందట్లేదు. కూలీలు కూడా పనులకు రావడానికి పెద్దగా ఆసక్తి చూపటం లేదు. ఒకప్పుడు మా ఊర్లో 400 నుంచి 500 మందిదాకా పనులకొచ్చేవారు. ఇప్పుడు రమ్మని పిలిచినా వంద దాటట్లేదు' అని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ ఫీల్డు అసిస్టెంటు చెప్పుకొచ్చారు. పేస్లిప్పులు కూడా కొన్నేండ్లు ఇవ్వడం లేదు. దీంతో రోజువారీ కూలి ఎంత పడుతుందో కూలీలకు అర్థం కాని పరిస్థితి. వేతనాలు తక్కువ పడటానికి కొలతల ప్రకారం చెల్లించడమేనని ఉపాధి హామీ కూలీల తరపున పోరాడే వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర సంఘాలు చెబుతున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడే కొలతల పద్ధతిని అనుసరిస్తున్నారు. గ్రామంలోనే మ్యానువల్ పద్ధతిలో చెల్లించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. వేతనాల చెల్లింపు ఆధార్‌తో అనుసంధానం చేయడం కూడా సమస్యకు ఒక కారణంగా చూడొచ్చు. రోజుకు రెండు సార్లు పని ప్రదేశం నుంచి ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయడం కష్టతరంగా మారింది. పనిప్రదేశాల్లో సరిగా సిగ్నల్స్ లేకపోవడం ఓ సమస్యగా మారింది. సిగ్నల్స్ కోసం అటూ ఇటు తిరగడం, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ అయ్యేదాకా కూర్చోవటం ఇబ్బందికరంగా మారింది.

వందరోజుల పని అంతంతే..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పేదలకు కనీసం రెండు వందల రోజుల పని కల్పించాలని డిమాండ్ వస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం మాత్రం ఒక కుటుంబానికి కనీసం వంద రోజుల పాటు కూడా పని కల్పించలేకపోతున్నది. మన రాష్ట్రంలో 58,59,030 జాబుకార్డులుండగా..అందులో 29వ తేదీ వరకు 30 లక్షల కుటుంబాలకే వందరోజుల పని దక్కిందని ప్రభుత్వ గణాంకాలే ఘోషిస్తున్నాయి. అందులోనూ కుటుంబంలో ముగ్గురు సభ్యులు పనికి పోతే ఒక్కో కూలి కనీసం 30 రోజుల పని కూడా లభించని పరిస్థితి. మరోవైపు మెటీరియల్ కంపోనెంట్‌ను 49 శాతానికి పెంచారు. ఇలా చేయడమంటే కాంట్రాక్టర్లను బతికించడమే. ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే చట్టం మూల సూత్రానికే కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నది.

కొలతలేయడం ఆపేయాలి..ప్రతి వారం బిల్లులు చెల్లించాలి

బి.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

రాష్ట్రంలో ఉపాధి పనులకు కొలతలేయడం మానేయాలి. దేశంలో ఎక్కడా లేని పద్ధతిని ఇక్కడ అమలు చేయటం సబబు కాదు. వేతనాలు బ్యాంకు అకౌంట్లలో వేయటం సరిగాదు. మ్యానువల్ పద్ధతిలో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని వేతనాలను చెల్లించాలి. నెలల తరబడి బిల్లులు ఆపడం సరిగాదు. ప్రతి వారం బిల్లులను క్లియర్ చేయాలి. మేట్ల వ్యవస్థను పునరుద్ధస్తే కూలీల సంఖ్య పెరిగే అవకాశముంటుంది. చట్టం మూలసూత్రాలను దెబ్బతీయకుండా వెనుకబడిన సామాజిక తరగతులకు ఉపాధి మరింత కలిగించేలా చూడాలి.

శిల్పారామంలో తిండికి తిప్పలు

- ఫుడ్ స్టాళ్లు లేక పర్యాటకుల పాట్లు
- రెండు సార్లు సింగిల్ బిడ్ రావడంతో టెండర్లు రద్దు
- ఎన్నికల కోడ్‌తో ఆగిన ప్రక్రియ
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటున్న సందర్శకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని శిల్పారామంలో సందర్శకులు తిండికి తిప్పలు పడుతున్నారు. గత రెండు నెలలుగా ఫుడ్ స్టాళ్లు లేక పోవడంతో పర్యాటకులకు పాట్లు తప్పడం లేదు. కాలపరిమితి ముగియక ముందే కొత్త దుకాణలను సకాలంలో ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా 8 స్టాళ్లకు గాను రెండు స్టాళ్లు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. దాంతో శిల్పారామానికి వచ్చే సందర్శకులకు ఆహారం అందుబాటులో ఉండటం లేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



కళలు, కళలు, చేతివృత్తులు, శిల్పాలు కుప్పనూర్పినట్టు ఉండే అద్భుతమైన వేదిక... హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పారామం. 65 ఎకరాల విశాల స్థలంలో నిర్మించిన ఈ గ్రామం పల్లె, ప్రకృతిని ప్రతిబింబిస్తుంది. గ్రామీణ భారతాన్ని ఆవిష్కరించే సాంస్కృతిక కళా నిలయాన్ని తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశీ పర్యాటకులు వస్తుంటారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ కళా ప్రాంగణానికి విచ్చేస్తున్న సందర్శకులు రెండు నెలలుగా ఆహారం కోసం అవస్థలు పడుతున్నారు. శిల్పారామంలో మొత్తం 8 ఫుడ్ కోర్టులున్నాయి. వాటి కాలపరిమితి ముగియడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 11న మొదటి దఫా టెండర్లను ఆహ్వానించించారు. ఒక్క పాప్‌కార్న్ షాపుతో పాటు మరో ఫుడ్ కోర్టుకు మాత్రమే రెండు బిడ్లు దాఖలయ్యాయి. ఎక్కువ మొత్తం దాఖలు చేసిన బిడ్లకు రెండు షాపులను అప్పగించారు. మిగతా ఆరు దుకాణాలకు గాను ఫిబ్రవరి 24న రెండోసారి టెండర్లను పిలవగా సింగిల్ బిడ్డే వచ్చింది. దాంతో వాటిని రద్దు చేశారు. ఆ తర్వాత మార్చి 9న మూడోసారి టెండర్‌ను పిలిచారు. అయితే ఈ సారి వాటిని తెరవక ముందే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దాంతో దుకాణల ఏర్పాటు ప్రక్రియ తాత్కాలింగా నిలిచి పోయింది. అయితే షెడ్యూల్ రాకముందే ఈ ప్రక్రియను చేపట్టినందున టెండర్లు తెరిచేందుకు అనుమతివ్వాలని ఎలక్షన్ కమిషన్‌కు ఈ నెల 19న శిల్పారామం అధికారులు లేఖ రాశారు. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోనున్నప్పటికి గత రెండు నెలలుగా ఫుడ్ కోర్టులు లేక పోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అత్యవసరమొస్తే బయటకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉన్న షాపులకు తాత్కాలికంగా అనుమతివ్వడమా? ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడమా? అనే విషయంపై అధికారులు ఎటూ తేల్చుకోలేక పోతున్నట్టు సమాచారం. ఏదో ఒక నిర్ణయం తీసుకుని తగు ఏర్పాట్లు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నాం

కిషన్ రావు, స్పెషల్ అధికారి, శిల్పారామం శిల్పారామంలో ఫుడ్ కోర్టుల టెండర్ ప్రక్రియలో జాప్యం కారణంగా సందర్శకులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. హరేరామ, హరేకృష్ణ సంస్థ ద్వారా తాత్కాలింకంగా ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయించాం. అలాగే టెండర్లను నిబంధనల ప్రకారమే చేపట్టాం. ఫుడ్ స్టాళ్లకు మొదటి సారి టెండర్లను ఆహ్వానించినప్పుడు రెండు ఫుడ్ కోర్టులకు మాత్రమే రెండేసి బిడ్లు దాఖలయ్యాయి. దాంతో ఎక్కువ కోట్ చేసిన వారికి ఖరారు చేశాం. మిగతా ఆరు ఫుడ్ స్టాళ్లకు రెండోసారి సింగిల్ బిడ్ మాత్రమే దాఖలు కావడంతో వాటిని రద్దు చేశాం. మూడోసారి ఎన్నికల కోడ్ వల్ల ప్రక్రియ నిలిచి పోయింది. ఎన్నికల సంఘానికి లేఖ రాశాం. అక్కడినుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం

పాక్‌లో భారీ వర్షాలు

- 24 గంటల్లో 8 మంది పిల్లలు మృతి



పాకిస్థాన్ : పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లోని వివిధ జిల్లాల్లో కురుస్తున్న తీవ్ర వర్షాల వల్ల జనజీవనం స్తంభించింది. అనేక ఇళ్లు కూలిపోవడంతోపాటు పలు చోట్ల తీవ్ర నష్టం వాటిల్లినట్టు విపత్తు నిర్వహణ అధికార ప్రతినిధి అన్వర్ షాజాద్ తెలిపారు. పలు ఘటనల్లో గత 24 గంటల్లోనే 8 మంది పిల్లలు మరణించగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడినట్టు వెల్లడించారు. మృతుల్లో మూడు నుంచి ఏడేళ్ల వయసున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు ఉన్నారని చెప్పారు. ఈ నెల ప్రారంభంలోనూ ఇదే ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వల్ల సుమారు 30 మందికి పైగా మరణించిన సంగతి విదితమే.

"ఒడెస్సా పతనం అనివార్యం"

ఉక్రెయిన్‌ను హెచ్చరించిన మస్క్

రష్యాతో జరుగుతున్న యుద్ధంలో రోజురోజుకూ ఉక్రెయిన్ పరిస్థితి బలహీన పడుతుందని, మాస్కోతో చర్చలకు కూర్చునే ముందు కీవ్ ఎంత భూభాగాన్ని కోల్పోతుంది, ఎంత మంది జీవితాలను వృథా చేస్తుంది అనేదే "అసలు ప్రశ్న" అని టెస్లా, స్పేస్‌ఎక్స్ సిఇఓ ఎలోన్ మస్క్ అన్నాడు. గత సంవత్సరం ఉక్రెయిన్ చాలా గొప్పగా చెప్పుకున్న ఎదురుదాడి విఫలమవుతుందని "ఏ మూర్ఖుడైనా ఊహించగలడు" అని, "సహజ సరిహద్దులులేని భూభాగాన్ని రక్షించుకోవటం చాలా కష్టం" అని శనివారం తన ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో చేసిన ఒక పోస్ట్‌లో మస్క్ పేర్కొన్నారు. "ఆయుధ పాటవంగానీ, వైమానిక దళ ఆధిక్యతగానీ లేని ఉక్రెయిన్ అత్యంత బలమైన రష్యా సైన్యంపై దాడి చేయడం విషాదకరమైన పరిణామాలకు దారితీసిందని" అని మస్క్ రాశారు.



రష్యాతో కొనసాగుతున్న యుద్ధంలో 4,44,000 మంది ఉక్రెయిన్ సైనికులు మరణించారని, వీరిలో గత సంవత్సరం ఎదురుదాడిలో 166,000 కంటే ఎక్కువ మంది చనిపోయారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ గత నెలలో అంచనా వేసింది. అయినప్పటికీ, ఫిబ్రవరి 24, 2022 నుండి తమ దేశానికి చెందిన 31,000 మంది సైనికులు మాత్రమే మరణించారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఫిబ్రవరిలో పేర్కొన్నారు. యుద్ధం మరింత కాలం కొనసాగితే ఉక్రెయిన్ తిరిగి పొందలేనంతగా మరింత భూభాగాన్ని కోల్పోతుందని, చివరకు ఒడెస్సా కూడా పతనమై ఉక్రెయిన్‌కు నల్ల సముద్రం అందుబాటులో లేకుండా పోతుందని, ఇలా జరగకముందే ఉక్రెయిన్ రష్యాతో శాంతి చర్చలు ప్రారంభించటం మంచిదని తన అభిప్రాయంగా మస్క్ రాశారు.

2022 ప్రారంభంలో సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి ఎలోన్ మస్క్ ఉక్రెయిన్‌పై తన అభిప్రాయాన్ని అనేక సార్లు మార్చుకున్నారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి స్టార్‌లింక్ ఇంటర్నెట్ టెర్మినల్స్, ఉపగ్రహ ఆధారిత నెట్‌వర్క్‌కు యాక్సెస్‌ను కీవ్‌కు ఆయన ఉచితంగా అందించారు. అయితే నల్ల సముద్రంలోని రష్యా నౌకాదళానికి వ్యతిరేకంగా ఉక్రెయిన్ ఉపయోగిస్తుందనే భయంతో క్రిమియా సమీపంలో ఈ సేవలను సక్రియం చేయడానికి ఆయన నిరాకరించారు. ఒకవేళ ఈ సేవల ప్రభావంతో యుద్ధం తీవ్రతరమైతే అందులో తనూ భాగస్వామిగా మారేవారే. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం గురించి విస్తృతంగా మాట్లాడటానికి మస్క్ తన ఎక్స్ ఖాతాను ఉపయోగిస్తున్నారు.

క్రిమియాపై తనకు హక్కు ఉన్నదనే వాదనను ఉక్రెయిన్ విడిచిపెట్టి, తటస్థతను ప్రకటించాలని, నాలుగు ప్రాంతాలను- డొనెట్స్క్, లుగాన్స్క్, ఖెర్సన్, జాపోరోజీ- రష్యన్ ఫెడరేషన్‌లో చేరడంపై కొత్త రిఫరెండా నిర్వహించడానికి అనుమతించాలని ఆయన ప్రతిపాదించి ఒక సంవత్సరానికి పైగా అవుతోంది. ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభం కావటానికి ముందు కీవ్, పాశ్చాత్య దేశాలకు రష్యా చేసిన ప్రతిపాదనతో ఈ ప్రతిపాదన పోలి ఉంది. అయితే మాస్కో మొదట్లో డొనేట్స్క్, లుగాన్స్క్‌లలో స్వయంప్రతిపత్తి కోసం మాత్రమే డిమాండ్ చేసింది. ఉక్రెయిన్‌తో అర్థవంతమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని మాస్కో నొక్కిచెప్పింది. అయితే ఉక్రేనియన్ నాయకత్వం "భౌతిక వాస్తవికతను" అంగీకరించడానికి సిద్ధంగా లేదని రష్యా అంటోంది. 2022 నుండి ఉక్రెయిన్ సరిహద్దులు తీవ్రంగా మారిన వాస్తవాన్ని ఉక్రెయిన్ పరిగణనలోకి తీసుకోవాలని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ శనివారం అన్నారు.

ప్రపంచ సమకాలీనం

ఇజ్రాయెల్‌కు రహస్యంగా

మరిన్ని బాంబులను పంపుతున్న అమెరికా


- వాషిగ్టన్ పోస్టు

గాజా పట్టణం రఫాలో ఇజ్రాయెల్ చొరబాటు గురించి బహిరంగంగా ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ, బిలియన్ డాలర్ల విలువైన బాంబులు, విమానాలను ఇజ్రాయెల్‌కు సరఫరా చేసే ఆర్డర్‌పై అమెరికా సంతకం చేసిందని వాషింగ్‌టన్ పోస్ట్ శుక్రవారం రాసింది. దాదాపు 1,800 ఎమ్ కే 84 రకం 2,000-పౌండ్ల బాంబులు, 500 ఎమ్‌కే 82 రకం 500-పౌండ్ల బాంబులు ఇజ్రాయెల్‌కు అందనున్న ఆయుధాలలో ఉన్నాయని అనామక పెంటగాన్, వైట్ హౌస్ అధికారులు వాషింగ్‌టన్ పోస్టు పత్రికకు తెలిపారు. అంతేకాకుండా స్టేట్ డిపార్ట్‌మెంట్ దాదాపు 2.5 బిలియన్ల విలువ గల 25 ఎఫ్, 35ఏ విమానాలను, ఇంజన్‌లను బదిలీ చేయడానికి అంగీకరించింది. అమెరికా అనుంగు మిత్రదేశమైన ఇజ్రాయెల్‌కు అందించనున్న 3 బిలియన్ డాలర్లకు మించిన వార్షిక సైనిక సహాయంలో భాగంగా ఇది ఉంది.



పాలస్తీనా ఆరోగ్య అధికారులు అందించిన తాజా గణాంకాల ప్రకారం, గాజాలో మార్చి చివరి నాటికి ఇజ్రాయెల్ బాంబు దాడులలో సంభవించిన మరణాల సంఖ్య 32,000కు పెరగడానికి అమెరికా సరఫరా చేసిన బాంబులు కూడా ఒక కారణం. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ గత సంవత్సరం గాజాలోని జబాలియా శరణార్థి శిబిరం, అల్-షాటీ శరణార్థి శిబిరం చుట్టూ జరిపిన దాడులలో 2,000-పౌండ్ల బంకర్ బస్టర్ బాంబులను ఉపయోగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఒక్క జబాలియా బాంబు దాడులలోనే 100 మందికి పైగా ప్రాణాలను కోల్పోయారు. ఈ దాడులను ఐక్యరాజ్య సమితి "యుద్ధ నేరాలకు సమానమైన అసమాన దాడులు" అని పిలిచింది.

ఐటీ నోటీసులు అన్ని పార్టీలు, ప్రజలకు ఓ హెచ్చరిక : చిదంబరం




చెన్నై : ఆదాయ పన్ను శాఖ (ఐటి) కాంగ్రెస్‌కు ఇచ్చిన నోటీసులు దేశంలోని అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రజలకు ఇచ్చిన అతిపెద్ద హెచ్చరిక అని కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయడమే బిజెపి ఉద్దేశమని అన్నారు. పుదుకొట్టాయ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్లతో కమలం పార్టీ రూ.8,250 కోట్లు దోచుకున్నప్పటికీ.. బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్‌పై రూ.135 కోట్ల జరిమానా విధించిందని అన్నారు. బిజెపి అన్ని పార్టీలను నాశనం చేయాలనుకుంటుందని, రాజకీయ పార్టీలకు, ప్రజలకు ఇది ఓ హెచ్చరిక అని అన్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత అన్నాడిఎంకె ఎన్‌డిఎ కూటమిలో చేరుతుందని చెప్పారు.

కర్నూలు జిల్లాలో మరో విషాదం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం
- ఇద్దరు వ్యవసాయ కార్మికులు దుర్మరణం

ఆలూరు : కర్నూలు జిల్లాలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యవసాయ కార్మికులు మృతి చెందారు. 20 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... మండల కేంద్రమైన మద్దికేర గ్రామానికి చెందిన 40 మంది వ్యవసాయ కార్మికులు చిప్పగిరి గ్రామంలో మిరపకాయల కోతకు ఆదివారం వెళ్లారు. అనంతరం వారు టాటా ఏస్ వాహనంలో తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. కోతులమాను వద్ద ఆ వాహనం టైరు పేలింది. దీంతో, అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం ముందు కూర్చున్న ఆదిలక్ష్మి (50), తాయమ్మ (48) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయాలైన ఐదుగురిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి, స్వల్పంగా గాయాలైన 15 మందిని గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం మండల కార్యదర్శి రవికుమార్ కోరారు.



'హత్తిబెళగల్' ప్రమాదంలో మరో ఇద్దరు మృతి

ఆలూరు మండలం హత్తిబెళగల్ బస్టాండ్ ఆవరణలో శనివారం ఆటో బోల్తా పడిన ఘటనలో వ్యవసాయ కార్మికురాలు మస్తానమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో ఇద్దరు వ్యవసాయ కార్మికులు ఆదివారం మరణించారు. ఆదోనిలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హులేబీడు గ్రామానికి చెందిన దస్తగిరమ్మ (55), కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న షేకున్ బీ (30) వారిలో ఉన్నారు. దీంతో, మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది.



ఢిల్లీ రాంలీలా మైదానంలో జనప్రవాహం..

కేజ్రీవాల్ సతీమణి సునీతతో హేమంత్ సోరెన్ సతీమణి కల్పన



ఇండియా గుండెచప్పుడు...



రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటం

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటమన్నారు. 'ఆర్ఎస్ఎస్, బీజేపీ విషం. దానిని రుచి చూడకండి. వారు దేశాన్ని నాశనం చేస్తున్నారు' అని ఆయన అన్నారు. "దేశంలో బీజేపీ నియంతృత్వ పాలన కొనసాగిస్తోంది. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలయ్యింది. మీరంతా నియంతృత్వం కోరుకుంటున్నారా..? ప్రజాస్వామ్యం కోరుకుంటున్నారా..?' అని సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ఖర్గే ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేస్తే ప్రాణం మీదకు తెచ్చుకున్నట్టేనని ఆయన అన్నారు. 'భిన్నత్వంలో ఏకత్వానికి ఇది ఒక వేదిక. మన భిన్నత్వంలో ఏకత్వం ఉంది. అందుకే ఈ ర్యాలీని నిర్వహించాం.' అని చెప్పారు. ప్రతిపక్షాలు ఐక్యంగా వ్యవహరించాలని అప్పుడే బీజేపీని ఓడించగలమని అన్నారు.

దేశాన్ని రక్షించడం భారతీయ సమాజం కర్తవ్యం : డి రాజా

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా మాట్లాడుతూ బీజేపీని తరిమికొట్టి దేశాన్ని రక్షించడం భారతీయ సమాజం కర్తవ్యమని అన్నారు. "ఈడి, ఇతర కేంద్ర సంస్థలు ప్రతిపక్షాలను వేటాడుతున్నాయి. కేజ్రీవాల్, సోరెన్‌ల అరెస్టులే అందుకు నిదర్శనం. రాజకీయ నాయకులు రాజ్యాంగ నైతికతను పాటించాలని అంబేద్కర్ చెప్పారు. మోడీకి ఆ నైతికత ఉందా? అని అడుగుతున్నాం. దేశం తీవ్ర సంక్షోభంలో ఉంది. రాజ్యాంగాన్ని మార్చి, దేశాన్ని మత రాజ్యంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఎన్నికల్లో బీజేపీని ఓడించి లౌకికవాదాన్ని కాపాడాలి" అని పిలుపునిచ్చారు.

ఎన్నికల్లో అవినీతి ప్రభుత్వాన్ని కూల్చాలి : దీపాంకర్ ముఖర్జీ

సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ ముఖర్జీ మాట్లాడుతూ "ఎలక్టోరల్ బాండ్ స్కామ్ దేశం ఇప్పటివరకు చూడని అతిపెద్ద కుంభకోణం, ప్రభుత్వాలను పడగొట్టి, కార్పొరేట్ల నుంచి బాండ్ల ద్వారా సంపాదించిన కోట్లతో ఎంపీలు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. ధరకు అమ్ముడుపోని వారిని నకిలీ కేసుల్లో ఇరికించి జైలు పాలు చేస్తున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నే నాశనం చేసే ప్రయత్నం జరుగుతోంది. ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ దేశంలోనే అతిపెద్ద అవినీతి పార్టీగా అవతరించింది. మోడీ ప్రభుత్వం అవినీతి ప్రభుత్వంగా మారింది. ఎన్నికల్లో అవినీతి ప్రభుత్వాన్ని కూల్చాలి" అని పిలుపునిచ్చారు.

బీజేపీని చిత్తుగా ఓడించాలి : ఫరూక్ అబ్దుల్లా

రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తమ లక్ష్యమని, తుదిశ్వాస విడిచే వరకు తమ పార్టీ ఇండియాతోనే ఉంటుందని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా అన్నారు. "అన్ని మతాల వారు కలిసిమెలిసి ఉండే పరిస్థితి లేదు. ఈ విపత్కర పరిస్థితికి వ్యతిరేకంగా మనమంతా కలిసి గళం ఎత్తుదాం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా ముప్పు పొంచి ఉంది. ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలి" అని పిలుపునిచ్చారు.

ఓట్లతోనే దేశాన్ని కాపాడుకోగలం : అఖిలేష్

ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కూడా బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద అబద్ధాలకోరు పార్టీ బీజేపీ అని మండిపడ్డారు. 400 సీట్లు దాటాలని నినాదాలు చేస్తున్న వారు ఎందుకు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌లను ఎందుకు అరెస్టు చేసి జైలుకు పంపారని ప్రశ్నించారు. "నేడు, దేశ ప్రజలే కాదు, ప్రపంచం మొత్తం భారతదేశాన్ని చిన్నచూపు చూస్తోంది. కేంద్ర సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోంది. బీజేపీ ఏజెన్సీలను చూపించి డబ్బులు వసూలు చేసింది. వారు ఈ డబ్బును ప్రతిపక్షాలపై ఉపయోగించుకుంటారు. మీ ఓటు మాత్రమే ఈ దేశాన్ని, మన రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, 90 శాతం జనాభాను కాపాడుతుంది" అని అఖిలేష్ యాదవ్ సూచించారు.

అధికారం శాశ్వతం కాదు : ప్రియాంక

అధికారం శాశ్వతం కాదు, వచ్చి పోతుందని మోడీకి శ్రీరాముడు ఇచ్చిన సందేశాన్ని ప్రియాంక గాంధీ గుర్తుచేశారు.



సోనియాతో తనయ ప్రియాంక

"అధికారం శాశ్వతంగా ఉండదు. శక్తి వస్తుంది. పోతుంది. పడిపోతుంది. అహం ఒక రోజు కూలిపోతుంది. ఇది రాముడు, ఆయన జీవిత సందేశం" అని అన్నారు. ప్రియాంక గాంధీ భారతీయ సమాజానికి సంబంధించిన ఐదు డిమాండ్లను లేవనెత్తారు. "ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. ఈడీ, సీబీఐ, ఐటీ శాఖల వ్యతిరేక వేటను ఆపాలి. కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌లను తక్షణమే విడుదల చేయాలి. ప్రతిపక్షాలపై ఆర్థిక దాడి ఆపాలి. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించాలి" అని కోరారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఓటు : చంపై సోరెన్

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓటు వేయాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపై సోరెన్ పిలుపునిచ్చారు. బీజేపీ నియంతృత్వాన్ని, భావజాలాన్ని ఎదగనివ్వబోమన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన ప్రజల కోసం పనిచేస్తున్నందుకు హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీ మేం కలిసి ఉన్నామనే సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. 'మేం కలిసికట్టుగా బీజేపీ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఉన్నాం' అని అన్నారు. "హేమంత్ సోరెన్ ఎప్పుడూ తలవంచలేదు. భవిష్యత్‌లో అలా చేయడు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, నియంతృత్వాన్ని తొలగించాలి" అని నొక్కివక్కాణించారు.

ఒకే పార్టీ, ఒకే ప్రభుత్వం దేశానికి ప్రమాదం : ఉద్ధవ్ ఠాక్రే

ఒకే వ్యక్తి, ఒకే పార్టీ ప్రభుత్వం దేశానికి ప్రమాదమని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు. "దేశం నియంతృత్వం దిశగా పయనిస్తోంది. మొన్నటి వరకు అనుమానమే ఉండేది. ఇప్పుడు నిజమవుతోంది. ముందు ఆరోపణలు చేస్తారు. ఆ తరువాత జైల్లో పెడుతారు. బీజేపీ, మేం ఇద్దరం అన్నదమ్ములమైతే, తమ్ముళ్లు ఎలా మౌనంగా ఉంటున్నారు. దేశం మొత్తం కల్పన, సునీత వెంట ఉంది. భారతీయులు భయపడరు. పోరాడుతారు. బీజేపీ కేంద్ర సంస్థలను మిత్రపక్షాలుగా ప్రకటించాలి. ర్యాలీ ఎన్నికల ప్రచారం కాదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం దీని లక్ష్యం" అని ఆయన వెల్లడించారు. బీజేపీ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాలు గెలుచుకోవాలని కలలు కంటోందని, ఒక పార్టీ, ఒక వ్యక్తి సారథ్యంలో నడిచే ప్రభుత్వం అధికారం కోల్పోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. గతంలో అవినీతిలో కూరుకుపోయిన వారిని బీజేపీ వాషింగ్‌మెషీన్‌లో శుభ్రం చేసి పునీతులను చేస్తోందని ఎద్దేవా చేశారు. అవినీతిపరులతో నిండిపోయిన పార్టీ ప్రభుత్వాన్ని ఎలా నడుపుతుందని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన బాధ్యత : శరద్ పవార్

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన బాధ్యతని ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ అన్నారు. "ఈ ప్రభుత్వం (కేంద్ర ప్రభుత్వం) ఢిల్లీ సీఎం, జార్ఖండ్ సిఎంలను అరెస్టు చేసింది. వివిధ రాష్ట్రాలకు చెందిన అనేక మంది నాయకులనూ జైలులో పెట్టింది. ఈ చర్య ప్రజాస్వామ్యంపైనా, రాజ్యాంగంపైనా దాడి. దాన్ని కాపాడుకోవడం మన బాధ్యత" అని అన్నారు.

అత్యంత అవినీతిమయం : మెహబూబా ముఫ్తీ

పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. మోడీ ప్రభుత్వం అత్యంత అవినీతి ప్రభుత్వమని విమర్శించారు. "వారు నిధుల దుర్వినియోగంతో అవినీతికి పాల్పడ్డారు. ఇప్పుడు రికవరీ కోసం ఈడీని ఉపయోగిస్తున్నార"ని దుయ్యబట్టారు. "ప్రస్తుతం, దేశం సవాలుతో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోంది. సరైన విచారణ లేకుండానే వ్యక్తులను నిర్బంధిస్తున్నారు. ఇది 'కలియుగ్ కా అమృత్ కాల్'ను పోలి ఉంటుంది. ఉమర్ ఖలీద్ లేదా మహ్మద్ జుబేర్ వంటి నిర్దిష్ట వ్యక్తులే కాదు, ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, నాతో పాటు మాజీ సిఎంలు ప్రస్తుతం గృహ నిర్బంధంలో ఉన్నారు. చట్టాన్ని ధిక్కరించిన వారిని దేశద్రోహులుగా పరిగణిస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

మోడీ ప్రభుత్వం జీరో వారెంటీ : డెరెక్ ఓబ్రెయిన్

టీఎంసీ నేత డెరెక్ ఓబ్రెయిన్ మాట్లాడుతూ టీఎంసీ ఇండియా ఫోరంలో భాగంగానే ఉందని, ఎప్పటికీ ఉంటుందని అన్నారు. ప్రజాస్వామ్యం, సంస్థల రక్షణ విషయంలో మోడీ ప్రభుత్వం జీరో వారెంటీ ఇస్తుందని విమర్శించారు. ఈ ర్యాలీ ప్రజాస్వామ్యం పోరాటంలో భాగమని అన్నారు. ఈ మేరకు రాసి ఉన్న బ్లాక్ టీ షర్టును ఆయన ధరించారు.

దేశమంతటా నిరసనలు : గోపాల్ రాయ్

మార్చి 21 తరువాత దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత గోపాల్ రాయ్ అన్నారు. "సిట్టింగ్ సిఎంను ఎందుకు అరెస్ట్ చేశారో ఎవరికీ అర్థం కావడం లేదు. అయితే ఇది అరవింద్ కేజ్రీవాల్ మాత్రమే కాదు. ఢిల్లీ సిఎం అరెస్ట్ కాకముందే జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సోరెన్ అరెస్ట్ అయ్యారు. ఈడీ, సీబీఐ దుర్వినియోగంతో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోంది" అని గోపాల్ రాయ్ దుయ్యబట్టారు. నిజం గెలుస్తుందని మరో మంత్రి కైలాష్ గహ్లోట్ అన్నారు.

జైలులో ఉన్న ఢిల్లీ మాజీ ఆరోగ్య మంత్రి సత్యేంద్ర జైన్ భార్య పూనమ్ జైన్ కూడా ర్యాలీకి హాజరయ్యారు. బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన ర్యాలీ తరువాత రాంలీలాలో ర్యాలీ నిర్వహించారు.



హేమంత్ సోరెన్ సతీమణి కల్పన, కేజ్రీవాల్ సతీమణి సునీతతో బృందాకరత్



వేదికపై రాహుల్, శరద్ పవార్, ఖర్గే



దేశం ఏకమౌతోంది : ఏచూరి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని అధికారం నుంచి తరిమికొడతారని చెప్పారు. ఈస్టర్ పునరుత్థాన దినమని, దేశ పునరుత్థానం రాంలీలాతో ప్రారంభమవుతుందని అన్నారు. '1975 ర్యాలీలో జెపి స్వేచ్ఛ, బానిసత్వం నిర్మూలన అనే నినాదాన్ని లేవనెత్తారు. ఈ రోజు మళ్లీ అదే నినాదం ఎత్తాల్సిన సమయం వచ్చింది.' అని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలన్నింటినీ ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుందని, అవినీతి రాజ్యమేలుతోందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆకలి పెరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడం ద్వారానే ఈ కష్టాల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. 'క్షీరసాగర మథనంలో అమృత కలశం మొదట దుష్టశక్తుల చేతికి చేరింది. అది ప్రస్తుత పరిస్థితి. దుష్ట శక్తుల నుంచి అమృత కలశాన్ని స్వాధీనం చేసుకోవాలి. అప్పుడే నిజమైన అమృతకాలం సాధ్యమవుతుంది. మతతత్వ శక్తులను ఓడించడం ద్వారానే భారతదేశాన్ని రక్షించగలం' అని చెప్పారు.

అవకాశం ఇస్తే నవ భారతాన్ని నిర్మిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కరెంటు, కరెంటు కోతలు ఉండవు. పేదలకు ఉచిత విద్యుత్, ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రతి జిల్లాలో మల్టీ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రి, రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ మద్దతు ధర, ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హోదా వంటి హామీలు వచ్చే ఐదేళ్లలో అమలు చేస్తామని వెల్లడించారు. ఇందుకోసం ఆర్థిక ప్రణాళికను కూడా సిద్ధం చేసినట్లు కేజ్రీవాల్ సందేశంలో పేర్కొన్నారు.

"మీ కేజ్రీవాల్ మీ కోసం జైలు నుంచి ఒక సందేశం పంపారు. సందేశం వినిపించే ముందు మిమ్మల్ని ఒకటి అడగాలని అనుకుంటున్నాను. నా భర్తను మన ప్రధాని నరేంద్ర మోడీ జైలుకు పంపారు.

ప్రధాని చేసినది సరైన పనేనా? కేజ్రీవాల్ నిజమైన దేశభక్తుడు, నిజాయితీ పరుడని మీరు విశ్వసిస్తున్నారా? ఈ బీజేపీ వాళ్లు కేజ్రీవాల్ జైలులో ఉన్నారని, రాజీనామా చేయాలని అంటున్నారు. ఆయన రాజీనామా చేయాలా? మీ కేజ్రీవాల్ ఒక సింహం. వాళ్లు ఎంతోకాలం ఆయనను జైలులో ఉంచలేరు" అని సభికులను ఉద్దేశించి ఉద్వేగంగా సునీత ప్రసంగించారు.

రాజ్యాంగాన్ని హైజాక్ చేశారు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఈవీఎంల రిగ్గింగ్, సోషల్ మీడియాలో అవకతవకలు, మీడియాపై ఒత్తిడి చేస్తే తప్ప బీజేపీకి 180 సీట్లు దాటవని స్పష్టం చేశారు. అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలు స్తంభింపజేశారని, ఇవి ఎలాంటి ఎన్నికలని ఆయన ప్రశ్నించారు. "మీరు మ్యాచ్ ఫిక్సింగ్ (క్రికెట్‌లో) గురించి విన్నారా? లోక్‌సభ ఎన్నికలను చూస్తున్నాం. అంపైర్‌ను ఎవరు ఎంపిక చేస్తున్నారు? నరేంద్ర మోడీ. ఇద్దరు ముఖ్యమైన ఆటగాళ్లను ఎవరు అరెస్టు చేశారు? మోడీ. ఈ ఎన్నికల్లో మోడీ మ్యాచ్ ఫిక్సింగ్‌ను కూడా చేస్తున్నారు" అని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. ఈ పోరాటం భారతదేశపు గుండె చప్పుడుకు ప్రాతినిధ్యం వహించే రాజ్యాంగాన్ని పరిరక్షించడానికని అన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే ప్రయత్నంలో దేశంలోని కొంతమంది ధనవంతులు ప్రధాని మోడీకి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంపై దాడి జరిగిన రోజున అది దేశానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని, పేదలు, దళితులు, వెనుకబడిన తరగతులు, ఇతరులందరూ తమ హక్కులను కోల్పోతారని వివరించారు.

జార్ఖండ్, ఇండియా తలవంచవు

(మొదటి పేజీ తరువాయి)

కూడా తలవంచబోదు" అని ఆమె స్పష్టం చేశారు. "దేశంలోని సగం మంది మహిళా జనాభాకు, తొమ్మిది శాతం గిరిజన సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తూ నేను మీ ముందు నిలబడ్డాను. అంబేద్కర్ మనకు ఇచ్చిన రాజ్యాంగపరమైన హక్కులను మోడీ ప్రభుత్వం ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తోంది. రాజ్యాంగ విలువలను ధ్వంసం చేశారు. దేశంలోని నాయకులు, పార్టీల కంటే ప్రజలు శక్తివంతులు. మీ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి. దేశాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతిపక్షం ఉందని ఇక్కడున్న జనం నిరూపించారు. ఈ చారిత్రాత్మక గడ్డపై నేటి సభకు మీరంతా దేశం నలుమూలల నుంచి తరలివచ్చి నియంతృత్వం అంతమొందిస్తారనే దానికి సాక్ష్యం" అని కల్పనా సోరెన్ అన్నారు.

పుస్తకాలు జీవిత గమనాన్ని మారుస్తాయి

చందాలు వేసుకొని గ్రంథాలయాలు, విద్యాలయాలు నిర్మించుకోవాలి

ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

- సమాజం మారుతున్నా పుస్తకాల ప్రాధాన్యత మారదు : ప్రముఖ సాహితీవేత్త, కవి డా. కూరెళ్ళ విఠలాచార్య
- మునిపంపుల గ్రామంలో నూతన గ్రంథాలయ భవనం ప్రారంభం



నవతెలంగాణ-రామన్నపేట

పుస్తకాలు జీవిత కమనాన్ని మారుస్తాయని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో భగత్‌సింగ్ విజ్ఞానకేంద్రం గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రముఖ సాహితీవేత్త, కవి డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్యతో కలిసి సుద్దాల అశోక్‌తేజ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అశోక్ తేజ ప్రసంగించారు. ఉరూరా గ్రామీణ గ్రంథాలయాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. చదువు సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే బలమైన ఆయుధమని, గ్రామీణ గ్రంథాలయాల ద్వారా అది సాధ్యమని తెలిపారు. గ్రామస్తులు చందాలు వేసుకుని గ్రంథాలయాలు నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. చందాలు వేసుకుని దేవాలయాలు నిర్మించినట్లే గ్రంథాలయాలు, విద్యాలయాలు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు సుదూరప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందలేరని, తద్వారా ఉద్యోగాలకు పోటీపడలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి గ్రంథాలయాలు.. పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. చిన్న వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ చివరిదాకా పుస్తకాలపై మక్కువ చూపారని గుర్తుచేశారు. అలాంటి విప్లవవీరుడు భగత్‌సింగ్ పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించడం నేటి తరానికి స్ఫూర్తిని నింపడమేనన్నారు. గ్రంథాలయాన్ని విద్యార్థి, యువత, ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ కవి, రచయిత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ.. గ్రామీణ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. సమాజం మారుతున్నా పుస్తకాల ప్రాధాన్యత మాత్రం మారదని తెలిపారు. దాతల సహకారంతో మునిపంపుల గ్రామంలో సాంకేతిక జోడించి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందించాల్సిన అంశమన్నారు. కార్యక్రమంలో గ్రామ వాస్తవ్యులు ఏఎస్పీ మిర్యాల ప్రభాకర్, క్రీడాయి జాతీయ కార్యదర్శి గుమ్మి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ ఎండీ జహంగీర్, ఎస్ఐ గంటెపాక నర్సింహ, మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య, కల్లూరి మల్లేశం, ఇన్‌చార్జి ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీ గాదె పారిజాత, బొడ్డుపల్లి వెంకటేశం, గాదె శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.



ఎక్కడికుప్పలు అక్కడే

ధాన్యం కొనుగోలుకు ఎదురుచూపులు

నవతెలంగాణ-బోధన్

ధాన్యం చేతికిరావడంతో కొనుగోలు కేంద్రాల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ధాన్యం కోతలు పూర్తి చేసుకొని రాశులుగా పోగుచేసి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఎక్కడ అకాల వర్షాలకు కురిస్తే.. తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొంటామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. కానీ నేటికీ ఎక్కడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దాంతో రైతులు చేతికొచ్చిన వరి పంటను కోసి ఆరబెడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారే కానీ ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడంతో తాము దళారులను ఆశ్రయించి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

మీ విధులు మీకు చెప్పాల్సి రావడం...

అవమానకరంగా ఉంది



హైదరాబాద్ : కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అసంతృప్తి వ్యక్తం చేశారు. వారు రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుల్ని ఆమోదించకుండా తమ వద్దే అట్టే పెట్టుకోవడాన్ని ఆమె ప్రశ్నించారు. మీ విధులు మీరు నిర్వర్తించండంటూ గవర్నర్లకు చెప్పాల్సి రావడం న్యాయస్థానాలకు అవమానకరంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. 'సమీక్షలో కోర్టులు, రాజ్యాంగం' అనే అంశంపై నల్సార్ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ పెద్ద నోట్ల రద్దును తప్పు పట్టారు. ఈ చర్య బ్లాక్‌మనీ ఉన్న వారికి ఉపయోగపడిందని, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. 'ఇవాళ దేశంలో గవర్నర్లు కొత్త ధోరణులు ప్రదర్శించడాన్ని చూస్తున్నాం. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా మీ విధులు మీరు నిర్వర్తించండని, బిల్లులకు ఆమోదం తెలపడంలో జాప్యం చేయవద్దని వారికి చెప్పాల్సి రావడం అవమానకరంగా ఉంది. గవర్నర్లను కోర్టుకు లాగడం రాజ్యాంగ పరంగా ఆరోగ్యకరమైన పరిణామం కాదు. వారు నిర్వర్తిస్తున్నవి రాజ్యాంగ బద్ధమైన పదవులు. వారు బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉంది' అని జస్టిస్ నాగరత్న చెప్పారు. పెద్ద నోట్ల రద్దును సమర్థిస్తూ తీర్పు ఇచ్చిన ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ నాగరత్న కూడా ఒకరు. అయితే కేంద్ర ప్రభుత్వం తొందరపాటుతో నిర్ణయం తీసుకొని అమలు చేసిందంటూ ఆమె తన అసమ్మతి నోట్‌లో తెలిపారు. ధర్మాసనంలో ఆమె ఒక్కరే ప్రభుత్వ నిర్ణయంపై తన అసమ్మతిని వ్యక్తం చేశారు.

మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల గవర్నర్లు తీసుకున్న నిర్ణయాలను జస్టిస్ నాగరత్న తన ప్రసంగంలో ప్రస్తావించారు. పరిస్థితిని చక్కదిద్దడానికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. 'మహారాష్ట్రకు సంబంధించి (2023 మేలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం పతనమైన తర్వాత శాసనసభలో జరిగిన బలపరీక్ష) శాసనసభలో బలాన్ని నిరూపించుకోవాల ని కోరడానికి గవర్నర్ వద్ద సమాచారం ఏమైనా ఉన్నదా అనేది ప్రశ్న. ఠాక్రే ప్రభుత్వం శాసనసభ్యుల విశ్వాసం కోల్పోయిందని భావించడానికి ఆయన వద్ద ఆధారాలేవీ లేవు' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య సంస్థల సమగ్రతను కాపాడడానికి, వాటి వారసత్వాన్ని పరిరక్షించడానికి గత సంవత్సరం సుప్రీంకోర్టు అనేక తీర్పులు ఇచ్చిందని జస్టిస్ నాగరత్న గుర్తు చేశారు. పంజాబ్ గవర్నర్ నాలుగు బిల్లుల్ని ఆమోదించకుండా తన వద్ద అట్టే పెట్టుకున్నారని అంటూ బిల్లులను నిరవధికంగా ఆమోదించకుండా మీ వద్దే ఉంచుకోకూడదని సుప్రీంకోర్టు ఆయనకు గుర్తు చేసిందని చెప్పారు. 'బిల్లులపై హఠం వేసుకొని కూర్చోవడం ద్వారా ఆయన వ్యాజ్యాలకు కారణమయ్యారు' అని వ్యాఖ్యానించారు.

పెద్ద నోట్ల రద్దు లక్ష్యం నల్లధనాన్ని రూపుమాపడమే అయినప్పటికీ దానిని హడావిడిగా అమలు చేసిన తీరు చట్ట ఉల్లంఘనులకు ప్రయోజనం చేకూర్చిందని, వారు తమ వద్ద ఉన్న నల్లధనాన్ని తెలుపుగా మార్చుకున్నారని జస్టిస్ నాగరత్న చెప్పారు. అంతేకాక ప్రభుత్వ చర్య సామాన్యులకు ఇబ్బంది కలిగించిందని, వారు తమ వద్ద ఉన్న పాత నోట్లను కొత్త నోట్లుగా మార్చుకోవడానికి అనేక కష్టాలు పడ్డారని తెలిపారు. పెద్ద నోట్ల రద్దుపై ఏ స్థాయిలోనూ సంప్రదింపులు జరగలేదని ఆమె ఎత్తిచూపారు. విధాన నిర్ణయ ప్రక్రియ కూడా కన్పించలేదని అన్నారు. ఓ సాయంత్రం వేళ ప్రభుత్వ విధానాన్ని సంబంధిత శాఖలకు తెలియజేశారని, అది ఆ మరునాటి సాయంత్రమే అమలులోకి వచ్చిందని జస్టిస్ నాగరత్న చెప్పారు.

ప్రజలను తప్పుదారి పట్టించే యత్నమే!

న్యాయవాదుల లేఖపై ఐలూ విమర్శ

న్యూఢిల్లీ : న్యాయ వ్యవస్థను పరిరక్షించాలంటూ ఇటీవల కొంతమంది న్యాయవాదుల బృందం ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాయడమంటే ప్రజలను తప్పుదారి పట్టించే యత్నమేనని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) ఒక ప్రకటనలో పేర్కొంది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, అదిష్ అగర్వాల్ కూడా లేఖ రాసిన బృందంలో వున్నారు. అవినీతిని ఎండగడుతూ ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రత్యక్ష ప్రభావమే ఈ లేఖ అని ఐలూ పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల పరిరక్షణ కోసం, భారత రాజ్యాంగం మౌలిక వ్యవస్థను పరిరక్షించేందుకు నిరంతరంగా పోరాడుతున్న బాధ్యాతాయుతమైన న్యాయవాదులు, న్యాయవాదు ల సంఘాలకు వ్యతిరేకంగా నిరాధార ఆరోపణల తో రాసిన లేఖ మాత్రమేనని ఐలూ నేతలు, సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపి వికాస్ రంజన్ భట్టాచార్య, సీనియర్ న్యాయవాది పి.వి.సురేంద్ర నాథ్ విమర్శించారు. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యంతోపాటు రాజ్యాంగ మౌలిక వ్యవస్థపై కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యక్ష దాడి చేసినప్పుడు గతంలో ఈ న్యాయవాదుల బృందం మౌనంగా వుందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఆధిక్యత పేరుతో బాధ్యాతాయుతమైన పదవుల్లో వున్నవారు న్యాయ సమీక్షపై, మౌలిక వ్యవస్థపై దాడి చేశారని వారు పేర్కొన్నారు. న్యాయమూర్తుల ఎంపికలో కార్యనిర్వాహక వర్గం పాత్ర ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ పోరాటాలపై వచ్చిన నవలాత్రయం

చారిత్రిక నవలాకారుడు ప్రాణ్ రావు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై 2011లో 'మలగని బత్తి' నవలను వెలువరించారు దానికి సీక్వెల్ గా 2013లో 'నేల జారని ఊడలు' నవల రాశారు. మళ్లీ దానికి కొనసాగింపుగా 2020లో 'పంచువాటు' నవలను రాశారు. తెలంగాణ సాయుధ పోరాటాల చరిత్రను వివరించే ఈ మూడు నవలల్లో మొదటిదైన 'మలగనిబత్తి' 1908-1946 కాలాన్ని చిత్రీకరించిందని రచయిత స్వయంగా చెప్పుకున్నారు.

ఇది ప్రముఖ నవలాకారుడు ప్రాణ్ రావు రాసిన ట్రయాలజీ. ఒకే వస్తువు మీద కొనసాగే ఈ నవలల్లో, అవే పాత్రలు లేక రూపాంతరం చెందిన పాత్రలు విభిన్న కాలాల మధ్య తిరుగాడటమే ఈ ట్రయాలజిలో కనిపిస్తుంది. ముందుగా ఎవరూ అనుకొని ట్రయాలజిగా(నవలాత్రయం) రాయరు. మొదటి నవల అసంపూర్ణంగా మిగిలిపోయిందనో లేదా దాన్ని తరువాతి సంఘటనలతో కొనసాగించవచ్చనో తలచిన రచయిత సీక్వెల్ గా రాయడం ప్రారంభిస్తాడు. రెండవసారి రాస్తే సీక్వెల్ అవుతుంది. దానికి కొనసాగింపుగా రాస్తే ట్రయాలజి అవుతుంది. అలాగని ఒకే పేరుతో రెండు మూడు భాగాలుగా రాస్తే - అది సీక్వెల్, ట్రయాలజి అనుకుంటే పొరపాటు. ఉదాహరణకు ఉప్పల లక్ష్మణరావు గారి 'అతడు- ఆమె', రంగనాయకమ్మ 'జానకి విముక్తి', రావిశాస్త్రి 'రత్తాలు - రాంబాబు' లాంటివన్నీ ట్రయాలజిలు, సీక్వెల్లు కావు. అవి సీరియల్ నవలలని గుర్తించాలి.

తెలుగులో మొదటిసారిగా మహీధర రామమోహనరావు 'కొల్లాయి గట్టితే నేమి', 'దేశం కోసం', 'జ్వాలా తోరణం' పేరిట ట్రయాలజి రాశారు. తర్వాత దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు, మోదుగు పూలు, జనపదం' అనే నవలలను ట్రయాలజిగా వెలువరించారు. నవీన్ 'అంపశయ్య, ముళ్ళ పొదలు, అంతస్రవంతి' అనే నవలలను తీసుకువచ్చారు. ఇవన్నీ ఒక నవల తర్వాత ఇంకొక నవల రావడానికి చాలా గ్యాప్ తీసుకోవడంతో - ఎవరూ వాటిని సీక్వెల్ గానో, ట్రయాలజి గానో గుర్తించలేకపోయారు. ఎందుకంటే దీనిలో కంటిన్యూటీ ఉండకపోవడం వల్ల ఏ నవలకు ఆ నవల విడిగా చదువుకోవచ్చు. అన్ని నవలలు చదివితే తప్ప వాటిని ట్రయాలజీగా గుర్తించలేరు. రచయితలే ట్రయాలజి అని స్వయంగా చెప్పుకోవాలి. లేదా విమర్శకులు వాటిని ట్రయాలజిగా విశ్లేషించినప్పుడే పాఠకులు తెలుసుకోగలుగుతారు. తర్వాత కాలంలో ట్రయాలజి రాస్తున్నానని ప్రకటించిన నవీన్ గారు 'కాల రేఖలు, చెదిరిన స్వప్నాలు, బాంధవ్యాలు' పేరిట ట్రయాలజి రాశారు. అలాగే ప్రాణ్‌రావు గారు 'మలగని బత్తి'కి సీక్వెల్‌గా 'నేల జారని ఊడలు', దానికి ట్రయాలజిగా 'పంచువాటు' అని ప్రకటించడం, వాటిని ఒక పుస్తకంగా తీసుకురావడం జరిగింది. అయితే ఇందులో విశేషమేమిటంటే ఇంతకుముందు వచ్చిన ట్రయాలజి నవలలు అన్నీ విడివిడిగా వచ్చినవే. అలాకాకుండా మూడు నవలలను కలిపి ఒకే పుస్తకంగా తీసుకురావడం తెలుగు సాహిత్యంలో ఇదే మొదటిసారి. ముఖ్యంగా ఇలాంటి నవలలు ఉద్యమ నేపథ్యంలో వస్తాయి. మహీధర జాతీయోద్యమాన్ని తీసుకోగా, మిగతా వారంతా తెలంగాణ పోరాటాన్ని చిత్రీకరించగలిగారు.

ప్రముఖ చారిత్రిక నవలాకారుడు ప్రాణ్ రావు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై 2011లో 'మలగని బత్తి' నవలను వెలువరించారు దానికి సీక్వెల్ గా 2013లో 'నేల జారని ఊడలు' నవల రాశారు. మళ్లీ దానికి కొనసాగింపుగా 2020లో 'పంచువాటు' నవలను రాశారు. తెలంగాణ సాయుధ పోరాటాల చరిత్రను వివరించే ఈ మూడు నవలల్లో మొదటిదైన 'మలగనిబత్తి' 1908-1946 కాలాన్ని చిత్రీకరించిందని రచయిత స్వయంగా చెప్పుకున్నారు.

'మలగని బత్తి' (2011) : నిజాం నిరంకుశ పాలనలో గ్రామాల్లో జమీందారీ, జాగిర్దారి భూస్వామ్య వ్యవస్థలో వెట్టి చాకిరికి లోబడి ప్రజలు అజ్ఞానంతో, అసహాయతలో అణగారి పోతున్న రోజులవి. దారుణమైన వెట్టిచాకిరి. అంతకన్నా దారుణమైన శేరీదార్లు, అధికారుల జులుం, నిత్యం తన్నులు- తిట్లతో వాళ్ల జీవితం గడిచిపోతుంది. తిమ్మాపురం అనే ఊరిలో దొర ప్రజలందరినీ తన గుప్పిట్లో పెట్టుకుంటాడు. వాళ్ళ అవసరాలకు అప్పులిచ్చి వడ్డీలకు వడ్డీలు పెంచి, వాళ్లను అప్పుల ఊబిలో ముంచి, తన వెట్టి చాకిరికి ఉంచుకుంటాడు. దొరల అనుమతి లేనిదే పిల్లలు బడికి పోకూడదు. వాళ్ళు వెట్టికే రావాలి. ఊర్లో కాస్త కంటికింపుగా కనిపించిన ఆడది దొర కామ దాహానికి బలి కావాల్సిందే. ఇదంతా తమ ఖర్మ అని సర్దుకుపోయే జనాలు. ఇలాంటి నేపథ్యంలో- మలగనిబత్తి' నవలలో, శీనయ్యను వెట్టివానిగా చేసిన దొర, వాడి పెళ్ళాం చంద్రమ్మను లొంగ తీసుకుంటాడు. ఆమె దొరను బతిమిలాడి తన కొడుకు రాజన్నను బడికి పంపిస్తుంది. ఆరవ తరగతి చదివి దొర కొలువుకు చేరుకున్న రాజన్న, దొరచేసే ఆకృత్యాలను సహించలేక పోతాడు. పిల్లల్ని చేరదీసి చదువు చెబుతాడు. అడవిలో కమ్యూనిస్టు నాయకుడు జానకి రామయ్యతో పరిచయమవుతుంది. క్రమంగా సంఘం ప్రచారం వలన ఊరివాళ్లు వెట్టి, వంతులను అడ్డుకుంటారు. దానికి ఆగ్రహించిన దొర అమీను, తాసిల్దారుల నాయకత్వాన పోలీసులు, రజాకార్లను ఉసిగొల్పి ఊరిలో అల్లకల్లోలం సృష్టిస్తారు. అక్కడ జరిగిన ఘర్షణలో రాజన్న, అమీన్ ను తన్ని పారిపోతాడు. ఇక ఆ ఊర్లో ఉండలేక అడవిలో ఉన్న జానకి రామయ్య వద్దకు చేరుకొని, దళంలో చేరిపోయి సుశిక్షితుడైన కార్యకర్తగా తయారవుతాడు. అక్కడ కనిపించిన పార్వతిని ఇష్టపడి రాజన్న పెళ్లి చేసుకుంటాడు. పార్వతితో కలిసి ఊరికి వస్తుంటే దారిలో కనిపించిన రజాకార్ల ముఠాను ఎదుర్కొని పారద్రోలుతాడు. పార్వతి కూడా సహకరిస్తుంది. సంఘం అండతో ఊరిలో కొత్త చైతన్యం వస్తుంది. దొరను ప్రజా పంచాయితీకి పిలిపిస్తే, గడిలోంచి ఎదురుకాల్పులు ప్రారంభమవుతాయి. విరుచుకుపడిన ప్రజలు గడిని ధ్వంసం చేస్తారు. దొరచేతిలో రాజన్న, రాజన్న చేతిలో దొర చచ్చిపోతారు. తెలంగాణ సాయుధ పోరాటంలోని ఆసక్తికర ఘట్టాలను తీసుకొని ఆకర్షణీయకంగా మలచిన నవల ఇది.

'నేల జారని ఊడలు' (2013) : 'మలగనిబత్తి' నవలకు సీక్వెల్ గా వచ్చిన ఈ నవల 1952లో మొదలై 1975 దాకా సాగుతుంది. ఈ నవలలో రూపం మారినా సారం మారని దొరతనం, నల్లదొరల పాలనలో ప్రజల దుస్థితి, కొనసాగిన దోపిడీ - పీడనలు, తిరిగి ప్రారంభమైన ప్రజా ప్రతిఘటన సాయుధ పోరాట రూపం ధరించిన తీరు, తెలంగాణలో అదనంగా ప్రాంతీయ దోపిడిని చిత్రీకరించారు.

ఈ నవలలో పోరాటంలో చనిపోయిన రాజన్న కొడుకు దుర్గయ్యకు తల్లి కూడా చనిపోగా, నాయనమ్మ చంద్రమ్మ పెంచుతుంది. కూలి పని చేసే చంద్రమ్మ తీవ్ర అనారోగ్యానికి గురికాగా, దుర్గయ్యను చదువు మానిపించి, షావుకారు పిచ్చయ్య దుకాణంలోకి పనికి పెడతారు. చెయ్యని దొంగతనానికి శిక్ష అనుభవించాలని తిమ్మాపురం గ్రామంలోని పెత్తందారులు ఏకమై దుర్గయ్యను నిలదీస్తారు. మధ్యయుగాలనాటి న్యాయాన్ని అమలు జరపబోతే దుర్గయ్య తిరగబడి పట్నం పారిపోతాడు.



పట్నంలో దుర్గయ్య ఒక హోటల్‌లో క్లీనర్‌గా చేరి హెడ్ కుక్ వెంకటేశ్వర్లు ద్వారా వంటలు చేయడం, ఇంగ్లీషు నేర్చుకుంటాడు. క్రమంగా వంట మనిషిగా ఎదుగుతాడు. అక్కడ పురుషోత్తంతో కుదిరిన స్నేహం బంధుత్వంగా మారుతుంది. అతని చెల్లెలు ప్రమీలను పెళ్లి చేసుకొని ఒక కూతురిని కంటాడు. 1969లో ఉధృతంగా చెలరేగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొంటాడు. అరెస్టు అయి జైలుకు పోగా, దుర్గాప్రసాద్ అనే మార్క్సిస్టు మేధావితో పరిచయం కలుగుతుంది. దుర్గాప్రసాద్ ప్రోద్బలంతో నక్సలైట్ ఉద్యమంలో చేరి, భార్యా పిల్లలను వదిలేసి అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోతాడు. ఎదురుకాల్పులు ఎదుర్కొంటూ, ఏమైపోయాడో తెలియదని చెబుతూ నవల ముగుస్తుంది. తన తండ్రి రాజన్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎలా పాల్గొన్నాడో, దుర్గయ్య ఆనాటి నక్సలైట్ పోరాటంలో అలాగే పాల్గొంటాడు. ఇద్దరూ వీరమరణం పొందారని మనం గుర్తించగలుగుతాం.

'పంచువాటు' (2020) : 1975 నుండి 2018 వరకు సాగిన తెలంగాణ చరిత్రకు దర్పణంగా 'పంచువాటు' నవల నిలుస్తుంది. ఈ నవల 1975లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితితో ప్రారంభ మవుతుంది.

నక్సలైట్ దుర్గయ్య పట్టుబడనందున ఆ కుటుంబం మీద ఒత్తిడి పెరుగుతుంది. ఎమర్జెన్సీలో పెరిగిన నిర్బంధాలను తట్టుకోలేక దుర్గయ్య భార్య ప్రమీల పట్నం వదిలి తిమ్మాపురం వెళుతుంది. అక్కడ దుర్గయ్య మిత్రుడు నర్సింలు సహాయంతో తమకుండే రెండెకరాలను స్వాధీనం చేసుకుని, వ్యవసాయం చేసుకుంటూ మనుగడ కొనసాగిస్తుంది. పట్నంలో తనకు అండగా నిలిచిన అనాథ బాలుడు రవిని చేరదీసి పెంచి, తన కూతురు గాయత్రిని ఇచ్చి పెళ్లి చేస్తుంది. అక్కడ పోలీస్ పటేల్ ఆగడాలను భరించలేక ప్రమీల కూతురు గాయత్రి, రవితో పాటు తిరిగి పట్నం వచ్చేస్తుంది.

పట్నంలో రవి, గాయత్రి కూలి పనులు చేస్తూ కొడుకులను చదివిస్తారు. ఇంతలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రతరమవుతుంది. రవి పెద్ద కొడుకు రాజు తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, ఆత్మాహుతి చేసుకొని మరణిస్తాడు. అక్కడ ఉండలేక తిమ్మాపురం వస్తే, అక్కడ ఉన్న వారి రెండు ఎకరాల భూమి కబ్జాకి గురవుతుంది.



అక్కడ శంకరయ్య అనే మధ్యవర్తి రంగంలోకి దిగి, రెండు లక్షలు వాళ్లకు ఇప్పించి కేసు సెటిల్ చేస్తాడు. ఆ డబ్బుతో రవి కూతురు గాయత్రిని రెండో పెళ్లి వాడికి ఇచ్చి పెళ్లి చేస్తారు. రెండో కొడుకు కిరణ్‌కి తెలిసిన వాళ్ళ ద్వారా ముంబైలో ఉద్యోగం దొరుకుతుంది. కూతురు అత్తారింటికి వెళుతుంది. వృద్ధులైన గాయత్రి, రవి ఒంటరిగా మిగిలిపోతారు. ముంబైలో ఉన్న కొడుకు దగ్గరకు వెళ్లి అక్కడ ఇమడలేక వాళ్ళు హైదరాబాద్ తిరిగి వచ్చేస్తారు. వచ్చేసరికి వారు ఉంటున్న గుడిసె వానలకు, పొంగిన చెరువులో మునిగిపోతుంది. అక్కడ సొంత ఇల్లు ఉన్న వారికే తప్ప, అక్రమంగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి ప్రభుత్వ సహాయం అందదని ప్రకటించడంతో వారు నీరుగారిపోతారు. అన్ని పోగొట్టుకొని నిరాశ్రయులై, నిస్సహాయంగా నిలబడిన రవి, గాయత్రీలు- ఈ వృద్ధాప్యంలో తమ భవిష్యత్తు ఏమిటా అని తలుచుకొని కుమిలిపోవడాన్ని చూపిస్తూ నవల ముగుస్తుంది. మూడు నవలల్లోనూ నాయకులు తమ ప్రాణాలు బలి ఇస్తారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రాజన్న దొరను చంపివేస్తాడు. అక్కడ ఉండలేని దొర కొడుకులు హైదరాబాద్ చేరుకుని సినిమా హాళ్ల నిర్వహిస్తూ ఇతర వ్యాపారాలు చేసుకుంటుంటారు. ఊళ్లో ఉన్న భూములను, ఆస్తులను తమ తొత్తుల అండతో కాపాడుకుంటారు. ఊరిమీద తమ పట్టును అలాగే కొనసాగిస్తుంటారు. మెల్లగా రాజకీయాలలోకి ప్రవేశించడానికి ప్రణాళికలు తయారు చేసుకుంటారు. వాళ్ల నాయకులుగా ఎదగక తప్పదు. కొత్త రూపాలలో వారి దోపిడీ మరింత విస్తృతం కాక తప్పదని సూచిస్తూ నవల ముగుస్తుంది.

దాదాపు వందేళ్ళ తెలంగాణ చరిత్రను చిత్రీకరించిన ఈ మూడు నవలలు - ఆనాటి తెలంగాణ ఆర్థిక, సామాజిక, రాజకీయ చరిత్రను మరోమారు మన కళ్ళముందు ఉంచాయి. రాచరిక భూస్వామ్య యుగం నుండి ప్రజాస్వామ్యంలోకి ప్రవేశించిన క్రమంలోని స్థితిగతులు, మారుతున్న ప్రజా జీవితాన్ని ఈ నవలలు చక్కగా పట్టుకోగలిగాయి.

ఈ నవలలు మంచి నేటివిటితో కూడుకొని తెలంగాణ భాష, పలుకుబడులు, నుడికారాలతో ఆద్యంతం ఆసక్తిగా చదివింపజేస్తాయి. నలభైఏళ్ల కాలాన్ని (1975 - 2018) తీసుకున్న మూడవ భాగంలో ఆనాటి ఆర్థిక, సామాజిక పరిస్థితులను మరింత వివరంగా రాస్తే బాగుండేది. అలాగే ప్రపంచీకరణ వల్ల చోటు చేసుకున్న అనూహ్యమైన మార్పులను కూడా గుర్తించాల్సిన అవసరం ఉంది. బహుశా గ్రంథ విస్తరణ భీతి వల్ల రచయిత ఉద్దేశపూర్వకంగా వాటన్నింటిని దాటవేసి ఉంటాడని భావించాల్సి వస్తుంది. మొత్తానికి బిగువైన సన్నివేశాలతో, పదునైన సంభాషణలతో ఈ నవలలు ఉత్కంఠతను పోషిస్తూ, పాఠకుడ్ని ఆకట్టుకుంటాయనటంలో ఎలాంటి సందేహం లేదు.



- కె.పి.అశోక్ కుమార్,
9700000948

దొరికిన మిత్రుడు



ఇవాళెందుకో
పాత మిత్రుడు గుర్తుకొస్తున్నాడు.
వెళ్లి కలుద్దామంటే
అతడు అప్పటిలా ఉండడు.
ఆ వీధులు కూడా అపరిచితంగా వున్నాయి
నా భాష కూడా మారిపోయింది
చిరునామాను ఎలా అడగాలో
మర్చిపోయాను.
'నేను కవిని' అన్నాను ఒకాయనతో
'అంటే' అన్నాడు
'పని లేని వాడు' అన్నాను
'అనుకున్నా అందుకే దిక్కుతోచక
తిరుగుతున్నావు' అన్నాడు.
'ఈ చందమామ
మా ఊరిలో లాగ లేదు' అన్నాను
అతడు నవ్వుతూ ముందుకు సాగిపోయాడు.
వెతుకుతూనే వున్నాను పట్టుదల సడల లేదు
జ్ఞాపకాలు బరువెక్కుతున్నాయి
మొయ్యడం కష్టం!
స్నేహితుడు దొరికితే బాగుండు ననిపిస్తుంది
ఓ మూల వద్దని కూడా
అనిశ్చితితో వెను దిరిగాను.
ఎదురుగా ముందు ఎవరో వెళ్తుంటే
పరుగున సమీపించాను
ఇంతసేపూ వెతుకుతున్నది ఇతణ్ణా!
అని ఆశ్చర్యపోయాను. 'అతడు నేనే!'.

- డా॥ ఎన్. గోపి

జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక

ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి 80వ జన్మదిన సందర్భంగా అంపశయ్య నవీన్‌కి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా కవి ఎలనాగ కి జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అభినందన, సత్కారం ఈ నెల 7న రవీంద్రభారతిలో మధ్యాహ్నం 2 గంటలకు వుంటుంది. డా॥ అమ్మంగి వేణుగోపాల్, శ్రీమతి వాణీదేవి సురభి, డి.కె. సమరసింహారెడ్డి, పి.వి. ప్రభాకరరావు, ఆచార్య వెలుదండ నిత్యానందరావు తదితరులు పాల్గొంటారు.

మేడే రచనలకు ఆహ్వానం

అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని (మేడే) పురస్కరించుకుని దేశాన్ని ఆవరించిన సామాజిక సంక్షోభం, దోపిడీ, వివక్షతలను ప్రతిఫలించే కథలు, కవితలు, పాటలు, వ్యాసాలను రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఆహ్వానిస్తున్నారు. ప్రతి విభాగంలోను మేలైన రచనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు రెండు ప్రోత్సాహక బహుమతులు (రూ. 5000, 3000, 2000 మరియు 1000) అందజేస్తారు. కవితలు, పాటలు ఎ4 సైజులో రెండు పేజీలకు, కథ, వ్యాసం ఎ4 సైజులో 8-10 పేజీలకు మించకుండా ఏప్రిల్ 20 లోపు sramikasambaralu24@gmail.com మెయిల్‌కు పంపాలి. మేలైన రచనలు పుస్తకం రూపంలో ప్రచురించబడతాయి. **జాషువా సాంస్కృతిక వేదిక, విజయవాడ.**

స్ఫూర్తి కందివనం కు కందికొండ పురస్కారం-2023

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వహించిన కందికొండ రామస్వామి స్మారక పురస్కారం 2023కి స్ఫూర్తి కందివనం రచించిన డిమ్మి కథల సంపుటి ఎంపికయింది. ఏప్రిల్ 21 న నాగర్‌కర్నూల్ సభలో పురస్కారం-2023 ప్రదానం, పదివేల నగదు, శాలువా మెమెంటోతో సత్కరిస్తారు. - **వనపట్ల సుబ్బయ్య, 9492765358.**

డా॥ వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ

పాలపిట్ట - వాసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సమగ్రత, మతసామరస్యం, సమాజంలో ఉన్నతమైన విలువలను పాదుకొల్పడం లక్ష్యంతో సుప్రసిద్ధ సాహితీవేత్త డా. వాసా ప్రభావతి సంస్మరణార్థం కవితల పోటీ నిర్వహిస్తున్నాయి. అన్ని ప్రాంతాల కవులు తమ రచనల్ని ఏప్రిల్ 30 లోపు ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్-6, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044, ఈమెయిల్: palapittamag@gmail.com. పంపాలి. బహుమతులు వరుసగా 3000/-, 2000/-, 1000/-, ఎనిమిది కవితలకు ప్రత్యేక బహుమతులు (ఒక్కొక్క కవితకు రూ. 500). వివరాలకు : గుడిపాటి, 9490099327.

ఆస్థాన మంగలి

మా ఊరు యాదికొస్తే కళ్ళల్లో కరిగిపోని
తాజా జ్ఞాపకాల ముంజకాయలు
బావులలోతుల్ని కొలిచే ఈతలు
భూగోళాలతో సీసంగోలీలాటలు
వెన్నెలకుప్పల సందమామలు
జిల్లాగోనేలు.. బాల్యంకొమ్మల్లో కోతికొమ్మచ్చి..
ఎన్నో... ఎన్నెన్నో... బయటపడిన తవ్వకాలు
ఈ యాంత్రికజీవిని బతికించే సజీవక్షణాలు..
ఊరంటే!
శ్రమైకజీవుల పనిముట్ల సింఫని రాగమే
వృత్తులన్నిటితో పేనిన సప్తవర్ణాలమోకే
శతాబ్దాలైనా చెరిగిపోని స్మృతులబొంద్రాయే
ఊరంటే!
సమిష్టి జీవనవర్ణచిత్రమై
బహుజన సమూహాలతో
పెనవేసుకున్న మానవసంబంధమే
బతుకు పోరాటాల విన్యాసాలతో
ఊరుబండిని నడిపించే ఐకమత్య ఇరుసులే...
నర్సయ్య సుత్తె దెబ్బలైనా...
గోపాలు సారే శబ్దాలైనా...
కాశీము సాకిరేవు మోతలైనా...
సత్యమయ్య బాడ్సే విన్యాసాలైనా...
పిచ్చయ్య కత్తెరసవ్వళ్లైనా
ఊరి ఉనికికి చిరునామాలే
అరె పిచ్చయ్య అంటే!
నా చిన్నప్పుడు
మంగలి పిచ్చయ్యని ఊర్లో అందరూ
మంగలి పిచ్చోడు అని పిల్చేటోల్లు
చానారోజులు పిచ్చయ్య ఎక్కడ కనిపించినా
నేను పిచ్చోడనే అనుకునేటోన్ని
పీటమీద కూసోబెట్టుకొని
నా తలను మోకాళ్ళమధ్యపెట్టుకొని
నెత్తికి మునివేళ్లతో సుతారంగ నీళ్లురాసి
తన వేళ్ళకత్తెర చేసే కరకర శబ్దాలపదునుతో
సగరం చేసేవరకు నేను గట్లనే
అనుకునేటోడ్ని
పిచ్చయ్య పిచ్చోడు కాదని
కొంచం పెద్దయ్యాకనే ఎరకయ్యింది
ఇప్పట్లాగ అప్పుడు అద్దాల షాపుల్లేవాయే
చుట్టూ తిరిగే కుర్చీల్లేవాయే
మా ఊర్లో సగరం చేయించు కోవాలంటే
ఎంతపెద్ద ఆసామైనా
మంగలిపిచ్చయ్య పీటమీద కూసోవాల్సిందే
ముందు తలకాయ వంచాల్సిందే
మంగలివృత్తికి ఊరికి
మల్లెకి పాదుకి ఉన్న అనుబంధం
మంగలిలేని ఊరును ఊహించగలమా!
శుభకార్యాలైనా.. అశుభకార్యాలకైనా..
చేసేది ఆస్థాన మంగలి పిచ్చయ్యే

- డా॥బాణాల శ్రీనివాసరావు, 9440471423

అస్తిత్వ ప్రకటన...

తెలుగు కవిత్వంలో ప్రత్యేక శైలి తనదైన గొంతుక నిర్మలరాణి తోట సొంతం. తన తాజా కవితా సంపుటి 'అద్దం నా చిరునామా కాదు'. కవిత్వం జీవితం నుండి పుడుతుంది. జీవించే పరిస్థితుల నేపథ్యంలో పుడుతుంది... కవి తాహతుకు మించి ఒక్క వాక్యాన్నీ రాయలేడు. ఇక్కడ తాహతు అంటే ఆస్తి ఐశ్వర్యాలు కానే కాదు... తను చూసిన విన్న అనుభవించిన వ్యసనాల నుండే కవిత్వం పుడుతుంది. ...అది స్వీయ అవ్వొచ్చు సహా అవ్వొచ్చు. ఇందులో ఇంకొక విషయాన్ని చెబితే ఆడవాళ్ళు స్వీయ సహాను మించి ఒక అడుగు ముందుకు వేసి ప్రతి ఆడదాని ఆత్మని కూడా రాస్తారు. ఇది తప్పకుండా అస్తిత్వ చిరునామానే. రవి కాంచలేనిది కవి కాంచుతాడంటారు. రవి కవి కాంచలేని ఎన్నో రకాల సంఘర్షణలను స్త్రీ చూస్తుంది రాస్తుంది. అలాంటి కవిత్వమే నిర్మలా రాణి తోటది.

1860 దశకం నుండి ఇప్పటివరకు కవిత్వం పేరుతో ఎన్నో ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. అన్నిట్లో కవిత్వానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నదనే చెప్పాలి. సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో కవిత్వం పాత్ర మామూలుది కాదు. అయితే కవిత్వం లాగానే ఆడవారు కూడా వారి అస్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా హోరెత్తుతారు, ప్రతి ఘటిస్తారు. పరమార్థం ఇది అని ఎలుగెత్తి చాటుతారు. ఇప్పుడు అదే కోవలోకి వస్తుంది ఈ కవయిత్రి. కొందరంటారు ఉద్వేగం నుండి పుట్టిందే కవిత్వం అని. మరొకొందరంటారు అసలు కవిత్వం బాధలో ఉన్నప్పుడు రాదు అని. నిజం చెప్పాలంటే అవి రెండూ తప్పుడు అభిప్రాయాలే. పీడనను వ్యతిరేకించేది కవిత్వం. అదొక్కటేనా.... బాధను వ్యక్తం చేసేది, బాధనుండి ఉపశమనం కలిగించేది కూడా కవిత్వమే!

'అద్దం నా చిరునామా కాదు' అనగానే నాకు ఓల్గా గారి రాజకీయ కథలు గుర్తుకు వచ్చాయి. అద్దం అబద్ధం చెప్పదు అని నేనెప్పుడో రాసుకున్న కవిత కూడా గుర్తుకు వచ్చింది. నాకు ఈ శీర్షికలో పూర్తి విరుద్ధమైన అర్థాలు ఉన్నాయని అనిపించినా తరచి చూస్తే ఐరనీ కవిత్వంలో ఉంటుంది, ఇమాజినరీ కవిత్వంలో ఉంటుంది. నిర్మలకు నాకు మధ్య ఉన్న భేదాభిప్రాయాలు కూడా అలాంటివే అనిపించింది.

సమాజాన్ని పట్టి చూపుతూ, సామాజిక చైతన్యాన్ని గమనిస్తూ సెటైరికల్ పోయెట్రీ రాస్తున్న ఈమె నిజంగా మంచి కవి. ఇదేమీ నా ఒప్పుదల కాదు. అవిడ ఇంతకుముందు వచ్చిన రెండు కవితా సంపుటాలు కూడా అదే చెబుతున్నాయి. ఇప్పుడు వచ్చిన ఈ పుస్తకం ఋజువు చేస్తుంది. కొత్తగా చెప్పడానికి అసలు కవిత్వంలో ఏముంటుంది అనే పెద్ద మనుషులు ఉంటారు.



అద్దంలో చూసుకోవడం అలవాటైన రోజులివి. అద్దం లేకపోతే కాసేపైనా చేయి కాలు ఆడని ఆడవాళ్ళు ఉన్నారు.

కాటుక చెరిగిందనో, కుంకుమ నసిగింది అనో, పౌడర్ తగ్గింది అనో... మేకప్ మలిగిందనో అద్దాన్ని చూసుకునే రోజుల్లో ఉన్నాం...

చీకటే చిరునామాగా/ పగలే అద్దంగా బ్రతికే ఎందరో మనుషులకు ఈ పుస్తకం అంకితం ఇవ్వొచ్చు.

'నేల మీద సూరీళ్లు'

స్విచ్ నొక్కగానే వెలుగు నవ్వాలి/ లేదంటే చిరాకునేలమీద/ పొగలు గక్కే మండుటెండల్లో కడసరాలు దాటి పోలెక్కే అరికాళ్ళు ఎంద ధాటికి, ఎండల్లో తిరిగే చలిమరల ధాటికి కాలిపోయే ట్రాన్స్ఫార్మర్లు

సూరీడు సర్రుమన్న/ వాన నీరు జోరున కురిసినా/ చలి కాలంగా ఉన్న/ ఏ కాలమైనా విద్యుత్తు సరఫరా అనివార్యం../ ప్రతి ఇంటిని వెలిగించే కరెంటు తీగలు ఆ అన్నలు../ ఆ అన్నల నిస్వార్థ జీవనాన్ని కళ్ళకు కట్టారు.. నిర్మల.

"అమ్మనై పుట్టినందుకు" ఇల్లంతా తీపి కబురని సంతోషంలో తేలిపోతుంటే/ నాసికను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాసనల్లో/ నా నిద్రనెత్తుకెళ్ళిన రాత్రుల్లో/ తెల్లవార్లూ నీ కడుపు నింపే పాలధారనాయ్యా..."

ఈ శీర్షిక నన్ను చాలా ఏడిపించింది... నేనిప్పుడు గుర్తింప బడేది కేవలం తల్లిగానే .. ఇంకే అస్తిత్వం నాకు లేదు... నాలాగే చాలా మంది తల్లులు ఉంటారేమో. బిడ్డ పుట్టిన గిట్టినా అమ్మతనం ఎక్కడికిపోదు కదా. నిర్మలా నీ వాక్యాలు కూడా అంతే ప్రతి అమ్మకు అంకితం అవుతాయి.

చాలారోజుల తరువాత మంచి పరిమళ భరితమైన కవిత్వానికి పాఠకురాలి నయ్యాను. మంచి మంచి పొయిటిక్ వాక్యాలు ఉన్నాయి ఈ కవిత్వంలో.

"నిద్రిస్తున్న ఆశకు ఉరివేస్తావెందుకు"

"కఫన్ కప్పిన ప్రతి ముఖాన్ని భయం భయంగా పోల్చుకుంటున్న పసివాళ్లు"

"యు టర్న్ కాదు స్నేక్ టర్నులు చేస్తే కానీ దొరకని గమ్యస్థానాలు"

"దేశాన్ని నడపడం అంటే సిల్కు చొక్కాలేసుకున్న/ రాజ ప్రసాదాల గద్దెలకు గంధాలు పూయడం కాదు..."

"ఓ వైపు వ్యాధి నిరంకుశత్వమో/ అంకుశంలా పొడుస్తుంటే/ పల్స్ మీటర్లో కొట్టుకుంటున్న పంచ ప్రాణాలు" (ఈ వాక్యాలు చదవగానే నా బిడ్డ కళ్ళల్లోకి వచ్చి కన్నీరు బుగ్గలపై నాట్యం చేసింది...??)

"తెలుపును దాచేస్తు నల్లకోట్లు"

"పంచుకోవడం కంటే గొప్పతనం ఏముంటుంది బ్రతుకులో"


"ఆకాశం మబ్బు పట్టినప్పుడల్ల/ ఒక్క నిఖార్సైన భుజం కోసం/ తడుముకోవడం నిజం!"

మొదలు పెట్టడానికి ముగించడానికి మధ్య చూపుల్లో చిక్కుకున్న ప్రశ్నలు ఎన్నని?

"తీరపు కంచెలతో/ అడుగులకు సంకెళ్లు వేసి సముద్రాన్ని చేయొద్దు/ నన్ను ప్రవహించనీయండి/ "రాలిపోవడం నాకు కొత్త కాదు" ఇలా ఎన్నో...

కవిత్వానికి నిర్వచనం నాకు పెద్దగా తెలీదు కానీ కవికి నిర్వచనంగా నిర్మలా రాణి తోటను ఉదాహరణగా చెప్పగలను... తెలుపంటే నలుపని అమెకెప్పుడు తెలీదు అంటున్న ఈ కవికి ప్రేమకి రూపం కవిత్వం అని మాత్రం బాగా తెలుసు అందుకేనేమో.. తన ప్రతి అనుభూతిని అనుభవాన్ని ఇందులో ప్రతిఫలించేలా చేసింది.

ఎన్ని పుస్తకాలు వచ్చినా కవిత్వాన్ని మోయలేని రోజుల్లో ఉన్నాం.... కానీ అద్దం నా చిరునామా కాదని చెబుతూ కవిత్వానికి చిరునామాగా మలిచిన ఈ కవికి అభినందనలు.



-సుభాషిణి తోట,
9502818774

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

ఆ నలుగురి పని పట్టాల్సిందే..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'పదవి లేకపోతే.. సీటివ్వకపోతే ఓకే...కానీ అన్ని రకాలుగా అనుభవించి, పార్టీకి ద్రోహం చేసి, నన్ను మోసం చేసి పోయిన ఆ ముగ్గురిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదలొద్దు.. కచ్చితంగా ఓడించి తీరాలె...' అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ ముఖ్య నేతలకు సూచించారు. ఎంపీ టిక్కెట్ ఇచ్చిన తర్వాత... పార్టీ మారి 'హ్యాండిచ్చిన' చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఉద్దేశించి ఆయన ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్నో ఏండ్ల నుంచి గులాబీ పార్టీకి వెన్నంటి ఉన్న ఉద్యమకారులు, సీనియర్లను కాదని, ఆ ముగ్గురిని అక్కున చేర్చుకుని అందలమెక్కిస్తే...చివరకు నమ్మించి నట్టేట ముంచారంటూ ఆయన వాపోయారు. అందువల్ల చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని, సికింద్రాబాద్‌లో దానంను, వరంగల్‌లో కడియంను (కాంగ్రెస్ నుంచి టిక్కెట్ వచ్చే అవకాశముంది) కచ్చితంగా ఓడించి తీరాలనీ, ఇందుకోసం శాయశక్తులా కృషి చేయాలని ఆయన ఆదేశించారు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా ఒక్కొక్కరుగా బీఆర్ఎస్‌ను వీడుతున్న తరుణంలో... ఇటీవల ముఖ్య నేతలు, తనకు అత్యంత సన్నిహితులైన నాయకులతో కేసీఆర్ అంతర్గత సమావేశాన్ని నిర్వహించారని సమాచారం. ఈ సందర్భంగా ఆయన తాజా రాజకీయ పరిణామాలపై వారితో చర్చించారు. రంజిత్‌రెడ్డి, దానం నాగేందర్, కడియం శ్రీహరి తదితరులు పార్టీ మారటానికి గల కారణాలపై ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ సీటు గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'సిట్టింగ్‌గైన పసునూరి దయాకర్‌ను పక్కనబెట్టాం. దీంతో ఆయన కాంగ్రెస్‌లోకి పోయారు. సీనియర్ అయిన ఆరూరి రమేశ్‌కు మనం టిక్కెట్ ఇవ్వకపోవటంతో ఆయన బీజేపీ కండువా కప్పుకుని, ఆ పార్టీ నుంచి బరిలోకి దిగారు. కడియం శ్రీహరి కోసం వీరిద్దరినీ వదులుకుని, ఆయన కుమార్తెకు టిక్కెటిస్తే, ఏ మాత్రం కృతజ్ఞత లేకుండా మనల్ని మోసం చేశారు...' అంటూ కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని రంజిత్‌రెడ్డికి టిక్కెటిచ్చి, చేవెళ్ల ఎంపీని చేస్తే ఆయన కూడా ఇప్పుడు మోసం చేశారని వాపోయారు. రాష్ట్రంలోని మొత్తం 17 సీట్లలో మొదట అభ్యర్థిని ప్రకటించింది చేవెళ్లేనని ఆయన గుర్తు చేశారు.మరోవైపు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంపైనా కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు వినికిడి. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి, కేసీఆర్ ప్రగతి భవన్‌ను వీడిన తర్వాత, ఆయన ఎక్కడుండాలనే చర్చ జరిగినప్పుడు...'నాకు జూబ్లీహిల్స్‌లో పెద్ద ఇల్లు ఉంది, మీరు నా తండ్రి లాంటి వారు, మీరు నా ఇంట్లో ఉండొచ్చు...' అంటూ ప్రకటించిన దానం...బీఆర్ఎస్‌లో గెలిచి, సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేస్తూ పార్టీని ఆగం పట్టించాడంటూ కారు పార్టీ అధినేత అసహనాన్ని వ్యక్తం చేసినట్టు వినికిడి. వీరితోపాటు పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత... తనకు టిక్కెట్ రాదని తెలిసి, కాంగ్రెస్‌లోకి జంప్ అవటం పట్ల కేసీఆర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్టు తెలిసింది. అందువల్ల ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు, మోసం చేసిన వారి పని పట్టేందుకు గట్టి కృషి చేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు.

కాసాని గెలుపు ఖాయం...

చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు ఖాయమని కేసీఆర్ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 13న చేవెళ్లలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు లక్ష మంది దాకా సమీకరించాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశించారు. ఆ సభను విజయవంతం చేయటం ద్వారా కాసాని గెలుపు సంకేతాలివ్వాలంటూ నేతలకు సూచించారు.

వినిమయ, విషప్రచారాన్ని అడ్డుకోవాలి

- పీఎన్ఎం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్, కట్టా నర్సింహ



నవతెలంగాణ-భువనగిరి

సమాజంలో వస్తున్న వినిమయ, విషప్రచారాన్ని అడ్డుకోవాలని, అందుకోసం నేటి సమాజానికి అవసరమయ్యే కళలు, సంస్కృతిని అందించాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్, కట్టా నర్సింహ తెలిపారు. ఆదివారం భువనగిరి జిల్లాకేంద్రంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సమావేశం, రెండ్రోజుల శిక్షణాతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో చరిత్రను వక్రీకరించే విధంగా సినిమాలు వస్తున్నాయన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాటం లేకుండా తెలంగాణ ప్రజలు విముక్తి కాలేరన్నారు. దేశంలో, రాష్ట్రంలో కుల, మత, ప్రాంతీయ, మూఢవిశ్వాసాలను పెంచుతూ ప్రజల్లో విద్వేషాలను బీజేపీ సృష్టిస్తున్నదని తెలిపారు. తద్వారా రాజకీయ లబ్ది పొందడానికి కృషి చేస్తున్నారని, అలాంటి వారిని తిప్పి కొట్టాలన్నారు. భారతీయులందరూ ఒకటేనని చాటి చెప్పే కళారూపాలు, పాటలు, నృత్యాలను తయారు చేయాలన్నారు. వాటిని సోషల్ మీడియాలో అధునాతన పద్ధతిలో ప్రజలకు అందే విధంగా పెట్టాలని తెలిపారు. నేటి యువత మత్తు పదార్థాల వైపు పయనించే విధంగా కుట్రలు జరుగుతున్నాయన్నారు. వాటిని తిప్పి కొట్టడానికి మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం, ఆర్థిక, విలువలు ఎలా పోతాయో వివరించాలన్నారు. కవులు, కళాకారులు నూతనంగా రచించిన పాటలు పాడారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అవ్వార్ గోవర్ధన్, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి ముత్యాలు, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- నేటి నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో మొత్తం సీట్లతోపాటు ఏడు నుంచి పదో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ఈనెల ఏడో తేదీన రాతపరీక్ష జరగనుంది. అదేరోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతికి దరఖాస్తు చేసిన అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 62,983 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా సోమవారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని సూచించారు.

ఆర్థిక నష్టం తీవ్రం

- బాల్టిమోర్ వంతెన కూలిన ఘటనపై పలు సంస్థల అంచనా
- ఇప్పటి ప్రాణ నష్టంతో పాటు వ్యాపారాలకూ దెబ్బ

వాషింగ్టన్ : యూఎస్‌లోని బాల్టిమోర్‌లో గతనెల 27న ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన కూలిపోయింది. పటాప్‌స్కో నదిపై ఉన్న ఈ వంతెనను నౌక ఢీకొనటంతో ఈ ఘటన చోటు చేసుకున్నది. అనంతరం, ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టి వైరల్‌గా మారాయి.ఈ ఘనటలో దాదాపు ఆరుగురు వరకు మరణించి ఉండొచ్చనే వార్తలు వచ్చాయి. ప్రాణనష్టమే కాదు.. పలువురు గల్లంతయ్యారు. ఈ బ్రిడ్జిపై ఆ సమయంలో ఉన్న వాహనాలూ నదిలో పడిపోయాయి. అనంతరం బ్రిడ్జిపై ఆధారపడి నడిచే వ్యాపారాలు సైతం దెబ్బతిన్నాయి. ఆర్థిక విశ్లేషణ సంస్థ ఇంప్లాన్ ప్రకారం.. ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు వచ్చే నెలలో కార్మిక ఆదాయంలో వందల మిలియన్ల డాలర్లు నష్టపోయే అవకాశం ఉన్నది. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మార్నింగ్‌స్టార్ డీబీఆర్ఎస్ నుంచి వచ్చిన ఒక నివేదిక.. ఈ ఘటన చరిత్రలో అత్యంత ఖరీదైన సముద్ర బీమా నష్టంగా మారుతుందని అంచనా వేసింది. ఇది ఇటలీకి సమీపంలోని కోస్టా కాంకోర్డియా క్రూయిజ్ షిప్ 2012 షిప్‌బ్రెక్‌లో జరిగిన నష్టాన్ని అధిగమించొచ్చని వివరించింది. మార్నింగ్‌స్టార్ డీబీఆర్ఎస్ అంచనా ప్రకారం బాల్టిమోర్ విపత్తు మొత్తం బీమా నష్టాలు రూ. 16.67 వేల కోట్ల నుంచి రూ.33.35 వేల కోట్ల వరకు ఉండవచ్చని తెలుస్తున్నది.

ఎకరాకు రూ.25 వేల పరిహారమివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)



గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీస్తామని స్పష్టం చేశారు. సాగు నీరందక ఎండిన పంటలను పరిశీలించి, రైతన్నలకు భరోసా కల్పించడానికి.. ఆదివారం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి జనగాం జిల్లా దేవరుప్పల ధరావత్ గ్రామానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బయలుదేరారు. అనంతరం అక్కడ నుంచి సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోనూ పర్యటించారు. జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధరావత్‌తండాలో ఎండిన వరి పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు అంబోతు సత్తమ్మ మాజీ సీఎం కేసీఆర్‌కు తమ సమస్యను వివరించారు. 8 ఎకరాల్లో వరి వేశానని, సాగునీరు అందక ఆరు ఎకరాల పంట ఎండిపోయిందని తెలిపారు. గతంలో నాలుగు బోర్లు వేసి నష్టపోయామని, ఇప్పుడు పంట చేతికి వస్తుందనుకుంటే ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన కూతురి పెండ్లి చేద్దామనుకున్నామని.. ఇలాంటి నష్టం ఎదురైందని తెలిపారు. దీనిపై కేసీఆర్ స్పందిస్తూ.. పంట ఎండిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి రైతులు ఏడుస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీలో పర్యటిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చే విధంగా రైతుల పక్షాన ఉండి పోరాడుతానని తెలిపారు. రైతులు అధైర్య పడొద్దని, అండగా ఉంటానని భరోసానిచ్చారు. అదేవిధంగా అంబోతు సత్తమ్మ కుమార్తె వివాహానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌కు సూచించారు. ఎండిన పంటను పరిశీలించి రైతుల గోడును వినడం జరిగింది కానీ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉందని, మాట్లాడలేకపోతున్నానని కేసీఆర్ అన్నారు. ఆయన వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బండ ప్రకాష్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, క్యామ మల్లేశం తదితరులు ఉన్నారు.

సూర్యాపేట నియోజకవర్గంలోని తుంగతుర్తి, తదితర ప్రాంతాల్లో నీళ్లందక ఎండిపోయిన పంటలను కేసీఆర్ పరిశీలించారు. అనంతరం సూర్యాపేట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఒకప్పుడు పంటలు నష్టపోతే కేంద్రానికి నివేదిక పంపించాల్సి ఉండేదని, మూడు నెలల తర్వాత అధికారులు వచ్చి పరిశీలించి.. రిపోర్టు రాసేవారని, అయినా రైతులకు పరిహారం అందే పరిస్థితి ఉండేది కాదన్నారు. అందుకే ఆనాడు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ పద్ధతిని మార్చేశానని తెలిపారు. భయంకరమైన రాళ్ల వాన పడి మహబూబాబాద్, ఖమ్మం.. ఇలా చాలా జిల్లాల్లో పంట నష్టం జరిగితే స్వయంగా వెళ్లి పరిశీలించి.. ఆ పొలంలోనే నిల్చుండి ఎకరానికి రూ.10వేల నష్టపరిహారం ప్రకటించడమే కాకుండా.. ఐదారు రోజుల్లోనే దాదాపు రూ.500 కోట్లకు పైగా నష్టపరిహారం రైతులకు అందించానని గుర్తు చేశారు. అదే ఇవాళ వడగండ్లతో కూడిన అకాల వర్షాలు పడి సుమారు లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోతే అడిగే దిక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదేమైనా సరే.. రణరంగమైనా సరే.. ఈ ప్రభుత్వం మెడలు వంచి పరిహారం ఇప్పిస్తామని చెప్పారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయిన నాడు కూడా రూ.470 కోట్ల బకాయిలు పెట్టిపోతే.. మేం ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని, అదే ఈనాడు తాము ఏ బకాయిలు పెట్టలేదని తెలిపారు. 50 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పరిపాలనలో ఏనాడు ఇవ్వని రూ.10వేల నష్టపరిహారం అందిస్తే.. ఆనాడు దాన్ని ఎకసెక్కం చేసి మాట్లాడారన్నారు. రూ.10 వేలు ఏమూల సరిపోద్ది.. రూ.20 వేలివ్వాలని ఆనాడు కాంగ్రెస్ నాయకులు అన్న మాటలను గుర్తు చేశారు. ప్రజల తరపున మాట్లాడేటోళ్లు లేరని అనుకుంటున్నారా? ఒక మహాసముద్రం అంత బీఆర్ఎస్ పార్టీ ఉందని, ఊరుకోదని హెచ్చరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వందకు వందశాతం రైతుల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పంటలను మీరే ఎండబెట్టారు కాబట్టి.. మీ అసమర్థత వల్లే ఎండిపోయినయి కాబట్టి నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చి ఎన్యుమరేట్ చేయాలని సూచించారు. ఏ జిల్లాలో, ఏ మండలంలో, ఏ గ్రామంలో, ఏ రైతు పంట ఎంత ఎండిపోయిందనే లెక్కలు తీయాలన్నారు. ధరలు అన్నీ పెరిగినయ్ కాబట్టి.. ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'మీరు ఒకర్నో.. ఇద్దర్నో కుక్కల్నో.. నక్కల్నో గుంజుకుని ఓహో.. ఆహా.. అని సంకలు గుద్దుకోవచ్చు.. అది చిల్లర రాజకీయ స్టంట్ మాత్రమే ప్రజల సమస్యల ముందు, వారి బాధ ముందు.. ఎండిపోయిన పంటల ముందు.. చిల్లర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో తిరిగి మళ్లీ బిందెలు ఎందుకు ప్రత్యక్షమవుతున్నయ్..? ఎందుకు నీటిమోతలు స్టార్ట్ అయ్యాయంటూ సర్కారును నిలదీశారు. ప్రపంచ దేశాలు, యూఎన్ఓ, 15-16 రాష్ట్రాలు కొనియాడి అమలు చేసుకుంటున్న మిషన్ భగీరథ పథకం ఉండి కూడా రాష్ట్రంలో ఎందుకు మంచినీళ్ల కొరత వచ్చిందని ప్రశ్నించారు. చీఫ్ సెక్రెటరీ స్టేట్‌మెంట్‌లో సోర్సెస్ అన్నీ బరాబర్ ఉన్నయ్.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. తాను సీఎంగా ఉన్న సమయంలో ఈ టర్మ్‌లోగా భగీరథ కంప్లీట్ చేయకపోతే వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయదని.. ఓట్లు అడగదని ఛాలెంజ్‌గా చెప్పి పథకాన్ని పూర్తి చేశామన్నారు. ఆ తర్వాత ఐదేండ్లు బ్రహ్మాండంగా నడిపామని, బిందెపట్టుకొని ఆడబిడ్డ ఎక్కడా రోడ్డుపై కనిపించలేదని అన్ని మామయ్యాయని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ మంచినీళ్ల ట్యాంకర్లు ఎందుకు విచ్చలవిడి వ్యాపారం చేస్తున్నాయని, హైదరాబాద్ సిటీలో ట్యాంకర్లు పెట్టాల్సిన దుస్థితి ఎందుకు దాపురించిందని, ఇవీ ఆలోచించాల్సిన విషయాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ అనంతరం చాలా దారుణంగా ఉన్న విద్యుత్ రంగాన్ని మూడు నెలల్లోనే సుమారు రూ.35వేలకోట్లు ఖర్చు చేసి.. రకరకాల పద్ధతులు అవలంబించి.. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీని సంప్రదించి.. మెదడును కరగదీసి.. విద్యుత్ రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని చెప్పారు. దేశంలో.. ఒక సెకండ్ కరెంట్ పోకుండా అన్నిరంగాలకు 24గంటలు కరెంట్ అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో కరెంటు పోతే వార్త అని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు ఉంటే వార్త అని విమర్శించారు.

రాష్ట్రానికి ఏం చెదలు పట్టింది?

గత బీఆర్ఎస్ పాలనలో అగ్రగామిగా తెలంగాణ.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రానికి చెదలు పట్టి అస్తవ్యస్తంగా మారిందని మాజీ సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.కొత్తగా నడిపించేది ఏమీ లేదని, కొత్తగా మొద్దులు మోసేది లేదని, కట్టెలు కొట్టేది లేదని, కొత్త గడ్డపారలు పట్టి తవ్వేది లేదని, ఉన్న వ్యవస్థ ఉన్నట్లు నడిపించలేని అసమర్థత, అశక్తత రాష్ట్ర ప్రభుత్వానిదని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత, అవివేకం, తెలివితక్కువ తనం, అవగాహనా రాహిత్యం, దేన్నీ ఎట్లా వాడాలో తెలియని అర్భకత్వం తమకు కనిపిస్తుందని దుయ్యబట్టారు. ఉన్న కరెంటును, మిషన్ భగీరథను వాడుకునే తెలివి లేక.. మళ్లీ జనరేటర్లు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లు, స్టెబిలైజర్లు కొనుక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే పంటలను ఎండబెట్టిందని.. రైతులను వారే ఆదుకోవాలని లేకుంటే.. ఏప్రిల్ 2న బీఆర్ఎస్ శ్రేణులు రైతుల పక్షాన జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. అదే రోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. హైదరాబాద్‌లో ప్రభుత్వానికి విజ్ఞాపన చేస్తారని చెప్పారు. పంటలకు బోనస్ కోసం ఏప్రిల్ 6న ఒక్క రోజు దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. రైతులను ఆదుకునే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని నిలదీస్తామని, నిరసనలు, ధర్నాలు చేపడతామని స్పష్టంచేశారు. రైతులు ఆత్మహత్య చేసుకోవద్దని.. వారి పక్షాన తాము పోరాడతామని తెలిపారు. సమావేశంలో మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు, జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థులు మల్లేష్, కంచర్ల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, చిరుమర్తి లింగయ్య, రవీంద్రనాయక్, పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ వాహనం తనిఖీ

ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో.. ఎండిన పంటలను పరిశీలించడానికి వెళ్లిన మాజీ సీఎం కేసీఆర్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధారావత్‌తండాలో రైతుల ఎండిన పంటలను పరిశీలించి అక్కడి నుంచి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటనకు బయలుదేరారు.

కాగా, ఈదులపర్రె తండా మీదుగా సూర్యాపేట జిల్లాలోకి ప్రవేశిస్తున్న కేసీఆర్ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు.

కేసీఆర్‌వన్నీ అబద్ధాలే

- ఆయన ప్రెస్‌మీట్‌లో కరెంటు పోలేదు
- ఆ భవనం జనరేటర్‌తో నడుస్తుంది : విద్యుత్‌శాఖ సూర్యాపేట డివిజన్ ఎస్ఈ వివరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సరఫరాపై సూర్యాపేట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత కే చంద్రశేఖరరావు తప్పుడు ఆరోపణలు చేశారని టీఎస్ఎస్పీడీసీఎల్ సూర్యాపేట డివిజన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ స్పష్టత ఇచ్చారు. విలేకరుల సమావేశంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందనేది సుద్ధ అబద్ధమన్నారు. సూర్యాపేట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం మొత్తం ప్రయివేటు జనరేటర్‌తో నడిచిందనీ, అసలు టీఎస్ఎస్పీడీసీఎల్ విద్యుత్ సరఫరాకు అనుసంధానమే కాలేదని స్పష్టత ఇచ్చారు. అదే సమయంలో ఆ చుట్టుపక్కల అన్ని ఇండ్లలో కరెంటు ఉన్నదనీ, జనరేటర్ ఆఫ్ చేసి విద్యుత్ సంస్థల్ని బదనాం చేశారని వివరణ ఇచ్చారు. ఈ మేరకు టీఎస్‌జెన్‌కో సీఎమ్‌డీ రిజ్వీకి సూర్యాపేట ఎస్ఈ లిఖిత పూర్వక నివేదిక ఇచ్చారు.

కేసీఆర్ లేని లోటు నాలుగు నెలల్లోనే నిరూపితం

తాగునీటి కోసం సాగర్ జలాలు రప్పించాలి

- కేసీఆర్ లేకపోతే నీటి ఎద్దడే..!
- కాంగ్రెస్‌కు ఓటేసిన రైతులు దు:ఖిస్తున్నారు :బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామ, మాజీ మంత్రి పువ్వాడ, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు
- ఎండిన పంటలు, అడుగంటిన పాలేరు జలాశయ పరిశీలన



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కేసీఆర్ అంటేనే కాలువలు, చెరువులు, నదులు.. ఆయన లేకపోతే నీటి ఎద్దడి వస్తుందని కేవలం 4 నెలల్లో నిరూపితమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనం వల్ల వచ్చిన కరువుగా దీన్ని గుర్తించాలని తెలిపారు. అడుగంటిన పాలేరు జలాలు, ఎండిన పంటల పరిశీలన అనంతరం ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి అజయ్ మాట్లాడారు. మన చేతుల్లో ఉన్న వ్యవస్థలను పదేండ్లు భద్రంగా కాపాడుకున్నామన్నారు. నాగార్జునసాగర్ నీళ్లను తాగునీటిగా తీసుకోలేని పరిస్థితి ఈ ప్రభుత్వానిదని విమర్శించారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోవడమే కాదు, తాగునీటికి కూడా సమస్యలు వచ్చాయన్నారు. గడిచిన పదేండ్లలో ఎప్పుడైనా ఈ పరిస్థితి వచ్చిందా అని ప్రశ్నించారు. మార్చిలోనే ఈ సమస్య ఉంటే ఏప్రిల్, మేలో ఎంత నీటి ఎద్దడి ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. ఒక్క నీటి సమస్యే కాదు.. కరెంట్ సమస్య కూడా రాష్ట్రంలో ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇది తీవ్రం అవుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఇంతవరకు రైతుబంధు పడలేదన్నారు. రైతులకు ఎకరానికి నష్టం కింద రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

పాలేరులో సగం టీఎంసీ మాత్రమే నీళ్ళు ఉన్నాయన్నారు. కేవలం వారం రోజులకే ఈ నీళు సరిపోతాయని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రేపటి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ప్రచారం నిర్వహిస్తారని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కేశవ్ అన్న ఏమి ఆశించి పార్టీ వీడారో తెలియదు: ఎంపీ రవిచంద్ర

పార్టీలో సెకండ్ పొజిషన్‌లో ఉన్న కే. కేశవరావు ఏమి ఆశించి బీఆర్ఎస్‌ను వీడారో తెలియదు గానీ కేసీఆర్ ఆయనకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. నామ గెలుపుతో కేసీఆర్ సంతోషిస్తారన్నారు. పాలేరు రిజర్వాయర్ ఇంతలా అడుగంటిన దాఖలాలు లేవని గుర్తుచేశారు. పాలేరు జలాశయాన్ని సాగర్ జలాలతో నింపి తాగునీరు వెంటనే విడుదల చేయాలని, పంట నష్టపోయిన రైతులకు రూ. 10,000 పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కనీసం 13 ఎంపీ సీట్లు గెలవాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ చంద్రావతి, మదన్ లాల్, జడ్పీ చైర్మెన్ లింగాల కమల్ రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ చైర్మెన్ కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దు:ఖిస్తున్నారు : ఎంపీ అభ్యర్థి నామ

రైతు బిడ్డగా.. కష్టాలు దగ్గరగా చూసిన వ్యక్తిగా ఇవ్వాళ రాష్ట్రంలో ఉన్న సమస్యలను చూసి చాలా బాధపడ్డానని బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు రైతులు బాధపడుతున్నారని తెలిపారు. ఒక్క తడికి నీళ్ల వదిలి ఉంటే పంట చేతికి వచ్చేదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేసుకున్నారు. మా చిన్నప్పుడు అన్నం తినాలంటే పండుగ రావాలని.. కానీ కేసీఆర్ హయాంలో బియ్యం ఎగుమతుల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్నామన్నారు. నీళ్ళు లేక రాష్ట్ర ప్రజలు నిత్యం బోర్లు వేస్తున్నారని చెప్పారు. అప్పట్లో తాము హెలికాప్టర్లలో వస్తుంటే నీళ్లు, పచ్చని పొలాలు కనిపించేవని, ఇప్పుడు పంటలు ఎండిపోయి కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల పంటలు ఎండిపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రజలు కేసీఆర్‌కు అండగా ఉండాలనే నిర్ణయానికి వస్తున్నారని అన్నారు.

ఉద్ధరించుడు లేదు.. ఉద్ధర మాటలే

- రైతులకిచ్చిన ఏ హామీ అమలు కాలే
- కాంగ్రెస్‌కు ఓట్లేస్తే మళ్లీ మోసపోతాం
- రాముడి అక్షింతలు తప్ప రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదు:మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-కామారెడ్డి/లింగంపేట్



'100 రోజుల కాంగ్రెస్ బాండ్ పేపర్ పాలనలో ఉద్ధరించుడు మాట దేవుడెరుగు కానీ, అన్నీ ఉద్ధర మాటలే చెప్తున్నారు. 6 గ్యారంటీల్లో ఇస్తానన్న మొదట హామీ అయిన ప్రతి నెలా మహిళలకు రూ. 2,500లు డిసెంబర్ నెల నుంచి ఇస్తామన్న దాన్ని నిలబెట్టుకోలే. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. కొత్త హామీలు అమలు కాకపోగా, ఉన్న పథకాలు కూడా అటకెక్కించిన ఘనత ఈ కాంగ్రెస్ పార్టీది. కాంగ్రెస్ పార్టీ వచ్చింది. కరువు వచ్చింది. కరెంట్ మోటార్లు కాలిపోతున్నాయి' అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డిలో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతామని, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.4,000 పెన్షన్, తులం బంగారం లాంటి హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కాబట్టి, కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టాలని, దీనిపైన ప్రతి గ్రామంలో చర్చ జరగాలని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా అమలు చేయని కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదన్నారు.

యాసంగి వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు.ారుకు ఓటేసి కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలన్నారు. నిరుద్యోగులను, రైతులను మోసం చేసిన పార్టీ బీజేపీ అని, ఆ పార్టీ ఎందుకు ఓటెయ్యాలని, ఏం ఇచ్చిందని ఓటు వేయాలని ప్రశ్నించారు. రాముడి అక్షింతల పేరుతో రాజకీయం చేయడం తప్పా.. తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. సోషల్ మీడియాలో లీకు న్యూస్‌లు, ఫేక్ వార్తలతో గోబెల్స్ ప్రచారం చేయిస్తూ రాజకీయ పబ్బం గడుపుతుంది కాంగ్రెస్ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కారు గుర్తుపై గెలిచి ఈ రోజు కాంగ్రెస్ కండువా కప్పుకున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి వెంటనే తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని, స్పీకర్ కూడా వారిపై చర్యలు తీసుకొని, అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. గాంధేయ వాదంతో రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు, మన అధినేత కేసీఆర్ అని, అదే పోరాట స్ఫూర్తితో మన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఉద్యమకారుడు గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంపగోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్‌షిండే తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటల పరిశీలన

కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలో ఎండిన పంటలను మాజీ మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. రైతులు తమ కష్టాలు చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారు. సాగు నీరు లేకపోవడం వల్ల తమ పంటలు ఎండిపోయిన తీరును రైతులు వివరించారు. 3 ఎకరాల్లో వరి సాగు చేస్తే బోరు మోటారు 3 సార్లు కాలిపోయిందని, కాలిపోయిన ప్రతిసారీ రూ.5వేలు ఖర్చు అవుతోందని స్వామి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టదశకు వచ్చిన పొలం నీళ్ల లేక ఎండిపోయిందని, పెట్టుబడి మొత్తం పోయిందని మంజీర అనే మహిళా రైతు తన కష్టాన్ని చెప్పుకున్నారు. ఆందోళన చెందొద్దని, తాము అండగా ఉంటామని ఈ సందర్భంగా హరీశ్‌రావు రైతులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.25వేల పరిహారం ఇప్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పోడు భూములపై గిరిజనుల మధ్య ఘర్షణ

- అడ్డుకోబోయిన పోలీసులపై రెండు గ్రూపులు దాడి
- సీఐ కిరణ్‌ను వెంటాడి మరీ చొక్కావిప్పి.. పిడిగుద్దులతో దాడికి పాల్పడిన గిరిజనులు
- 40 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో ఘటన

నవతెలంగాణ-సత్తుపల్లి



పోడు భూముల విషయమై రెండు గిరిజన గ్రూపుల మధ్య జరుగుతున్న ఘర్షణను అడ్డుకోబోయిన పోలీసులను ఆ రెండు గ్రూపులు కలిసి మూకుమ్మడిగా దాడిచేసి గాయపర్చిన ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. చంద్రాయపాలెంలో వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్), అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉన్న భూమి విషయమై చంద్రాయపాలెం, బుగ్గపాడు గిరిజనుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సదరు భూమిలో మొక్కలు నాటేందుకు ఇటీవల అటవీశాఖ మొద్దులు తీసి శుభ్రం చేశారు. ఈ క్రమంలో బుగ్గపాడు, నాగుపల్లి గ్రామాలకు చెందిన కొందరు గిరిజనులు ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలిసింది. వారి ప్రయత్నాలను చంద్రాయపాలెం గిరిజనులు, అటవీ సిబ్బంది అడ్డుకున్నారు. రెండు రోజుల క్రితం ఆ రెండు గ్రూపుల మధ్య ఘర్షణ కూడా నెలకొంది. ఈ ఘర్షణ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు బుగ్గపాడు గిరిజనులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న సీఐ టి.కిరణ్ బుగ్గపాడు గిరిజనులను పిలిపించి మాట్లాడారు. భూమి ఎవరికి చెందుతుందో రెవెన్యూ అధికారులతో విచారణ చేయించి సమస్యను పరిష్కరిస్తామని, గొడవలు పడొద్దని, భూమి పైకి వెళ్లొద్దని నచ్చజెప్పి వాళ్లని పంపించేశారు.

మళ్లీ రెండు గ్రూపుల మధ్య ఘర్షణ

చంద్రాయపాలెంలో రెండు గ్రూపుల మధ్య ఆదివారం మళ్లీ ఘర్షణ చెలరేగింది. బుగ్గపాడు గిరిజనులతో పక్క గ్రామమైన నాగుపల్లికి చెందిన కొందరు తోడయ్యారు. వీళ్లంతా కలిసి చంద్రాయపాలెం వెళ్లి అక్కడి గిరిజనులపై ఘర్షణకు దిగారు. గిరిజనుల మధ్య ఘర్షణ జరుగుతున్న విషయం 100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న సీఐ టి.కిరణ్ సిబ్బందితో ఘర్షణ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లారు. ఘర్షణను నివారించేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా ఘర్షణ పడుతున్న రెండు గ్రూపులు పోలీసులపై తిరగబడ్డారు. సీఐ కిరణ్ అక్కడికి వెళ్లిన వెంటనే ఒకరిపై చేయి చేసుకున్నారు. ఇది చూసిన రెండు గ్రూపులకు చెందిన గిరిజనులంతా ఏకమై సీఐపై దాడికి దిగినట్టు తెలుస్తోంది.

సీఐ కిరణ్ చొక్కావిప్పి మరీ దాడిచేసిన గిరిజనులు

అదుపు తప్పుతున్న పరిస్థితిని గమనించి సీఐ అక్కడి నుంచి వెళ్లేందుకు ఒకరి మోటారు సైకిలుపై వెనుక కూర్చొని వెళ్లే ప్రయత్నం చేయగా.. గిరిజనులు వెంబడించి మరీ సీఐని మోటారు సైకిలు పైనుంచి లాగి కర్రలతో దాడికి పాల్పడ్డారు. సీఐను కాపాడేందుకు ప్రయత్నించిన నలుగురు పోలీసు సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. అంతటితో ఆగక గిరిజనులంతా సీఐని చుట్టుముట్టి అతని చొక్కాని విప్పి మరీ దాడి చేశారు. గిరిజనుల దాడి నుంచి అతి కష్టంపై సీఐ కిరణ్ తప్పించుకొని బయటపడ్డారు. పోలీసులపై గిరిజనులు దాడికి పాల్పడిన ఘటనపై 40మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

కాంగ్రెస్‌కు ఐటీ మరో షాక్

- రూ. 1,745 కోట్లకు సంబంధించి తాజా నోటీసు
- రూ.3,567 కోట్లకు పెరిగిన మొత్తం పన్ను డిమాండ్
- ఎన్నికల వేళ హస్తం పార్టీకి ఆర్థిక కష్టాలు

న్యూఢిల్లీ : ఎన్నికల వేళ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌కు ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ వరుస షాక్‌లు ఇస్తున్నది. తాజాగా మరొక నోటీసును ఆ పార్టీకి పంపింది. 2014-15 నుంచి 2016-17 మదింపు సంవత్సరాలకు రూ. 1,745 కోట్లు చెల్లించాలని పన్ను డిమాండ్‌ను పెంచుతూ ఐటీ నుంచి ఈ నోటీసులు అందినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ తాజా నోటీసుతో ఐటీకి కాంగ్రెస్ చెల్లించాల్సిన మొత్తం పన్ను డిమాండ్ (వడ్డీలు, పెనాల్టీలు కలిపి) రూ.3,567 కోట్లకు పెరిగినట్టయ్యింది. తాజా పన్ను నోటీసులు 2014-15 (రూ. 663 కోట్లు), 2015-16 (దాదాపు రూ. 664 కోట్లు), 2016-17 (దాదాపు రూ. 417 కోట్లు)కి సంబంధించినవిగా సమాచారం. అధికారిక వర్గాలు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉన్న పన్ను మినహాయింపును తొలగించాయి. పార్టీలకు వచ్చిన మొత్తం వసూళ్లపై పన్నును విధిస్తున్నాయి

సోదాల సందర్భంగా దర్యాప్తు ఏజెన్సీలు కొంతమంది నాయకుల నుంచి స్వాధీనం చేసుకున్న డైరీలలో చేసిన "థర్డ్ పార్టీ ఎంట్రీల"కు కూడా కాంగ్రెస్‌పై పన్ను విధించారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. రూ. 1,823 కోట్లు చెల్లించాలని ఐటీ శాఖ నుంచి నోటీసులు అందాయని ప్రధాన ప్రతిపక్షం శుక్రవారం తెలిపిన విషయం విదితమే. మునుపటి సంవత్సరాలకు సంబంధించిన చెల్లింపులకు సంబంధించి ఐటీ అధికారులు ఇప్పటికే పార్టీ ఖాతాల నుంచి రూ.135 కోట్లను విత్‌డ్రా చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలో కాంగ్రెస్ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసు నేడు (సోమవారం) సుప్రీంకోర్టు ముందుకు వచ్చే అవకాశం ఉన్నది. ఈ విషయంలో ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ హైకోర్టు నుంచి ఎలాంటి ఉపశమనాన్ని ఆ పార్టీ పొందలేకపోయింది. ఇతర డైరీలలో బీజేపీ నేతల పేర్లతో కూడిన థర్డ్ పార్టీ ఎంట్రీలకు ఎలాంటి పన్నూ విధించలేదని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ "ట్యాక్స్ టెర్రరిజం"లో మునిగిపోయిందనీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీని ఆర్థికంగా కుంగదీస్తున్నదని వారు ఆరోపించారు. ఇలా చేయటం ద్వారా ఎన్నికల సమయంలో ఆటంకం కలిగిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ విషయమై ఎన్నికల కమిషన్(ఈసీ)కి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది.

బీజేపీకి పట్టు దొరకదు

- వంద సార్లు పోటీ చేసినా తమిళనాడులో ఆ పార్టీ డ్రామా పని చేయదు
- ప్రధానికి ఎన్నికల్లో ఓటమి భయం : సీఎం స్టాలిన్

చెన్నై : బీజేపీ, ప్రధాని మోడీ టార్గెట్‌గా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె స్టాలిన్ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఎన్నికల్లో వంద సార్లు పోటీ చేసినా.. వారికి ఇక్కడ పట్టు దొరకదని చెప్పారు. "ఈ ఎన్నికలే కాదు.. వంద ఎన్నికలు వచ్చినా, మీ(మోడీ, బీజేపీ) డ్రామా తమిళనాడులో పని చేయదు" అని కృష్ణగిరిలో జరిగిన ఒక బహిరంగ సభలో సీఎం అన్నారు. తమిళనాడులో ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలను మతం, కులం పేరుతో విభజించాలని చూస్తున్న పార్టీ బీజేపీ మాత్రమేనని ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయం మోడీకి పట్టుకున్నదనీ, వారిపై భారతీయులందరూ ఆగ్రహంతో ఉన్నారని స్టాలిన్ అన్నారు. "ఎన్నికల్లో ఈసీ, సీబీఐ, ఐటీలను మోడీ ఉపయోగిస్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయాన్ని ఇది చూపెడుతున్నది. మోడీపై భారతీయులందరిలో కోపం ఉన్నది. అందుకే ఆర్థిక మంత్రి వంటి ఆ పార్టీ సీనియర్ నాయకులు భయంలో ఉండి, ఎన్నికల్లో పోటీ చేయటం లేదు. బీజేపీ కనీసం నోటాకు తక్కువ కాకుండా ఉండాలి. అందుకే వారు జయలలిత, ఎంజీఆర్‌ను పొగుడుతున్నారు. జయలలిత బతికి ఉన్నప్పుడు మోడీ ఆమెను విమర్శించారు. జయలలిత ప్రభుత్వం అవినీతిమయమన్నారు. ఆ మాటలను ఆయన మరిచిపోయారా" అని స్టాలిన్ ప్రశ్నించారు. మహిళా రెజ్లర్ల నిరసనలు, మణిపూర్‌లో మహిళలు ఎదుర్కొన్న వేధింపుల విషయంలో కేంద్రం 'నారీ శక్తి' ట్యాగ్‌లైన్‌కు భిన్నంగా మోడీ తీరు ఉన్నదని అన్నారు.

నెతన్యాహు గద్దె దిగాలి

- ఇజ్రాయెల్‌లో భారీ ప్రదర్శనలు



టెల్ అవీవ్ : నెతన్యాహు ప్రభుత్వం గద్దెదిగాలని డిమాండ్ చేస్తూ ఇజ్రాయెల్‌లోని పలు నగరాల్లో ఇజ్రాయెలీలు భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. టెల్ అవీవ్, జెరూసలేం, హైఫా, బీఎర్‌శేవ, కాశరియా తదితర నగరాల్లో శనివారం వేలాదిమంది కదం తొక్కారు. పాలస్తీనా పట్ల అనుసరిస్తున్న దుర్మార్గ వైఖరిని ఖండిస్తూ ,తక్షణమే బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

బీజేపీ అభ్యర్థి ర్యాలీలో కార్లపై రాళ్ళు

ముజఫర్‌నగర్ (యూపీ) : బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో కొంతమంది వ్యక్తులు రాళ్ళు విసిరి, అనేక కార్లను ధ్వంసం చేశారు. ముజఫర్‌నగర్ జిల్లాలోని ఖతౌలి ఏరియాలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి, కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యాన్‌కి మద్దతుగా ర్యాలీ జరిగింది. సభలో బాల్యాన్ ప్రసంగిస్తుండగా, ఆ సమీపంలో పార్క్ చేసిన కార్లు ధ్వంసం చేయబడ్డాయి. దీనిపై నగర అదనపు ఎస్పీ సత్యనారాయణ ప్రజాపత్ మాట్లాడుతూ, శనివారం రాత్రి సభలో బాల్యాన్ మాట్లాడుతుండగా, కొన్ని అవాంఛనీయ శక్తులు అనేక వాహనాలపై రాళ్ళు విసిరాయని, కార్ల కిటికీలు పగలగొట్టాయని చెప్పారు. దాడికి పాల్పడినవారు నినాదాలు కూడా చేశారని తెలిపారు.దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో అదనపు పోలీసు బలగాలను మోహరించామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ సైనీ ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వికసిత్ భారత్ లక్ష్యం !

- ఇప్పటివరకు చూసింది అభివృద్ధి ట్రయలరే : మీరట్ ర్యాలీలో మోడీ



మీరట్ : మరికొద్ది రోజుల్లో జరగబోతున్న లోక్‌సభ ఎన్నికలు కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికే కాదని, వికసిత్ భారత్ కోసం కూడానని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గత పదేళ్లలో అభివృద్ధికి సంబంధించి కేవలం ట్రయలర్‌ను మాత్రమే ప్రజలు చూశారని, ఇప్పుడు దేశాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లబోతున్నామని చెప్పారు. రాబోయే ఐదేళ్లకు రోడ్‌మ్యాప్‌ను తమ ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన తర్వాత ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో ఆదివారం నిర్వహించిన మొదటి ర్యాలీలో మోడీ ప్రసంగించారు. విప్లవానికి, విప్లవ వీరులకు పుట్టినిల్లు మీరట్ అని కొనియాడారు. చౌదరి చరణ్ సింగ్ వంటి గొప్ప నేతలను దేశానికి అందించిందని గుర్తు చేసుకున్నారు. మూడో దఫా పదవీకాలాన్ని చేపట్టడానికి తమ ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు మొదలుపెట్టిందని చెప్పారు. మొదటి వంద రోజుల్లో తీసుకోవాల్సిన ప్రధాన నిర్ణయాలు ఏమిటనే అంశంపై తీవ్రంగా కసరత్తు చేస్తున్నామన్నారు. తాను దారిద్ర్యంలోనే పెరిగానని, అందుకే తనకు ప్రతి నిరుపేద కష్టం తెలుసునని చెప్పారు. వారి బాధలు, కష్టాలను తాను అర్థం చేసుకుంటానన్నారు.

అందువల్లే వారి ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేలానే తాను పథకాలు రూపొందిస్తున్నానన్నారు. పేదలకు సాధికారత కల్పించడమే కాకుండా వారికి ఆత్మగౌరవం కూడా కల్పిస్తామని చెప్పారు. అవినీతిపై పోరాడుతున్నందు వల్లే అవినీతిపరులు కటకటాల వెనుకవున్నారని, ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని అన్నారు. ఇటీవల ఎన్‌డిఎలో చేరిన ఆర్‌ఎల్‌డి అధ్యక్షుడు జయంత్ చౌదరి కూడా మోడీతో వేదికను పంచుకున్నారు. మీరట్ నుండి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామాయణ్ ఫేమ్ అరుణ్ గోవిల్, యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్, హర్యానా సిఎం నయాబ్ సింగ్ సైనీ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

'అవినీతి' మున్సిపాల్టీలు..!

- బిల్‌కలెక్టర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేతివాటం
- కొందరు సస్పెండ్, మరికొందరిపై కేసులు
- ఇప్పటివరకు మూడు మున్సిపాల్టీల్లో నిధులు స్వాహా



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ జిల్లా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు అవినీతికి కేరాఫ్‌గా మారుతున్నాయి. కమిషనర్ల నిర్లక్ష్యం, సంబంధిత ఉద్యోగుల పర్యవేక్షణా లోపంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, బిల్ కలెక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటివరకు మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో రూ. 2కోట్లు, బోడుప్పల్ కార్పొరేషన్‌లో రూ.30 లక్షలు, మేడ్చల్ మున్సిపాల్టీలో రూ.25 లక్షల నిధులు దుర్వినియోగం జరిగినట్టు ఆడిట్ లెక్కల్లో తేలింది. ఘట్‌కేసర్, బోడుప్పల్‌లో స్వాహా నిధులను మొత్తం రికవరీ చేయగా.. మేడ్చల్ మున్సిపాల్టీలో మరో రూ.5లక్షలు రికవరీ చేయాల్సి ఉంది. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ వారిలో కొందరిని విధుల నుంచి తొలగించగా.. మరికొందరిపై కేసులు నమోదయ్యాయి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 మున్సిపాల్టీలు, 4 కార్పొరేషన్లు ఉన్నాయి. గతంలో బోడుప్పల్ కార్పొరేషన్‌లో చాలా సార్లు నిధుల గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలున్నాయి. దీనికితోడు మున్సిపాల్టీలు కూడా అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి. మున్సిపాల్టీల్లో కమిషనర్ తర్వాత కీలకంగా వ్యవహరించాల్సిన ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజువారీ కార్యకలాపాలపై పర్యవేక్షణ చేయకపోవడంతోనే నిధుల గోల్‌మాల్ అవుతున్నట్టు చర్చ జరుగుతోంది. ఈ రోజు ఏం జరిగింది..? ఎంత డబ్బు వచ్చింది..? వంటి పూర్తి వివరాలను చూసుకోవాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలూ వినిపిస్తున్నాయి. దీనికితోడు మున్సిపాల్టీల్లో సరిపడా ఉద్యోగులు లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై దాదాపు అన్ని డిపార్టుమెంట్లు ఆధారపడాల్సి వస్తోంది. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, అడ్మినిస్ట్రేషన్, విద్యుత్ వంటి విభాగాల్లో అధికంగా వారే ఉన్నారు. శానిటరీ, బిల్‌కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు, సూపర్‌వైజర్లు ఇలా అందరూ తాత్కాలిక ఉద్యోగులే ఉండటంతో వారి చేతివాటానికి అంతులేకుండా పోతోంది. వీరిని పర్యవేక్షించాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉండటంతో అందినకాడికి స్వాహా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నిధుల గోల్‌మాల్ ఇలా..

గతేడాది సెప్టెంబర్‌లో ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో నిధుల గోల్‌మాల్ జరిగింది. పన్నుల రూపేణా వసూలైన డబ్బులు ట్రెజరీలో జమ చేయకుండా బిల్ కలెక్టర్ చేతివాటం ప్రదర్శించారు. ఆడిట్ సమయంలో దాదాపు రూ.2 కోట్ల వరకు నిధులు స్వాహా అయినట్టు నిర్ధారణ అయింది. ఆడిట్ సమయంలో ఓ బిల్‌కలెక్టర్ అదృశ్యం కావడంతో అనుమానం వచ్చి విచారణ చేపట్టగా.. బాగోతం బయటపడింది. ఆడిట్ జరిపించి ఆ నిధులను తిరిగి ట్రెజరీలో జమయ్యేలా చేశారు. ఇక బోడుప్పల్ కార్పొరేషన్‌లోనూ అదే పరిస్థితి. పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.30లక్షలను బిల్‌కలెక్టర్లు సొంతానికి వాడుకున్నారు. ఈ విషయమై కొందరు రాజకీయ నాయకులు తీవ్ర ఆరోపణలు చేయడంతో విచారణ జరిపించారు.

నాలుగు నెలల తర్వాత ఆ నిధులను తిరిగి ఖాతాలో జమ చేశారు. ఇక ఇటీవల మేడ్చల్ మున్సిపాల్టీలో సైతం కుంభకోణం జరిగింది. ఆడిట్ అధికారులు నెల రోజులుగా ఆడిట్ చేసి రూ.25 లక్షల గోల్‌మాల్ జరిగినట్టు గుర్తించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించినట్టు తేలింది. ఆ ఉద్యోగి నుంచి రూ.19.5 లక్షలను రికవరీ చేశారు. మరో రూ.5లక్షల లెక్క తేలాల్సి ఉంది.

మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లలో నిధులు గోల్‌మాల్

పర్యవేక్షణ కరువు..!

మున్సిపాల్టీలకు మున్సిపల్ కమిషనర్లే బాస్‌లు.. మున్సిపాల్టీ మొత్తం వీరి ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. అన్ని శాఖలపై పట్టు సాధిస్తూ.. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత కూడా వీరిపైనే ఉంటుంది. కానీ కొందరు కమిషనర్లు నిద్రావస్థలో ఉండటంతో కుంభకోణాలు జరుగుతుంటాయి. ఇందుకు ఉదాహరణే ఇటీవల వెలుగుచూసిన అవకతవకలు. కమిషనర్ల పర్యవేక్షణా లోపంతోనే ఆర్థిక అవకతవకలు కొనసాగుతున్నట్టు చర్చ నడుస్తోంది. ప్రతి రోజూ కాకపోయినా నెలకోసారైనా ట్రెజరీలో ఎన్ని నిధులు జమవుతున్నాయి..? ఇంకా ఎంత కావాల్సి ఉంది..? ఆయా శాఖల ఉద్యోగులు ఎలా పని చేస్తున్నారు..? లాంటి వివరాలపై ఇప్పటికైనా దృష్టి సారించి నిధులు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.





ఎన్నికల బాండ్లు, సందేశ్‌ఖలిపైనే దృష్టి

- వామపక్ష అభ్యర్థుల ప్రచారం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ నుంచి పోటీచేస్తున్న వామపక్షాల అభ్యర్థులు ప్రధానంగా ఎన్నికల బాండ్లు, అవినీతి, మతోన్మాదం వంటి అంశాలతోపాటూ స్థానికంగా సంచలనం కలిగించిన సందేశ్‌ఖలి అంశాలపై ఉధృతంగా ప్రచారం సాగిస్తున్నారు. డమ్‌డమ్ ప్రాంతంలో జూట్ మిల్లు కార్మికుల ప్రయోజనార్థం సీపీఐ(ఎం) అభ్యర్థి గెలుపొందడం కీలకమని ఆ ప్రాంత జూట్ మిల్లు కార్మికులు భావిస్తున్నారు. సీపీఐ(ఎం) నేత సుజన్ చక్రవర్తి డమ్‌డమ్ నుంచి పోటీ చేస్తున్నారు.

ఈ ప్రాంత కార్మికుల దుస్థితి గురించి బాగా అర్థం చేసుకున్న చక్రవర్తి ఈసారి తన గెలుపునకు అవకాశాలు బాగుంటాయని ఆశిస్తున్నారు. తృణమూల్ అసమర్థ పాలనను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఆ పార్టీ అభ్యర్థి సౌగత్‌రాయ్ కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తున్నారని సుజన్ చక్రవర్తి అన్నారు. ఈసారి కఠినంగా పోటీ వుండనుందని ఆయన ఇప్పటికే వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. జాదవ్‌పూర్ నుంచి వామపక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన సృజన్ భట్టాచార్య, ముర్షిదాబాద్ నుంచి మహ్మద్ సలీంలు కూడా స్థానిక సమస్యలతోపాటూ సందేశ్‌ఖలిపై ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు.

కేసీఆర్ మాయ మాటలను జనం నమ్మరు

- ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాయ మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కేసీఆర్ పొలం బాట కార్యక్రమం వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి తీర్థ యాత్రలకు పోయినట్టుందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏనాడైనా పంటల బీమాగానీ, కరువు, వరదలు వచ్చి రైతులు నష్టపోతే పరిహారంగానీ ఇచ్చారా? అధికారం పోయాక ఇప్పుడు రైతులు గుర్తుకు వచ్చారా? అని ప్రశ్నించారు. రైతు బంధు, రైతు బీమా గురించి కేసీఆర్ అన్ని అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే తెలంగాణ రెండోస్థానంలో ఉందనీ, దీనికి కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు.

ప్రతిపక్షంలోకి వచ్చాక సమస్యలేంటో తెలిసిందా? కేసీఆర్‌కు అద్దంకి దయాకర్ ప్రశ్న

ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలెంటో తెలిసిందా? అని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ కేసీఆర్‌ను ప్రశ్నించారు. రాజకీయాల కోసమే పొలం బాట పట్టారని ఎద్దేవా చేశారు. జనం బాట మరచిన కేసీఆర్‌కు ప్రజల ఎజెండా కూడా తెలియని పరిస్థితుల్లో ఉన్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో పతనమవుతున్నామనే విషయం తెలిసిన తర్వాత కేసీఆర్ నేడు జనంలో కనపడటం చాలా విచిత్రంగా ఉందన్నారు. పదేండ్ల క్రితం మర్చిపోయిన జనాలను ఆయన రాజకీయాల కోసం వాడుకుంటున్నారని తెలిపారు.

అప్పుడే ఇలాంటి కార్యక్రమాలు చేసుంటే ఈ గోస వచ్చేది కాదు కదా అని గుర్తు చేశారు. గతంలో పంట నష్టపోయిన రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. కేసీఆర్ రైతుల కోసం మొసలికన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు, రాజకీయాలు తప్ప కేసీఆర్‌కు ఏమీ తెలియదని విమర్శించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్ తన ఉనికి కోసమే పొలం బాట అని ఎద్దేవా చేశారు.

రైతులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా?: చనగాని దయాకర్‌గౌడ్

పదేండ్ల ఫామ్ హౌస్ పాలనలో గుర్తుకురాని రైతులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ మాజీ సీఎం కేసీఆర్‌ను ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ఆయన ప్రజలకు దగ్గరకు వెళ్లలేదని విమర్శించారు. అసెంబ్లీకి రాకుండా, సచివాలయం వైపు కన్నెత్తి చూడకుండా ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారని తెలిపారు. రైతు బంధును కొండలు, గుట్టలకు ఇవ్వడంతోపాటు దళారుల జేబులు నింపారని ఆరోపించారు. ప్రజలు ఛీకొట్టిన తర్వాత వారినే అడ్డం పెట్టుకుని రైతుల పేరిట రాజకీయం మొదలు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు.

త్వరలో కొత్త విద్యుత్ పాలసీ

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- ఎన్నికల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ
- భారంగా ఎన్టీపీసీ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కొత్త విద్యుత్ పాలసీని తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల తర్వాత దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇష్టారాజ్యంగా అధిక ధరలకు కరెంటును కొనుగోలు చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎన్టీపీసీ నుంచి కూడా అధిక ధరకే విద్యుత్‌కొనుగోలు ఒప్పందాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి 4వేల మెగావాట్ల విద్యుత్‌ను ఎన్టీపీసీ ద్వారా రావల్సి ఉంది. దీనిలో కేవలం 1,600 మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. అక్కడి నుంచి రూ.5.90 పైసలు చొప్పున కరెంటును కొంటున్నారు. మరో 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం జరగాల్సి ఉంది. దీనినుంచి 85 శాతం కరెంటు రాష్ట్రానికే వస్తుంది. ఇవి పూర్తికావడానికి మరో ఐదేండ్లు సమయం పట్టే అవకాశం ఉంది. దీనితో నిర్మాణ వ్యయం పెరిగి అప్పటికి యూనిట్ విద్యుత్ ఖరీదు దాదాపు రూ.10 వరకు ఉంటుందని రాష్ట్ర ఇంధనశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆధునిక సాంకేతికత త్వరగా అభివృద్ధి చెందుతున్న దశలో ఎన్టీపీసీ కరెంటు విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలు) భారంగా మారుతుందని భావిస్తున్నారు. అప్పటికి బహిరంగ మార్కెట్లో యూనిట్ విద్యుత్ రూ. 2 నుంచి రూ.4 లోపే లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

ఈ నేపథ్యంలో 25 ఏండ్లపాటు అమల్లో ఉండే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపట్లేదు. దానికి ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక ఇంధన వనరులపై దృష్టి పెడుతున్నారు. జల, సోలార్, విండ్ విద్యుదుత్పత్తికి ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సాహకాలు ఇవ్వాలని భావిస్తున్నారు.

సోలార్ వల్ల ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పీక్ అవర్ డిమాండ్‌ను తట్టుకోవచ్చని భావిస్తున్నారు. దీనికోసం మహిళా స్వయం సహాయక బృందాలకు సోలార్ ప్లాంట్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని స్వయంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మిస్తామని చెప్పిన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఒక మెగావాట్ ఉత్పత్తికి రూ.6 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేస్తే, ఇప్పటికి ఆ అంచనా వ్యయం రూ. 10 కోట్లకు చేరింది. దీనితో ఈ కరెంటు కూడా రాష్ట్ర డిస్కంలకు భారంగా మారనుంది. రాబోయే ఏడేండ్లలో (2032 నాటికి) అవసరమయ్యే భవిష్యత్తు విద్యుత్ అంచనాలతో కొత్త పాలసీ రూపకల్పన కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ఠంగా 15,623 మెగావాట్ల విద్యుత్ పీక్ లోడ్ డిమాండ్ ఉంది. 2031-32 నాటికి 27,059 మెగావాట్ల వరకు పీక్ డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో జల విద్యుదుత్పత్తికి అపారమైన అవకాశాలున్నాయనీ, ప్రభుత్వమే అక్కడ పెట్టుబడులు పెట్టి భారీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలు చేస్తున్నారు. దీనిపై ఇటీవలే ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఢిల్లీలో హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్‌తో సంప్రదింపులు కూడా జరిపినట్టు సమాచారం. ప్రభుత్వం తెచ్చే కొత్త విద్యుత్ విధాన ముసాయిదా బిల్లుపై వివిధ రంగాల నిపుణులు, ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు, సలహాలు సూచనలు స్వీకరించాలని, దీనికోసం వివిధ ప్రాంతాల్లో బహిరంగ విచారణలు కూడా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కొత్త విద్యుత్ విధాన ముసాయిదా బిల్లును అసెంబ్లీలో పెట్టే అవకాశాలు ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

తెలంగాణలో ఎంపీ స్థానాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జుల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన ఆ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోని లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఉత్తర్వులు జారీ చేశారు.



ఖమ్మం ఇన్‌చార్జిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నల్గొండ	- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
కరీంనగర్	- పొన్నం ప్రభాకర్
పెద్దపల్లి	- శ్రీధర్‌బాబు
వరంగల్	- ప్రకాశ్‌రెడ్డి
మహబూబాబాద్	- తుమ్మల నాగేశ్వరరావు
హైదరాబాద్	- ఒబేదుల్లా కొత్వాల్
సికింద్రాబాద్	- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
భువనగిరి	- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
నాగర్‌కర్నూల్	- జూపల్లి కృష్ణారావు
చేవెళ్ల	- నరేందర్‌రెడ్డి
మల్కాజిగిరి	- మైనంపల్లి హన్మంతరావు
మెదక్	- కొండా సురేఖ
నిజామాబాద్	- సుదర్శన్‌రెడ్డి
ఆదిలాబాద్	- సీతక్క
జహీరాబాద్	- దామోదర రాజనర్సింహ

ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి కోసం రాజీలేని పోరాటం

- 'ఎస్టీయూ' చేసిన ఉద్యమాలే సాక్ష్యం : మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి కోసం రాజీలేని పోరాటం చేస్తున్న సంఘం ఎస్టీయూ అని మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి అన్నారు. 77 ఏండ్లుగా గుర్తింపు కలిగిన ఉపాధ్యాయ ఉద్యమ ప్రస్థానంలో సేవలందిస్తున్నదని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని కాచిగూడలో ఉన్న ఎస్టీయూ భవన్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రస్థాయి కార్యకర్తల శిక్షణాశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ మెరుగైన పీఆర్సీ, పెన్షన్, గ్రాట్యూటీ, నోషనల్ ఇంక్రిమెంట్లు వంటి అనేక సౌకర్యాలను సాధించిన ఘనత ఎస్టీయూకు దక్కుతుందన్నారు. అనంతరం సంఘాలు, ఉద్యమాలు ఆవశ్యకత అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే ఏకైక మార్గమని అన్నారు. బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను విద్యాసంవత్సరం చివరి రోజున విడుదలకు ఉత్తర్వులివ్వాలని కోరారు. పదోన్నతులు, టెట్ ఉత్తీర్ణతపై ఉపాధ్యాయుల్లో సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతులకు అవాంతరాలను తొలగించాలని కోరారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేసి, మెరుగైన పీఆర్సీని ప్రకటించాలని సూచించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా విద్యావాలంటీర్లను, సర్వీసు పర్సన్లను నియమించాలనీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర పూర్వ బాధ్యులు సి రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆవంచ సుధాకర్, రాష్ట్ర పూర్వ బాధ్యులు పున్న గణేష్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, గజేందర్, శ్రీధర్‌రావు, శీతల్ చౌహాన్‌తోపాటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కవ్వం లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఎన్‌హెచ్‌ఎం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కవ్వం లక్ష్మారెడ్డి సీఎం రేవంత్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్ హెచ్ ఎం లో 20 సంవత్సరాల నుంచి వైద్య రంగంలో అన్ని రకాల సేవలు అందిస్తున్నామని, గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుందని మాట ఇచ్చి తప్పారనిఈ ప్రభుత్వంలోనైన మా సేవలను గుర్తించి మమ్మల్ని క్రమబద్ధీకరించాలని కోరడం జరిగిందన్నారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలన్నీ మా దృష్టిలో ఉన్నాయిని త్వరలోనే పరిష్కారం ఆలోచిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏఎన్‌ఎంలు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఆర్థిక నేరాలకు పాల్పడ్డ మోడీ, అమిత్ షా

- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రధాని మోడీ, అమిత్ షాలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని అత్యున్నత న్యాయస్థానం కల్పించుకొని ఎస్‌బిఐ బ్యాంకును ఆదేశించడం అంటే బ్యాంకు ఆర్థిక వ్యవహారాలు ఎంత మొత్తం చేశాయో తెలుస్తుందన్నారు. దీని ద్వారా భారతదేశంలో లంచగొండితనం ఏ మేరకు భారతీయ జనతా పార్టీ పెంచి పోషించిందో తెలుస్తుందని తెలిపారు. ఒక్క బీజేపీ పార్టీకే రూ. 1128 కోట్ల విలువ చేసే బాండ్లను ఇచ్చినట్లుగా కొంత సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం అందరికీ తెలిసిన విషయమే న్నారు. మెగా కంపెనీకి చెందిన వారు తెలంగాణ రాష్ట్రంలో ప్రజాధనాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేశారో ఆలోచించాలని కోరారు. బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.



3 నుంచి 'పది' మూల్యాంకనం

- సెయింట్ మార్క్స్, ప్రోగెసివ్ స్కూల్‌లో ఏర్పాట్లు
- జిల్లాకు చేరిన 3.62లక్షల జవాబుపత్రాలు
- 'స్పాట్' విధుల్లో 1733 మంది ఉపాధ్యాయులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు విజయవంతంగా పూర్తికావడంతో ఇప్పుడు అధికారులు మూల్యాంకనంపై దృష్టిపెట్టారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో డీఈవోతో సహా జిల్లా, మండల విద్యాధికారులంతా నిమగ్నమయ్యారు. దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తికావొచ్చాయి. బుధవారం(3న) నుంచి పదో తరగతి వార్షిక పరీక్ష పత్రాల మ్యూలాంకనం చేపట్టనున్నారు. ఫలక్‌నుమాలోని సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ ప్రైమరీ స్కూల్లో(మేజర్ క్యాంపు), బహదూర్‌పూరలోని ప్రోగెసివ్ ఉన్నత పాఠశాలలో (మైనర్ క్యాంపు) ఈనెల 11వ తేదీ వరకు స్పాట్ వ్యాలూవేషన్ జరగనుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సంబంధించి 3లక్షల 62వేల 640 జవాబుపత్రాలు జిల్లాకు వచ్చాయి. ఇప్పటికే అధికారులు వాటికి సంబంధించిన కోడింగ్ ప్రక్రియ చేపట్టారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసేందుకు ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. సకాలంలో వాల్యూయేషన్ పూర్తయ్యేలా గతంలో కంటే ఈసారి అదనంగా ఉపాధ్యాయులను నియమించినట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

1733 మంది ఉపాధ్యాయుల కేటాయింపు

జిల్లావ్యాప్తంగా టెన్త్ వార్షిక పరీక్షలు ఎలాంటి మాస్‌కాపీయింగ్, ప్రశ్నపత్రాలు లీక్ వంటి సంఘటనలు జరగకుండా శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ క్రమంలో టెన్త్ స్పాట్ వ్యాలూయేషన్ ప్రక్రియ కూడా ఏ ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే మూల్యాంకనం కోసం ఉపాధ్యాయులకు విధులు కేటాయిస్తూ డీఈవో రోహిణీ ఆదేశాలు జారీ చేశారు. స్పాట్ వాల్యూవేషన్ కోసం మొత్తం 1,733 మందికి విధులు కేటాయించారు. ఇందులో మేజర్ క్యాంపునకు సంబంధించి చీఫ్ ఎగ్జామినర్లు 137, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 804, స్పెషల్ అసిస్టెంట్లు 274 మంది ఉంటారు. ఇక మైనర్ క్యాంపులో చీఫ్ ఎగ్జామినర్లు 53, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 343, స్పెషల్ అసిస్టెంట్లు 106 మంది ఉండగా.. రెండింటికి కలిపి 16మందిని ఏసీవోలుగా నియమించారు. క్యాంప్ అధికారిగా డీఈవో, డిప్యూటీ క్యాంపు అధికారులుగా విద్యాశాఖ ఏడీ, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వ్యవహరిస్తారు. సాంఘిక శాస్త్రం మినహా మిగతా పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాలు మూల్యాంకన కేంద్రానికి చేరుకున్నాయి.

అవసరమైన ఏర్పాట్లలో అధికారులు

గ్రేటర్‌లో ఎండలు మండిపోతున్నాయి. ముఖ్యంగా నగర పరిధిలో రోజురోజుకి ఉష్ణోగ్రతలు భారీగా నమోదువుతున్నాయి. ఈ నేపథ్యంలో స్పాట్ వాల్యూవేషన్ సెంటర్‌లో ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మేజర్, మైనర్ సెంటర్‌లో గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో మూల్యాంకనం జరుగనుంది. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఫ్యాన్లు, కూలర్లు, చల్లని తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే స్పాట్ వాల్యూవేషన్ కేంద్రాల వద్ద విద్యాశాఖ అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మూల్యాంకన కేంద్రాలైన సెయింట్ మార్క్స్, ప్రోగెసివ్ స్కూల్ వద్ద గట్టి నిఘా పెట్టారు. టెన్త్ జవాబు పత్రాల వాల్యూవేషన్ సందర్భంగా సెంటర్ సమీపంలోకి ఎవరినీ అనుమతించకుండా చర్యలు తీసుకొనున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంప్ ఉంటుందని, ఒక్కో ఉపాధ్యాయుడికి రోజుకు 40 జవాబుపత్రాలు కేటాయిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే స్పాట్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదని, ఆదివారాల్లోనూ కొనసాగుతుందని అధికారులు చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో మూల్యాంకన ప్రక్రియ కొనసాగనుంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం : ఆర్.రోహిణి, డీఈవో, హైదరాబాద్



టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకనాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం. వివిధ జిల్లాల నుంచి జిల్లాకు 3.62లక్షల జవాబుపత్రాలు వచ్చాయి. వాటిని స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచాం. స్పాట్ వాల్యూవేషన్ కోసం అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు ఇలా మొత్తం 1733 మందిని నియమించాం. విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లో ఉందని గుర్తించుకుని ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా జవాబుపత్రాలను కచ్చితంగా మూల్యాకనం చేయాలి. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

సీమాంధ్ర కార్పొరేట్ వర్గాల ఆధిపత్యాన్ని నిర్మూలించాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణలోని అన్ని రంగాల్లో సీమాంధ్ర కార్పొరేట్ వర్గాల ఆధిపత్యాన్ని నిర్మూలించడమే తెలంగాణ పునర్నిర్మాణ లక్ష్యమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాలు ప్రత్యేక సంస్థానంగా ఉన్న తెలంగాణను సీమాంధ్రలో కలిపి ఆంధ్రప్రదేశ్ గా ఏర్పాటు చేసిన తరువాత సీమాంధ్ర కార్పొరేట్ వర్గాలు తెలంగాణలోని భూములను, వనరులను దోచుకోవడం జరిగిందన్నారు. ఈ ఆధిపత్యానికి వ్యతిరేకంగానే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగిందని ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటికి ఇంకా వారి ఆధిపత్యం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటికి కూడా ఇంకా సీమాంధ్ర కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం కొనసాగడం అత్యంత విచారకరమన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అసైండ్ భూములన్నిటికి పట్టాలు ఇచ్చి వారికి సర్వ హక్కులు కల్పించాలని, సీమాంధ్ర కార్పొరేట్ వర్గాలు ఆక్రమించిన ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకోవాలని, తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్రెడ్డి, కోలా జనార్ధన్, మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, జనిగ విష్ణువర్ధన్, నరేందర్ గౌడ్, కొంతం యాదిరెడ్డి, అనంతలక్ష్మి, మోకాటి రాంబాబు, ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలి

- మైత్రి విద్యానికేతన్ హై స్కూల్ కరస్పాండెడ్ మహేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలని మైత్రి విద్యానికేతన్ హై స్కూల్ కరస్పాండెడ్ మహేష్ అన్నారు. గొప్ప లక్ష్యం తోటి మా విద్యా సంస్థలను స్థాపించామని తెలిపారు. మైత్రి విద్యానికేతన్ హై స్కూల్ 24వ వార్షికోత్సవం బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో చిన్నారులు తమ ఆటపాటలతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మహేష్ మాట్లాడుతూ పేదలకు అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించాలంటే కేవలం మైత్రి విద్యాసంస్థలుతోని సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్క చిన్నారి చదువుతోపాటు ఆటపాటల్లో ప్రతిభ కనబరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సౌమ్య ఉపాధ్యాయులు రాణి ,వరలక్ష్మి, అమీర్, రాజేశ్వరి, సుప్రియ, శ్రీకాంత్, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి ,చంద్రశేఖర్, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పాఠశాల నుంచే ప్రారంభం



- శ్రీ సాయిరాం హైస్కూల్ చైర్మెన్ నరసింహ

నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పాఠశాల నుంచే ప్రారంభమవుతుందని శ్రీ సాయిరాం హై స్కూల్ చైర్మెన్ నరసింహ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని కావడిగూడ డివిజన్ బండ మైసమ్మ నగర్‌లోని శ్రీ సాయిరాం హై స్కూల్ పూర్వ విద్యార్థుల రజతోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి స్కూల్ చైర్మెన్ నర్సింహ, మాజీ ప్రిన్సిపల్ ప్రమీల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు పునాది పాఠశాలల నుంచే ప్రారంభమవుతుందని తెలిపారు. మా పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు డాక్టర్. ఎం.రమాదేవి బాసర ట్రిపుల్ ఐ.టిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, జీ.సునీత జూనియర్ అసిస్టెంట్‌గా, ఎం.ఊర్మిళ యశోద నర్సింగ్ కాలేజ్‌లో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలిగా బి.రమాదేవి టెక్ మహీంద్రాలో టెక్నికల్ లీడర్‌గా, యు.జీ.రమంజి నేయులు మెడికల్ ఫిగిసిస్ట్ గా, సి.హెచ్ అరుణ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ఇంఛార్జిగా, జీ. బంగారి ఆక్యుపెంచర్ డైరెక్టర్ మరికొందరు విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. 25 సంవత్సరాల తరువాత మళ్లీ మేము అందరం కలవడం ఆనందకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురువులు గౌస్సుద్దిన్, శ్రీనివాస్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలేరును కాంగ్రెస్‌లోకి వస్తే స్వాగతిస్తాం



- టీపీసీసీ కార్యదర్శి లక్ పతి యాదగిరిగౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట:

అంబర్‌పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కాంగ్రెస్ లోకి వస్తే స్వాగతిస్తామని టీపీసీసీ కార్యదర్శి లక్ పతి యాదగిరిగౌడ్. బీసీ సెల్ వైస్ చైర్మెన్ కట్టెల సుబాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హరినాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం పతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మునిగిపోతున్న నావ వంటిదని ఆ పార్టీకి రాష్ట్రంలో మనుగడ లేదని, అందు కోసమే నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కాలేరు వెంకటేస్ కాంగ్రెస్‌లోకి వస్తే తప్పేమిటని వారన్నారు. కాంగ్రెస్ పార్టీ కాలేరు వెంకటేష్‌కు రాజకీయ జీవితం ఇచ్చిందని మాతృపార్టీలోకి ఆయన చేరితే మేము అండగా నిలుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అదిష్టానం కాలేరు వెంకటేశ్ పార్టీలో చేరికపై ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి పనిచేస్తామన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని అంబర్‌పేట నియోజకవర్గం కూడా అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుస్తుందని వారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం చిన్న ద్వారం మాత్రమే ఓపెన్ చేసిందని రేవంత్ రెడ్డి సారథ్యాన్ని అందరూ సమర్థిస్తూ పార్టీలోకి వస్తున్నారన్నారు. ఈ సమావేశంలో న్యాయవాది విశ్వం మున్నూరు కాపు సఘం నాయకుడు మధు, ఉద్యమకారుడు పండరి నాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్, శ్రీనివాసడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మాలలపై మాదిగ సంఘాలు చేస్తున్న విష ప్రచారం మానుకోవాలి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణలో మాలలపై ఎమ్మార్పీఎస్ మాదిగ సం ఘాలు చేస్తున్న విష ప్రచారం మానుకోవాలని మాల మహా నాడు జాతీయ అధ్యక్షులు, ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎల్.రాజు సూచించారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వి.ఎల్.రాజు మాట్లాడుతూ మాలల కన్నా మాదిగల జనాభా ఎక్కువంటూ అసత్య ప్రచారం చేస్తు న్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాల, మాల ఉప కులాలు మాల దాసరి, మాల నేతకానీ, మహర్, మాల బేగరి, మాల మార్టిటి, ఆది ఆంధ్ర మాల తదితర పేర్లుతో ఎస్సీ జాబితాలో సుమారు 23 మాల ఉప కులాలు ఉన్నాయన్నారు. జనాభా రీత్యా మాదిగల కన్నా మాల కులాలే తెలంగాణలో అత్యధిక జనాభాగా ఉన్నారని గుర్తు చేశారు.వాస్తవానికి మాలల కన్నా మాదిగలే తెలంగాణలో విద్యా, ఉద్యోగ, వ్యాపార, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, సామాజిక, జీవన రంగాల్లో ముందు ఉన్నారని, మాలలపై విష ప్రచారం చేస్తూ యావత్తు సమాజానికి అసత్య ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి దోపిడీ కుల మనువాద పార్టీలు వర్గీకరణకు మద్దతుగా నిలిచి మాలలకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారన్నారు. తెలంగాణ ఎంపీ ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న రాజకీయ పార్టీలను ఓడించాలని సూచించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా బల మైన గళం వినిపిస్తూ దేశంలో దళితుల ఐక్యత కోసం బీఆర్.అంబేద్కర్ మార్గంలో సోషల్ జస్టిస్ సాధన కోసం పోరాటం చేస్తున్న దళిత బహుజన పార్టీ (డీబీపీ) అభ్యర్థులకు మాల మహానాడు మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జె.ఎస్.రావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ప్రశాంత్, కార్యనిర్వాహక అధ్యక్షులు నక్క దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో కూడిన భక్తితోనే భగవత్ సాక్షాత్కారం



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఋజువర్తన, దాన గుణం, నిబద్ధతతో జీవించే ప్రతి మనిషిలో దైవత్వం దాగి ఉంటుందని శ్రీ రామదూత స్వామి అన్నారు. అనవసరమైన కోరికలతో, స్వార్ధ చిం తనతో కుటుంబాలలో అశాంతి పెరిగిపోతున్నదని ఆయన పేర్కొ న్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబి షన్ గ్రౌండ్స్‌లో ఆధ్యాత్మిక, ధార్మిక సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రతం, వేణు దత్తాత్రేయ అభయ మాల ధారణ, దీక్షలు మున్నగు ప్రత్యేక పూజ లను భగవాన్ శ్రీ రామదూత స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అతిథిగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు సతీ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఈటెల రాజేందర్, దాసోజు శ్రావణ్, బూడిద బిక్షమయ్య గౌడ్, యంఎస్ఆర్ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్, పలువురు పారిశ్రామిక వేత్తలు, వైద్య నిపుణులు, విద్యాసంస్థల అధిపతులు, న్యాయ వాదులు ధార్మిక వేత్తలు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఈ కార్యక్ర మంలో పాలుపంచుకున్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నంత వరకు వేదమంత్రో చ్ఛరణలతో అక్కడి ప్రాంగణ మంతా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లినట్లుగా ఉంది. ఈ సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులను ఉద్దేశించి భగవాన్ రామదూత ప్రసంగించారు. మూడేళ్ళుగా హిమాలయాలలో అనేక బీజాక్షర మంత్రాలను ఉచ్చరిస్తూ నిర్వహించిన యజ్ఞ ఫలితాన్ని ప్రజలకు ధారపోస్తున్నట్లు తెలిపారు.ప్రతి మనిషి తాను జీవించి ఉన్నంత వరకు సాటివారికి సహాయపడటంలో ముం దుండాలన్నారు. అనేక బీజా క్షర మంత్రాలను రాగయుక్తంగా పాడుతూ , భక్తులకు సన్మార్గాన్ని బోధించారు.

ప్రజా ఏక్తా పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా తులసి గుప్తా



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

లోకసభ ఎన్నికల్లో ప్రజా ఏక్తా పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా తులసి గుప్తాను ప్రకటిస్తున్న ట్లు జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం గౌలిగూడలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... రానున్న రోజుల్లో మిగతా ఎంపీల స్థానాలకి అభ్యర్థులను ప్రకటి స్తామన్నారు. తమ పార్టీ యువత, మహిళలు, అన్ని వర్గాలకు అవకాశం కల్పిస్తుందన్నారు.

'హిందీ యాదవ్ మిషన్ యూట్యూబ్ ఛానల్ ప్రారంభం'



నవతెలంగాణ-అంబర్‌పేట

హిందీ యాదవ్ మిషన్ యూట్యూబ్ ఛాన లో ను ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి కృష్ణ యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్ కలిసి ఆదివారం నాచారంలోని ఏఎస్ ఆర్ గార్డెన్‌లో లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో ఛానల్ సీఈఓ కిరణ్ కుమార్ యాదవ్, టీ న్యూస్ రిపోర్టర్ రాజశేఖర్ యాదవ్, అంబర్‌పేట అఖిల భారత యాదవ సంఘం కన్వీనర్ జంగాల అనిల్ కుమార్ యాదవ్, సం ఘం నాయకులు జంగాల సునీల్ కుమార్ యాదవ్, మధు యాదవ్, రవి యాదవ్, ధనరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'కడియం'ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు

- తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ



నవతెలంగాణ-ముషీరాబాద్

కడియం శ్రీహరి నిజాయితీగల రాజకీయ నాయకుడని ఆయనను విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ అన్నారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మచ్చ లేని నిజాయితీ గల రాజకీయ నాయకుడు, ఎలాంటి అవినీతి, అరాచకాలు భూకబ్జాలు, దోపిడీలు, చేయలేదని ప్రజల ఆస్తులను గుంజుకోలేదని, నిజాయి తీకి మారు పేరు కడియం శ్రీహరి అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కెసిఆర్ కుటుంబం ఈ రాష్ట్రాన్ని దోచుకుని దాచుకున్నారని వారి దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. కడియం శ్రీహరి నీ విమర్శించే నాయకులకు సిగ్గు ఉండాలని మీరు కేసీఆర్ కుటుంబానికి గులాం గిరి, చెంచాగిరి చేస్తూ, భజన చేస్తున్న మీరా కడియం శ్రీహరిని విమర్శించేది. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే మీరు చేసిన దోపిడీలు, భూకబ్జాలు బయటపడతాయని, దొంగే దొంగ, దొంగ అన్నట్టు కడిగిన ముత్యం లాంటి మా కడియం శ్రీహరినీ విమర్శిస్తే ఉరుకోమన్నారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం, కావ్యను భారీ మెజార్టీతో గెలిపించు కుంటామని తెలిపారు.

క్లిష్టమైన చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు చికిత్సపై అవగాహన

- ప్రభుత్వ ఈఎన్‌టి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

క్లిష్టమైన చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు చికిత్సపై నిర్వహించిన అవగాహన సదస్సు యువ వైద్యులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కోఠి ప్రభుత్వ ఈఎన్‌టి(చెవి,ముక్కు, గొంతు) ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అన్నారు. ఆదివారం చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై ప్రభుత్వ ఈఎన్‌టి, ఫొరెన్ సిక్, అనాటమీ ఉస్మానియా మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఈఎన్‌టి ఆసుపత్రిలో వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చెవి ఎముక శస్త్రచికిత్స ద్వారా పక్క నుండి మెదడు, శిరస్సు కింది భాగంలో వ్యాధుల, గడ్డల శస్త్రచికిత్సకి సంబంధించి శిక్షణను యువ వైద్యులకు సదస్సు ద్వారా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ రెండు రోజులు నిర్వహించారు. ఈ సదస్సులో బెంగళూరుకు చెందిన నిపుణులు డాక్టర్ సంపత్ చంద్ర ప్రసాద రావు ఆధునాతన పద్ధతులను ప్రదర్శించారు. దాదాపు 150 మంది శస్త్రచికిత్స నిపుణులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అత్యంత క్లిష్టమైన వ్యాధులను సమర్థవంతంగా నిర్మూలించడానికి ఈ పద్ధతులు ఉపయోగపడే అవకాశం ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, డాక్టర్ ఆనంద్ ఆచార్య, డాక్టర్ ఎల్. సుదర్శన్ రెడ్డి, డాక్టర్ కరుణ, డాక్టర్ షావుల్ హమీద్, డాక్టర్ సత్య కిరణ్ ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర కుమార్, ఫోరెన్ సిక్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ టకిఉద్దీన్, డాక్టర్ అభిజిత్, అనాటమీ నిపుణులు డాక్టర్. సుమలత తదితరులు పాల్గొన్నారు.

'కాలేరు' కాంగ్రెస్‌లో చేరాలంటే ఎమ్మెల్యే పదవీకు రాజీనామా చేయాలి

- అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-అంబర్‌పేట:

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కాంగ్రెస్‌లో చేరడానికి చేస్తున్న ప్రయత్నాన్ని అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరాలనుకుంటే ముందుగా దమ్ముంటే కాలేరు తన ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేసి పార్టీలో చేరాలని సవాలు విసిరారు. పార్టీ మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, దిడ్డి రాంబాబు, పులి జగన్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, యాసీన్ షరీఫ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ నుండి కార్పొరేటర్ గా గెలిచి బీఆర్ఎస్ లోకి వెళ్లి పార్టీకి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కాలేరు వెంకటేశ్ అన్నారు. అలాంటి వ్యక్తిని తిరిగి పార్టీలోకి తీసుకోకూడదని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా ఎలాంటి కేసులు లేని వ్యక్తులను మాత్రమే పార్టీలోకి తీసుకుంటామన్న పార్టీ నిర్ణయంపై పెద్దలు దృష్టి సారించాలనీ కోరారు. ఎమ్మెల్యే కాలేరు చాలా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, అతనిపై చాలా ఆరోపణలు ఉన్నాయని అలాంటి వ్యక్తిని పార్టీలోకి తీసుకోకూడదనీ తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పెద్దలు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా, యువజన, మైనార్టీ, ఎస్సీ సెల్, బీసీ సెల్ ,ఎస్టీ సెల్ తదితర అన్ని విభాగాల నాయకులు కాలేరు వెంకటేష్ కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో కూడా కాలేరు వెంకటేష్ కు సంబంధాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని చెప్పారు. అధికారమే పరమావధిగా ధనార్జన లక్ష్యంగా పనిచేసే ఏకైక వ్యక్తి కాలేరు వెంకటేష్ అన్నారు. ఆయన ఒక అవకాశవాది అని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గం లో అతని ప్రధాన అనుచరులు డ్రగ్స్, గంజాయి సరఫరాలో ఉన్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీల తో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ద్వారా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మరింత పుంజుకుంటున్నదని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు జె. సత్తిబాబు, రామ్మోహన్ రావు, ఏ, బి బ్లాక్ అధ్యక్షులు రాజేశ్వర్ రావు, హరి తిలక్ సింగ్, పంజాల వెంకటేష్ గౌడ్, తొలుపునూరి కృష్ణ గౌడ్, డివిజన్ అధ్యక్షులు జి. శ్రీధర్ గౌడ్, రవికుమార్, ఫరీద్, జి, లక్ష్మణ్, నాయకులు ఏ, దిలీప్, ముంతాజ్, శ్యామ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా
ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈసీఐఎల్ ఫస్ట్ సీఎస్ఐ క్రాస్ చర్చిలో పాస్టర్ రాహుల్ పాల్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఈస్టర్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఏసుక్రీస్తు పునరుజ్జీవనానికి గుర్తు అని పేర్కొన్నారు. మరణంపై ఏసు సాధించిన విజయానికి ప్రతీకగా ఈస్టర్ డే నిర్వహిస్తారని తెలిపారు. ఏసయ్య దీవెనలు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలి



నవతెలంగాణ-జవహర్‌నగర్
ఎండాకాలంలో ప్రజలకు తాగు నీటి సరఫ రాకు అంతరాయం కలగ కుండా చూడాలని జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ ఎల్.తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణం లోని దేవేందర్ నగర్, సాయి గణేష్ కాలనీ, జయశంకర్ కాలనీ, ప్రగతి నగర్, గాంధీనగర్, నందమూరి నగర్, బీజేఆర్ నగర్‌లో బోర్లు పని చేస్తున్నాయా? లేదా అని అధికారులతో కలిసి పరిశీలించారు. తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పాడైన బోర్లకు మరమ్మత్తులు చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఈ మాధవచారి, ఏఈ రాజ శేఖర్, ఇంజినీరింగ్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పల్‌లో జోరుగా కాంగ్రెస్ ప్రచారం



నవతెలంగాణ-కాప్రా
పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి ఆదివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని నేతాజీ నగర్ పార్కులో ప్రచారం చేశారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే మల్కాజిగిరి పార్లమెంటు నుంచి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని పరమేశ్వర్‌రెడ్డి కోరారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో సునీతామహేందర్ రెడ్డిని కూడా ఇదే తరహాలో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాఘువ రెడ్డి, అంజిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రసాద్, పెద్ది శ్రీను, పెద్ది నాగరాజ్, పాకాల రాజు, ప్రవీణ్, అనీల్, వెంకటేష్ లింగం,శివ, పాల్గొన్నారు.

అయ్యప్ప జయంతిలో పాల్గొన్న బండారి



నవతెలంగాణ-కాప్రా
అయ్యప్ప స్వామి ఐక్యవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ హెూమిజే బాబా కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన అయ్యప్ప జయంతి వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా జగద్గురువు విద్యా శంకర భారతీస్వామి వారి ఆశీస్సులను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, రాజు, మల్క రమాదేవి పాల్గొన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా
కాప్రా డివిజన్ పరిధిలోని సిల్వర్ క్రిస్ట్ జనప్రియాలో కాలనీ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసుకున్న సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి శుభాకంక్షాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ రజిత, విపణి జనరల్ సెక్రటరి, సీమ రెహ్మాన్, సత్యవతి, శ్రీదేవి, శుక్ల, ఉషారాణి, లక్ష్మి తదితరులున్నారు.

ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్



నవతెలంగాణ-కాప్రా
ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని గోస్పెల్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్స్‌కు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా
కాప్రా డివిజన్ పరిధిలోని కమలానగర్ సీఐటీయూ కార్యాలయంలో పీపుల్స్ వేల్ఫేర్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావు నగర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సన్‌సీడ్ ఆస్పత్రి ఎండీ డా.అన్వేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్, పీపుల్స్ వేల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద, మధ్య తరగతి ప్రజలకు అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ శిబిరంలో డాక్టర్ లక్ష్మీనరసింహ దంతపరీక్షలు నిర్వహించారు. సన్‌సీడ్ ఆస్పత్రి డాక్టర్లు జనరల్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 150మందికి వివిధ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మెన్ సీహెచ్ వరప్రసాద్, కార్యదర్శి ఉదయభాస్కర్, కోశాధికారి చందనరాజు, జీవిరావు, దేవిరెడ్డి, చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కే.విజయకుమార్, శ్రీదేవితో పాటు సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ-సిటీబ్యూరో
రాష్ట్రంలోని ప్రతి పౌరుడికీ నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రామోదర రాజనర్సింహ అన్నారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని రోడ్డు నెంబర్‌లో4లో వైద్య సేవలంది స్తున్న పల్స్ హార్ట్ హాస్పిటల్స్, ఆదివారం తన రెండో శాఖను మియాపూర్‌లో ఏర్పాటు చేశారు. ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. దిగువ, మధ్యతరగతి జనాభా ఆరోగ్య స్థితిని మెరుగుపర్చడానికి చిన్న, మధ్య తరహా హాస్పిటల్స్‌ను ప్రోత్సహించడంలో ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు వైద్య నిపుణులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

ఎమ్మెల్యే 'మాధవరం' అభినందనలు

పల్స్ హార్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న పల్స్ హార్ట్ సెంటర్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందించారు. ఈ స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో తాను భాగమైన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోనూ వేగవంతమైన, నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ఆరోగ్య సంర క్షణ వికేంద్రీకరణ అవసరమనినొక్కి చెప్పారు.

హాస్పిటల్ సౌకర్యాలు ఇలా..

నూతనంగా ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్స్‌లో 100 పడకల సదుపాయంతో అత్యాధునిక కార్డియాక్ క్యాథ్‌లాబ్, అధునాతన ఆపరేషన్ థియేటర్‌లు ఏర్పాటు చేశారు. ఉన్నతమైన క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్, జాయింట్ రీప్లేస్‌మెంట్, పల్మోనాలజీ, యూరాలజీ, గైనకాలజీ, డెర్మటాలజీ, స్పైన్ సర్జరీ, గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాలతోపాటు, క్యాటర్నరీ కార్డియాక్ కేర్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ హాస్పిటల్ "ఆత్మీయతతో గుండె వైద్యం" (కరుణ, ప్రేమతో హృదయ సంరక్షణ), "ఆత్మీయతతో కూడిన నాణ్యమైన వైద్యం" (కరుణ, ప్రేమతో మంచి చికిత్స) అనే నినాదంతో ముందుకు సాగుతుంది. ఈ కార్యక్రమంలో ఆర్థిక, ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మల్టీజోన్ -1, ఐజీ పోలీస్ ఎ.వి. రంగనాథ్, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్. విఠల్, భారతీయ చలనచిత్ర దర్శకుడు బి.సుకుమార్ విశిష్ట అతిథులుగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన వినోద్ కుమార్



నవతెలంగాణ-ఘట్కేసర్
తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఘట్కేసర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశపావుల వినోద్ కుమార్ ఆదివారం కలిశారు. సీఎంను నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేఆర్ కాలనీలో 96వ వారం జ్ఞానమాల



నవతెలంగాణ-కాప్రా
జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా జ్ఞానమాల టీం సభ్యులు ఆదివారం మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు 96 వ వారం పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం అర్గనైజర్ తాదూరి గగన్ కుమార్, సభ్యులు నర్సింహ్మ చారి ,నరేందర్ రావు, రవి నాయక్, శ్రీశైలం, నాగేష్, జాషువా రాములు, నరేందర్ పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్
నేడు (సోమవారం) శ్రీముత్యాలమ్మ ఆలయంలో మండల పూజ నిర్వహించను న్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ వెంకటేష్, ఆలయ వైస్ చైర్మెన్ మీనాక్షి, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు.భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు.

సీ-విజిల్ డౌన్‌లోడ్ చేసుకోండి

- అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేయండి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో
బాధ్యతగల పౌరులుగా ఎన్నికల్లో అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలనుకుంటే సీ-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన సీ-విజిల్‌ను మొబైల్ లోయాప్‌లో గూగుల్ పే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, మొబైల్ నందు నెంబర్ ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకుంటే తదుపరి ఓటీపీ వస్తుందనీ, దాన్ని నమోదు చేస్తే సి-విజిల్ యాప్ సిద్ధమైనట్టే అని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చ అని తెలిపారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైన అయినా ఫిర్యాదు చేయొచ్చన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా డబ్బు పంపకాలు, ఉచితాలు, ఓటర్లను ప్రలోభ పెట్టినా, మద్యం సరఫరా చేసినా, భయభ్రాంతులకు గురి చేసినా, లెక్కకు మించిన ఖర్చు చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా ఫోటోలు తీసి, వీడియోలు, ఆడియో రికార్డ్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఎక్కడైతే ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిందో దానికి సంబంధించిన ఫోటో లేదా వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. 100 నిమిషాల్లోపే ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లోపు జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో గల మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందనీ, తదుపరి ఐదు నిమిషాల్లోపు క్షేత్ర పరిశీలన అధికారి ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందం విచారణ నిమిత్తం వస్తుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం 15 నిమిషాల్లో ఫిర్యాదులో తెలిపిన స్థలానికి చేరుకుని విచారణ చేసి 30 నిమిషాల్లో వివరాలు సేకరించి నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేస్తారని తెలిపారు. రిటర్నింగ్ అధికారి 50 నిమిషాల్లో నివేదికను పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్టు నిర్ధారణ అయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో 24 గంటలు సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను, సెల్ నెంబర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సీ-విజిల్‌లో ఫిర్యాదు చేసే వ్యక్తులు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయాలన్నారు. తీరా ఆ ప్రదేశానికి చేరుకునేలోపు ఆధారాలు లేకుండా ఉంటే సమయం వృథా అవుతుందన్నారు. ఆధారాలు, పక్కా రుజువులతో ఉన్నప్పుడే ఫిర్యాదులు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సీ-విజిల్ యాప్ ద్వారా 13 కేసులను పరిష్కరించినట్టు తెలిపారు..

కాంగ్రెస్‌లోకి రావాలని కీసర ఎంపీపీకి ఆహ్వానం



- ఎంపీపీ నివాసానికి వెళ్లిన వజ్రేష్‌యాదవ్, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్

నవతెలంగాణ-కీసర
కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ దంపతులను కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ లు కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఆదివారం చీర్యాల గ్రామంలోని వారి నివాసానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లి అల్పాహారం చేశారు. కాంగ్రెస్ బలోపేతానికి మీలాంటి నాయకులు పార్టీలో చేరాలని కోరారు. దీంతో కీసర ఎంపీపీ దంపతులు కాంగ్రెస్‌లో చేరుతామని హామీ నిచ్చారు. అనంతరం వజ్రేష్ యాదవ్, సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్‌లు మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలన్నారు. మండల నాయకత్వం గ్రామాల్లో కాంగ్రెస్ పటిష్టతకు పని చేసే నాయకులను గుర్తించి గ్రామ కమిటీల్లోకి తీసుకో వాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీన మేడ్చల్ నియోజకవర్గం లోని వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు ఉంటా యన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి భూ కబ్జాలను వెలికి తీసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అవినీతి చేసిన వారిని పార్టీలోకి చేర్చుకోవద్దని సూచించారు. పార్టీలో కొత్త, పాత అనే భేదం లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు కోలా కృష్ణ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి ,మండల యూత్ అధ్యక్షుడు శివరాం రెడ్డి, ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, కవిత, జయరాం , వేణు , శ్రీనివాస్ రెడ్డి ,ఉమాపతి శర్మ, పర్వత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ఫలితాల్లో క్రాంతికిన్ విద్యార్థుల సత్తా

- 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- అభినందించిన ప్రిన్సిపాల్ కల్యాణి

నవతెలంగాణ-జవహర్‌నగర్
పోటీ పరీక్షల్లో సత్తా చాటడానికి నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు క్రమ శిక్షణ అవసరమని క్రాంతికిన్ అకాడమీ ప్రిన్సి పాల్ కల్యాణి అన్నారు. దేశవ్యాప్తంగా 649 జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6, 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో క్రాంతికిన్ అకాడమీ దమ్మాయిగూడ విద్యార్థులు 36 మంది ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కల్యాణి మాట్లాడు తూ.. 25 ఏండ్లుగా ఎంతో మంది విద్యార్థులు కోచింగ్ తీసుకుని ఉన్నత స్థానాల్లో నిలిచారని, ఐఐటీ, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సీటు సాధించిన విద్యార్థులను అభినందించారు.



ఐఏఎస్ సాధించడమే లక్ష్యం :

కాంతికిన్ అకాడమీ టాపర్ ఆకుల వర్షిత

ఐఏఎస్ సాధించడమే లక్ష్యంగా ముందు కు వెళ్తానని క్రాంతికిన్ అకాడమీ నవోదయ ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన ఆకుల వర్షిత అన్నారు. ఆదివారం విడుదలైన జవహర్ నవోదయ విద్యాలయ 2024 ప్రవేశ పరీక్షలో ఆకుల వర్షిత సీటు సాధించి అకాడమీలో టాపర్‌గా నిలిచింది. దీంతో వర్షిత తల్లిదండ్రులు ఆకుల నర్సయ్య, తల్లి మహేశ్వరీ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంబురా లు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉద్యోగం సాధించి పేదలకు మెరుగైన పాలనను అందించడానికి కృషి చేస్తానని వర్షిత దీమా వ్యక్తం చేశారు. అంతకుముందు వర్షితను ప్రిన్సిపాల్ కల్యాణి అభినందించారు.

మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్‌దే గెలుపు

- మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఆదివారం మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలాలి డివిజన్ పరిధిలోని సాయినాథాపురం ఆఫీసర్స్ కాలనీలో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి పట్నం సునీతామహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం లోక్‌సభ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ...గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దశల వారీగా అమలు చేస్తున్నారనిన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి చేతి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, సతీష్ కుమార్, వినోద్ యాదవ్, ఫారుక్, సలీమ్, శ్రీనివాస్, లోహిత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, బాబు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బటర్ మిల్క్ క్యాంపు ప్రారంభం

సాయినాథాపురం బస్‌స్టాప్ దగ్గర శ్రీజా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఉచిత బట్టర్ మిల్క్ క్యాంపు' ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు సూర్యమూర్తి, భారతి, జానకి, శ్రీకర్, రమా, శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం : కౌన్సిలర్

- గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-కీసర
వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని నాగారం మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీలోని ఏడో వార్డులో గుండు మధు గౌడ్ ఆధ్వర్యంలో ఆంజన్న టెంట్ నిర్వాకులు శివ, లక్ష్మణ్, వెంకట్ ధనంజయ్‌లు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కౌన్సిలర్ గూడూరు సబితాఆంజనేయులు గౌడ్ ప్రారంభించారు. చలివేంద్రంలో మజ్జిగ, వాటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కౌన్సిలర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలాలు పాషా, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస రావు, విజయభాస్కర్, వెంకన్న పాపానాయక్, రమణ, రమేష్, తదితరులున్నారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి : ఈటల రాజేందర్

- బీజేపీలో చేరిన నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర
బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి ఆధ్వ ర్యంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు 1000 మంది బీజేపీలో చేరారు. వారికి ఈటల రాజేందర్ పార్టీ కండు వా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. దేశం సుభిక్షంగా ఉండాలని భావించి బీజేపీలో చేరిన చంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మోడీ ఎన్నికల శంఖరావం మల్కాజిగిరిలోనే పూరించారని తెలిపారు. మల్కాజిగిరి ప్రజల అభిమానాన్ని చూసి మోడీ ముగ్ధుడైపోయారని చెప్పారు. ఇక్కడ గెలిస్తే 15 అసెంబ్లీ సీట్లు గెలిచినట్లేనని పేర్కొన్నారు. ఇక్కడ 70 శాతం మంది బయట నుంచి వచ్చి సెటిల్ అయిన వాళ్లే ఉన్నారని, వారందరూ ప్రపంచ జ్ఞానాన్ని అర్థం చేసుకున్నవాళ్లేనన్నారు. రేవంత్‌రెడ్డి ఈ సీటు నాది అంటున్నాడని, ఆయనకు మల్కాజిగిరిలో ఇల్లు, వాకిలి ఉందా అని ప్రశ్నించారు. నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ విధానాలుతోనే పార్టీలోకి వచ్చామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రాముఖ్యత ఇస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు వేణు, నాయకులు కొంపల్లి మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మునుగంటి సురేష్, శ్యాం సుందర్ ,రాజిరెడ్డి ,తిరుమల్ రెడ్డి ,బాలేష్ ,నాగరాజు ,రవీందర్ ,మహేందర్ ,మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కల్యాణం



నవతెలంగాణ-శామీర్‌పేట
తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భ్రమరాంభిక మల్లిఖార్జున స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కాగా మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ (జంగయ్య యాదవ్) తదితరులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శామీర్‌పేట మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, తూంకుంట మాజీ సర్పంచులు దయాసాగర్ యాదవ్, ఎద్దు నాగేష్ యాదవ్, తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మెన్ రామచంద్ర యాదవ్, రవీందర్‌గౌడ్, దేవేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, పరమేష్ యాదవ్, మోత్కుల మల్లేష్ యాదవ్, తూంకుంట మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు బొల్లబోయిన నాగమణి యాదవ్, కాంగ్రెస్ నాయకురాళ్లు చిరబోయిన రజినీ యాదవ్, మహిళలు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత హెల్త్ క్యాంప్



నవతెలంగాణ-జవహర్‌నగర్
కార్మిక మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమ బోర్డు సహకారంతో ఆదివారం బాలాజీనగర్, ముత్తుస్వామి కాలనీ కార్మిక భవన్ లో భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు వంద మందికి హెల్త్ చెకప్ చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు మస్తాన్‌బీ, ఇన్‌చార్జి ఎస్.కే.మీరా, ఏఐటీయూ జిల్లా నాయకులు యాదగిరి, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు మల్లేష్, హెల్త్ అర్గనైజర్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్ రెడ్డికి అభినందనలు తెలియజేసిన శిరీష



నవతెలంగాణ-కూకట్‌పల్లి

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న జి.రంజిత్ రెడ్డిని, ఆల్విన్ కాలని డివిజన్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు శిరీష సత్తూర్ కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం టీటీడీ సభ్యురాలు రంజిత్ రెడ్డి సతీమణి సీతా రెడ్డినీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్, మధు, సౌజన్య, గాయత్రి, రమేష్, చంద్రశేఖర్, అమరేంద్ర, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను కలిసి శుభకార్యాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ 6 వ ఫేస్‌లోని పీవీ నరసింహారావు పార్క్, అంబేద్కర్ పార్కులలో ప్రజలతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు పాల్గొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఆనాడు మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. సీసీ రోడ్డు, డ్రయినేజీ, పార్కులను ఎంతో సుందరంగా తీర్చిదిద్దుకున్నామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు నిదర్శనం కాంగ్రెస్ ప్రభుత్వం



- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుంది
- మాట ఇచ్చాం...చేసి చూపిస్తాం.. అభివృదే ప్రధాన లక్ష్యం
- శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆదివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ బస్తీ, పీజేఆర్ నగర్ ఫేస్.2 బస్తీలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆశీర్వాదం ఈసారి బలంగా ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీ సాధిస్తుందని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సిటీకి ఆనుకోని ఉన్నప్పటికి శేరిలింగంపల్లి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి నియోజకవర్గం లోని అన్ని డివిజన్‌ల్లోను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీ సీటు గెలిస్తే మరింత అభివృద్ధి చేసుకొనే అవకాశం ఉందని అందుకు కార్యకర్తలు సిపాయిల్లా పనిచేలాని కోరారు. అల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు మారెళ్ళ శ్రీనివాస్ రావు, రాజా, సత్యనారాయణ, ఓట్స్ రవి, రాజు, నాయుడు, నాయక్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కోసం ప్రోత్సాహం



నవతెలంగాణ-దుండిగల్

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు రెవిన్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఇప్పటికే కృషి చేస్తుందని, ప్రజలకు మరింత సేవలు అందించేందుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తే వారికి మరిన్ని ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించవచ్చని రెవిన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి.డి.పాల్వాయి నాగార్జున రెడ్డి తెలిపారు. ప్రగతి నగర్ ఎలీప్ ఇండస్ట్రీస్‌లోని రెవెన్యూ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రవీణ్ రెవిన్ ల్యాబ్ ప్రవీణ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పాల్వాయి నాగార్జున రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ..... 2018 సంవత్సరంలో కేవలం ఏడుగురితో ప్రారంభమైన రెవిన్ ల్యాబ్ పరిశోధన సంస్థ ప్రారంభించబడిన ల్యాబ్ ఇంతింతై దినదినాభివృద్ధి చెందుతుందని 2024 నాటికి 84మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ముందుకు కొనసాగుతుందని తెలిపారు, అదేవిధంగా ప్రభుత్వం ప్రజలు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చి ఆదరించాలని రెవిన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పాల్వాయి నాగార్జున రెడ్డి కోరారు. అంతర్జాతీయ సంస్థ (యూఎస్ఎఫ్‌డిఏ) జాతీయ సంస్థ (ఎన్ఏబిఎల్) రాష్ట్రస్థాయి సంస్థ (డీసీఏ) అనుమతితో డ్రగ్స్, ఆహారం, మెటల్స్ వాటర్ వంటి వాటిని పరిశోధనల ద్వారా నాణ్యమైన వాటిని గుర్తించి ప్రజలకు అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. రెవిన్ సంస్థకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని మరింత ఎక్కువమంది నిరుద్యోగులకి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చేయూతనివ్వాలని కోరారు. సంస్థ త్వరితగతిన అభివృద్ధి చెందడానికి ప్రధాన పాత్ర పోషించిన తమ సంస్థ ఉద్యోగులందరికి నాగార్జున రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రెవిన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు బి.శ్రీకాంత్ రెడ్డి ఈశ్వరరావు సైకం మనోహర్ రెడ్డి వెంకట్రాంరెడ్డి సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారీశక్తి సెలబ్రేటింగ్ ఉమెన్ హుడ్ వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

సికింద్రాబాద్ హరిహర కళా భవన్‌లో గీతాంజలి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన నారి శక్తి సెలబ్రేటింగ్ ఉమెన్ హుడ్‌లి వేడుకలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి,చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షించి వారిని అభినందించారు. అనంతరం మేయర్ స్కూల్ యాజమాన్యం వారు ఘనంగా సన్మానించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ముందుగా ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన వెస్ట్ మారేడ్ పల్లి ప్రిన్సిపల్, నారి సేన ఫౌండర్ వేద కుమారికి, బౌరంపేట్ ప్రిన్సిపల్ గాయత్రి బోర్ల గడ్డకి, గీతాంజలి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ వారికి అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని, నారి శక్తి గొప్పతనాన్ని వివరిస్తూ, విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేయర్ చేతుల మీదుగా గీతాంజలి ఉమెన్స్ కాలేజ్ డిజిటల్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నవారు, సమాజ సేవకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

గొందళి సమాజ్ సంఘం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి వినతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గొందళి సమాజ్ సంఘం అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమూల రేవంత్ రెడ్డికి గొందళి సమాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్‌నాథ్ దునిగే వినతి పత్రం అందజేశారు. ఆదివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో కలిసి శాలువతో, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏక్‌నాథ్ దనిగే మాట్లాడుతూ..గొందళి సమాజ్ సంఘం అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, ప్రత్యేక కార్పొరేషన్ తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గొందళి సమాజ్ సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, వెంకట యాదవ్, బస్సు రాము తదితరులు ఉన్నారు.

జగదీశ్వర్ గౌడ్ సమక్షంలో డీవీజీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ సమక్షంలో, ఆల్విన్ కాలని డివిజిన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి నుంచి పలువురు నాయకులకు, కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, మరేళ్ల శ్రీను, రాజు పాల్గొన్నారు. షౌకత్ అలీ మున్నా, యాదగిరి, పోశెట్టిగౌడ్, మోజెస్, ఎచ్.మహేష్, జనార్దన్, రవీందర్, విజయమ్మ, తదితరులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

కే.యం ప్రతాప్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామం, బీరప్ప నగర్‌లో, శ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో ఈనెల 15వ తేదీన జరిగే శ్రీ బీరప్ప, కామరాతి కళ్యాణ మహోత్సవానికి, ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు శ్రీ కె.యం. ప్రతాప్‌ని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కె.పి. విశాల్ గౌడ్‌ని రావాల్సిందిగా శ్రీ బీరప్ప స్వామి దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఎలీమ్. ఎమ్.బీ. చర్చి ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ వేడుకలు



నవతెలంగాణ-బాలానగర్

యేసుక్రీస్తు పునరుధన పురస్కరించుకొని ఈస్టర్ పండుగను బాలానగర్ లోని ఎలిమ్ ఎమ్.బి చర్చ్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున నుంచి వేడుకలు కనుల పండుగా ప్రారంభమయ్యాయి. ఈస్టర్‌ను పురస్కరించుకుని సూర్యోదయ ఆరాధన పాస్టర్ రేవ్. జీకే. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యప్రసంగీకులు చర్చ్ పాస్టర్ రేవ్. జీకే. ప్రసాద్ ప్రత్యేక ఈస్టర్ సందేశాన్ని అందించారు. మరణాన్ని జయించి తిరిగి సజీవుడైన దేవుడు, యుగయుగాలకు యేసయ్య సజీవుడై ఉంటాడన్నారు. క్రీస్తు సమాదిలోంచి లేచిన శుభవేళనే ఈస్టర్ పండుగగా జరుపుకుంటున్నామన్నారు. క్రీస్తు మనకోసం మరణించి తిరిగి లేచాడన్నారు. ఆయన శాంతి, ప్రేమ, క్షమాపణ, కరుణ గుణాలను అనుసరిస్తూ వాటిని పాటిస్తూ సమాజంలో క్రీస్తును పోలినడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చ్ చైర్మెన్ ఎంజే. పరంజ్యోతి, కార్యదర్శి సుదర్శనం, కోశధికారి సంజీవ్, ఇతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకు కాంగ్రెస్‌లో చేరాను

- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా
- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రాజకీయంగా ఎన్నో ఏండ్లుగా నన్ను ఆదరిస్తూ, కార్పొరేటర్‌గా ఆల్విన్ కాలనీ డివిజన్ నుంచి గెలిపించి ఆదరిస్తున్న నా డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, గత రెండు పర్యాయాలుగా తనను గెలిపించిన ఆల్విన్ కాలనీ ప్రజలకు ప్రతి నిత్యం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తూ. నేడు మీ అందరి ఆదరాభిమానాలతో ముందుకు వెళుతున్నాను తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజల నిర్ణయాన్ని శిరసా వహిస్తూ వారి అడుగుజాడల్లోనే నడుసున్న తాను, నేడు మారుతున్న రాజకీయ పరిణామాల వల్ల డివిజన్ యొక్క అభివృద్ధి కోసం, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల యొక్క కోరిక మేరకు, కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. ప్రతిక్షణం ప్రజల బాగోగుల కోసమే పని చేస్తానని.. వారి కష్టసుఖాల్లో ఎప్పుడూ పాలుపంచుకుంటూ ఉంటానని హామీ ఇచ్చారు. డివిజన్ ప్రజల ఆదరాభిమానాలు నాపై ఎల్లప్పుడూ ఇదే విధంగా ఉండాలని కార్పొరేటర్ కోరారు.

నిరుపేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలు



నవతెలంగాణ-దుండిగల్

పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్యాన్ని పంచాలనే లక్ష్యంతోనే సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మోకాళ్ల నొప్పులతో బాధపడే వారికి గుర్తించి వారికి ఉచితంగా మొకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలను గ్రాన్యూల్స్ ఇండియా సహకారంతో నిర్వహిస్తున్నట్లు కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సర్వేజన ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గండిమైసమ్మ మండలం పరిధిలోని చర్చి గాగిల్లాపూర్‌లో ఆదివారం ఉచిత మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌ను గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటితో కలిసి డాక్టర్ గురువారెడ్డి మొదట జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ సర్వేజన ఫౌండేషన్ అధ్వర్యంలో పేదవారికి ఉచితంగా వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో ప్రారంభించాం అని తెలిపారు. మొట్టమొదటి సారిగా మొబైల్ ఎక్స్‌రే వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి మొట్టమొదటి క్యాంప్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మోకాళ్ల నొప్పులతో బాధపడే నిరుపేలకు సంస్థ అధ్వర్యంలో ఉచితంగా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. రోజుకు ఒకరికి చొప్పున సంవత్సరానికి 365 అపరేషన్లు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇందుకోసం గ్రాన్యూల్స్ ఇండియా ముందుకు వచ్చి వారు సహకరించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి మాట్లాడుతూ గ్రాన్యూల్స్ ఇండియా అధ్వర్యంలో అపరేషన్లు చేయించుకోలేని నిరుపేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఉచిత కంటి శస్త్రచికిత్సలు, రాబోయే రోజుల్లో బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేయించే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గుండె సంబంధ సమస్యలతో బాధపడే చిన్న పిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్‌లో ఎక్స్‌రే, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులు క్యాంపుకు వచ్చిన వారిని పరీక్షించి మందులను అందజేశారు. మోకాళ్ల మార్పిడికి అర్హులైన వారిని ఎంపిక చేసి శస్త్రచికిత్సను నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ ఆదర్శ్ అన్నపరెడ్డి, డాక్టర్ కుశాల్ హిప్పాల్ గోవంకర్, డాక్టర్ దివాకర్‌రెడ్డి, సర్వేజన ఫౌండేషన్ వైస్ చైర్మెన్ రాము ఎలమంచలి, స్థానిక కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, గ్రాన్యూల్స్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లలను మార్షల్ ఆర్ట్స్ శిక్షణలో చేర్పించడం అభినందనీయం



- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

డ్రాగన్ కుంఫు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ ఉదయ్ ఆధ్వర్యంలో పాపిరెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీలో నిర్వహించిన బెల్ట్ టెస్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారికి మంచి క్రమశిక్షణతో పాటు శారీరక దృఢత్వాన్ని, ఆత్మరక్షణ కోసం పెంపొందించే విధంగా, విద్యార్థులను తీర్చిదిద్దుతున్నందుకు ఉదయ్‌ని అభినందించారు. శిక్షణ తీసుకుంటున్న విద్యార్థి, విద్యార్థినిల కోసం తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాపి రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయికుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గంగుల రాజిరెడ్డి, రామాలయ గుడి చైర్మెన్ శివకుమార్, వివేకానంద నగర్ డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు సాయి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సారస్వత పరిషత్తు బాలల కథా సంకలనాలకు ఎంపికైన కథలు..

నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల కథా సంకలనాలకు ఎంపిక చేసిన కథలు ప్రకటించింది. ఇటీవల పరిషత్తు పత్రికా ప్రకటన ద్వారా ఆహ్వానించిన మేరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా పలు ఇతర ప్రాంతాలకు చెందిన రచయితలు, రచయిత్రులు 317 కథలు పంపారు. అందులో ప్రముఖ రచయితలు, రచయిత్రులు రాసిన కథలు 256, బాలలకోసం బాలలు రాసిన కథలు 61 ఉన్నాయి. వాటిని న్యాయనిర్ణేతల సంఘం పరిశీలించి ప్రముఖ రచయితలు, రచయిత్రులు రాసిన 86 కథలు, బాలలకోసం బాలలు రాసిన 31 కథలు మొత్తం 117 కథలను ఎంపిక చేసింది. ఎంపికైన బాలల కథలను త్వరలో ప్రకటించడం జరుగుతుందని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ప్రముఖ రచయితలు, రచయిత్రుల కథలు.వసుంధర 'అమ్మదీవెన', నల్లవెల్లి మౌనిక 'ఏది ముఖ్యం', కె.వి. లక్ష్మణావు 'తాతయ్య నేర్పిన పాఠం', బి.వి.పట్నాయక్ 'గురుబ్రహ్మ', చెన్నూరి సుదర్శన్ 'పుట్టిన రోజు జేజేలు', కూచిమంచి నాగేంద్ర 'చదువేరా అన్నిటికి మూలం', ముర్తుజా షేక్ 'మంచి మిగిలే ఉంది', కోనే నాగ వెంకట ఆంజనేయులు 'మా అన్నయ్యకు లెక్కలు రావు', డా. కౌలూరి ప్రసాదరావు 'నాన్నమాట', ఏడుకొండలు కళ్లేపల్లి 'ఆశించని ప్రతిఫలం', ఎన్నవెల్లి రాజమౌళి 'ఎగిరేపిట్ట', జాదవ్ పుండలిక్రావు పాటిల్ 'కాంక్ష', కె.వి. సుమలత 'ప్రయత్నిస్తే ఫలితం', కన్నెగంటి అనసూయ 'నచ్చిన పని', పుల్లా రామాంజనేయులు ' బొమ్మ బాబోయ్', షేక్ అబ్దుల్ హకీం జానీ 'నాలుగు గుండిగలు', పైడిమర్రి రామకృష్ణ 'జమీందారు కోపం', డా. కె. చదువుల బాబు 'ఆభరణం' కాశీ విశ్వనాథం పట్రాయుడు 'పున్నమి', నందిరాజు పద్మలతా జయరాం కొత్త కలం', కాలిపు కూర్మావతారం 'నిజాయితీ', పాణ్యం దత్తశర్మ 'సృష్టిలో తీయనిది', వురిమళ్ల సునంద 'జేజమ్మ హారం', ముక్కామాల జానకీరామ్ 'బహుమానం', దాసరి చంద్రమోహన్ 'మార్పు', మొర్రి గోపి ' గంగిరెద్దు మేళం', వైరాగ్యం ప్రభాకర్' మారిన సోమరాజు', దినవహి సత్యవతి 'సత్యం శివం', పి.వి. శేషారత్నం 'విత్తు-చెట్టు', డా. హారిక చెరుకుపల్లి ' లైక్-కామెంట్-షేర్', డా.యం.సుగుణరావు 'ది రోబో', ఇ, రాంకిష్రావు' నన్ను క్షమించు నాన్నా!', ఎస్. నాగేంద్రనాథ్ రావు ' చిట్టి చేతులు', నందిరాజు కృష్ణకుమారి 'బతుకుపాఠం', ఉప్పలూరి మధుపత్ర శైలజ 'స్నేహబంధం', పి.ఎల్. మంగారత్నం ' చట్టం చుట్టమే', యస్. విజయలక్ష్మి 'ప్రేరణ', బి.గిరిబాబు 'మానవత', పసుమర్తి వెంకటరమణ 'బంధం', చాడా మునిశేఖర రెడ్డి 'మంచి పనులు', వి.వి.వి కామేశ్వరి 'ధృవతార', పతి సన్యాసేశ్వర మురళీధరశర్మ ' తెలియని విలువలు', ఎస్.ధర్మారావు 'అడ్డదారులు', వేముగంటి మేఘనాకీర్తి 'మాయ బొమ్మలు', కె. కౌండిన్య తిలక్ 'అమ్మా! నేను చదువుకుంటాను', యలమర్తి అనురాధ 'సంస్కారం', ఎల్ ప్రఫుల్లచంద్ర 'ఎవరు గొప్ప', దార్ల బుచ్చిబాబు 'ఉత్తమశిష్యుడు', ఆరుగొల్లి వరలక్ష్మీదేవి 'జీవితసత్యం', ఉండ్రాళ్ల రాజేశం 'బుడత', గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ కలసి ఉంటే కలదు సుఖం, దుర్గమ్ భైతి 'నిజాయితీ', చంద్రప్రతాప్ కంతేటి 'మాస్టారంటే', డా. అమ్మిన శ్రీనివాసరాజు 'అత్తా కోడల్లు', బెలగాం భీమేశ్వర రావు 'రక్షణకోటలు', ఆర్.సి. కృష్ణస్వామి రాజు 'బేరం', మొలకలపల్లి కోటేశ్వరరావు 'గురి', అనిశెట్టి సతీష్ కుమార్‌ఇది నీ ఇల్లే', మాచిరాజు కామేశ్వరరావు 'తరిమేకుక్క- తస్మాత్ జాగ్రత్త', జాని తక్కెడశిల 'తొర్రి', పుప్పాల కృష్ణమూర్తి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | ఏప్రిల్ 01, 2024 | www.navatelangana.com

సౌత్‌జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామరాజు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సౌత్ జోన్ అల్ జోన్స్ జన రల్ సెక్రటరీ కిషన్ శర్మ, సౌత్ జో న్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాజా మొ యిజ్, సౌత్‌జోన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ జైన్, సౌత్ ఈస్ట్ జోన్ ప్రెసిడెంట్ గాజిద్దీన్, నార్త్ జోన్ ప్రెసిడెంట్ ఉమేందర్, అనిసూర్ రెహ్మాన్, మునీర్ ఖాదీర్, 93 పీస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం సంజరీ ఫంక్షన్‌లో హాల్ జరిగిన మంత్లీ మీటింగ్‌లో జె.రామరాజు సేవలను గుర్తించి ఏకగ్రీవంగా సౌత్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా సౌత్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.ధర్మేందర్ రావు, వరకల సత్యనారాయణ, కాషామోని శ్యామ్ ముదిరాజ్ , సోమ విజయ్ కుమార్, యారాల మహేష్, యశోదమ్మ , ఫయాజ్, ఇతర సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



మహిళా మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆదివారం జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో తెలంగాణ మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మెన్ మెట్టు సాయికుమార్ తెలిపారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

కంటోన్మెంట్ సమస్యలపై సీఎం ఫోకస్



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సమస్యలు పరిష్కరిం చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవేందర్ ఆయుబ్ ఖాన్ చెప్పారు. ఆదివారము దేవేందర్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కంటోన్మెంట్ సమస్యలు తెలిపేందుకు ఇటీవల వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారని ఈ సం దర్భంగా కంటోన్మెంట్ సంబంధించిన సమస్యలు కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాగా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఎంపీ అభ్యర్థిని, బైఎలక్షన్ పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిం చాలని కోరినట్లు తెలిపారు. కంటోన్మెంట్‌లలో ఉన్న మురికివాడల ప్రాం తాలలో ఉన్న వారికి ఇండ్ల పట్టాలను ఇచ్చేందుకు చర్యలు కూడా చేపడ తామన్నారని వారు తెలిపారు. అలాగే ఈ నెల ఐదున బాబు జగ్జీవన్ రావు జయంతి కార్యక్రమానికి కూడా ముఖ్యమంత్రి హాజరుకానున్నారని తెలిపారు కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు.

రాష్ట్ర జేఏసీగా ఏర్పడిన వర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగులు



- ఇక రెగ్యులరైజ్ కోసం చేపట్టనున్న కార్యాచరణ

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యో గులు ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో సమా వేశం ఏర్పాటు చేసుకున్నారు. వీరు సమావేశం అనంతరం తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ వేదికగా ద్వారా రానున్న రోజుల్లో వర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ గెలుపునకు ప్రచారం ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

మల్కాజిగిరి పార్లమెంట్ ఉప్పల్ అసెంబ్లీ హబ్సిగూడ డివిజన్ విశాల్ మెగా మార్ట్ వద్ద ఆదివారం దేశ ప్రధాని నరేంద్ర మోడీ, మల్కాజ్‌గిరి పార్ల మెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం కళాకారుల బృందం పాట రూపంలో ఆడుతూ పాడుతూ ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోడీ చేసిన సేవలు ప్రజలు చేసిన మేలు చెబుతూ రాబోయే పార్లమెంట్ ఎలక్షన్ లో భారతీయ జనతా పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, సుమన్‌రావు, ఆనం రాఘవరెడ్డి, ఎల్లా చారి, శివ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు చేయూతనివ్వండి



- శైలజా రామయ్యార్

నవతెలంగాణ-బంజారాహిల్స్

నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేరాఫ్ అడ్రస్గా ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిలుస్తుందని తెలంగాణ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీ సిల్క్ ఎగ్జిబిషన్ను ఆమె సింగర్ ఉషతో కలిసి ప్రారంభించారు. చేనేతకళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ప్రతిఒక్కరూ చేనేత ఉత్పత్తులను ధరించి వారికి తోడ్పాటు అందించాలని కోరారు. సింగర్‌ఉష తనగానంతో ఓమధురమైన పాటను పాడారు. సిల్క్‌మార్క్‌లో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకే అందిస్తూ చేనేతకా రులను ప్రోత్సహిస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ వినియోగదారులకుఅందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు కృషిని శైలజారామయ్యార్ అభినందించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ తెలిపారు. పోచంపల్లి, చెందేరి, ఇక్కత్, నారాయణపేట్, బెనారస్, కొలకతాకు చెందిన విభిన్నమైన అరుదైన చీరలను ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, శ్రీదేవి నిరుప్, డాక్టర్ సుధావాణి, వాణి మోచెర్ల పాల్గొన్నారు. ఏప్రిల్ 7వరకూ ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ముగిసిన మహిళ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బేగంపేట్

వెస్ట్ మారేడుపల్లి గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు జరిగిన మహిళ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సికిం ద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ లోని హరిహర కళాభవన్లో ఆదివారం జరిగిన ముగింపు సమావేశంలో వివిధ రంగాల్లో ప్రముఖులైన మహిళలను ఘ నంగా సత్కరించారు. నిజాంపేట్ మేయర్ నీలా గోపాల్ రెడ్డి, సోషల్ యాక్టివిస్ ఇందుకూరి నిర్మల దేవి. అలీప్ ఫౌండర్ ప్రెసిడెంట్ రమాదేవి, కార్పొరేటర్ కొంతం దీపిక, సర్వశిక్ష అభియాన్ మానిటరింగ్‌హెడ్ కే బాలకుమారి, ప్రముఖ ల్యాప్రోస్కోపిక్, కొలరెక్టర్ సర్జన్ డాక్టర్ శాంతి వర్ధని, క్లినికల్ సైకా లజిస్ట్ మాధవి, సోషల్ యాక్టివిస్ట్ మంజులత, సైంటింగ్ శీలశ్రీసుధ, చార్టెడ్ అకౌంటెంట్ స్వప్న ప్రియ.యోగాఎక్స్‌పర్ట్ ప్రసన్న, కూచి పూడి నృత్య కళాకారిణి మృణాలిని ఘనంగా సత్కరించి వారు సాధించిన విజయాలు, వాటిని చేరుకోవడంలో పడిన కష్టాలను విద్యా ర్థులకు వివరించారు. విద్య అనేదే కాకుండా తాము ఎంచుకున్న ఏరంగంలో అయినా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు. పాఠశాల వ్యవస్థాపక చెర్మెన్ శ్రీనివాసరావు, అకడ మిక్ డైరెక్టర్ వేదకుమారిలు మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను విద్యార్థులకు తెలియ చేసేలా నెలరోజుల పాటు'ప్రతిరోజు ఒక్కప్రముఖ మహిళల చేత విద్యార్థులకు మోటివే షనల్ స్పీచ్లు అందించినట్లు



చెప్పారు. ముగింపు సందర్భంగా మహిళ దినోత్స వాన్ని గొప్ప వేడు కగా నిర్వహించడం, ప్రముఖులను సత్కరించి విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలు చేరుకునేలా ప్రోత్స హిస్తున్నామన్నారు. విద్యా ర్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి.

రుణం తీసుకొన్నది ఒక్కరు...కట్టమనేది మరికొరిని..



- బ్యాంకు అధికారులను మోసం చేసిన సదరు వ్యక్తి
- నకిలీ డాక్యుమెంట్లతో రుణం మంజూరు చేసిన బ్యాంక్ అధికారులు
- ఎలాంటి రుణం తీసుకోలేదు : ఇంటి యజమాని

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఇంటిపై నకిలీ డాక్యుమెంట్లతో రుణం తీసుకొని బ్యాంక్ అధికారులను మోసం చేసిన ఘటన అస్మత్‌పేటలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటి యజమానికి తెలియకుండా ఓ బ్యాంకు ఇంటికి సంబంధం లేని వ్యక్తుల లోను ఇచ్చి సదరు వ్యక్తి తీసుకున్న రుణాన్న ఇంట్లో ఉంటున్న వారిని కట్టాలంటూ బ్యాంకు అధికారులు వేదిస్తున్నారని ఇంట్లో ఉంటున్న బాధితులు తెలిపారు. అస్మాత్ పేట ప్రాంతంలో నివసించే మీరా ఆమె (400 గజాలు) కలిగిన ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి 2004లో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఆమె తన కొడుకులు మహమ్మద్ మెహబూబ్, మహ మ్మద్ యూసఫ్, మహమ్మద్ అన్వర్ షాదర్, మహమ్మద్ ఇబ్రహీంతో కలిసి, సభ్యులతో కలిసి ఆ ఇంట్లో నివాసం ఉంటున్నారు. అయితే వారి కుటుంబ అవసరాల నిమిత్తం ఒక వ్యక్తి వద్ద కొంత కాలం క్రితంరూ.20 లక్షలు హ్యాం డ్ లోన్ తీసుకున్నారన్నారు. అదే అదునుగా చూసుకొని సదరు వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లు సృస్టించి వ్యక్తి బ్యాంకులో రూ.50 లక్షలు ఆ నకిలీ డాక్యు మెంటరీ ద్వారా తీసుకొని పరారయినట్లు బాధితులు తెలిపారు. ప్రస్తుతం ఇప్పుడు బ్యాంక్ అధికారులు తమ ఇంటికి వచ్చి ఆ డబ్బులు తమను చెల్లిం చాలని ఇంట్లో ఉంటున్నవారిని వేధిస్తున్నారని లేని పక్షంలో ఇల్లు స్వా ధీనం చేసుకుంటామని బ్యాంక్ అధికారులు వేధిస్తున్నారని బాధితులు తమ గోడును వెల్లబోసుకున్నట్లు తెలిపారు. తీసుకొని రుణానికి సుమారుగా రూ.3 కోట్ల రూపాయలు విలువ చేసే ఇల్లు ఎలా మేము ఇవ్వాలి అంటూ బ్యాంక్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. బ్యాంక్ అధికారులు విచారించకుండా, దర్యాప్తు చేయకుండా నకిలీ డాక్యుమెంట్స్, ఐడి ప్రూఫ్ ఆధారాలతో ఎలాలోన్ ఎలా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అసలు ఆ వ్యక్తి తమ ఇంట్లో లేనేలేదని, అలాంటప్పుడు తమ ఇంటికి ఆ నోటీసులు ఎం ద ుకు ఇస్తున్నారన్నారు. ఆ అడ్రస్ మీద లోను తీసుకున్న సదరు వ్యక్తి ఇక్కడ లేడని, ఈ విషయాన్ని వారు బ్యాంకు పైఅధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. తమ ఇంటి మీద నకిలీ డాక్యుమెంట్లు సృ ష్టించి లోన్ తీసుకొన్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని బాధితులు మీడియా ద్వారా వెల్లడించారు. తాము ఎలాంటి రుణాలు బ్యాంకు నుంచి తీసుకోలేదన్నారు.

సీఎం రేవంత్ రెడ్డితో అదం సంతోష్‌కుమార్

- సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ముమ్మర ప్రయత్నాలు

నవతెలంగాణ-ఓయూ



సికింద్రాబాద్ లోక్‌సభ నియోజక వర్గంలో హస్తం పార్టీ విజయమే ధ్యే యంగా కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎమ్మెల్యే కాటెస్టింట్ అభ్యర్థి అదం సంతోష్ కుమార్, అయిన కుమారుడు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అదం సృజన్ కుమార్‌లు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పక్కా వ్యూహాన్ని, పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి, అమలు చేస్తున్న పలు అంశాలపై వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మే 13న, జరిగే ఎన్నికల్లో కాం గ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా కేంద్రంలో మోదీ సర్కారును గద్దె దించాలని, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి పిలుపుకు స్పందించిన ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ నేత ఆదం సంతోష్ కుమార్, యువ నేత ఆడం సృజన్ కుమార్‌లు సికిం ద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం ప్రజల్లో విస్తృ తంగా పర్యటిం చడంతో పాటు ఓటర్లపై ప్రభావితం చూపే కీలకమైన వ్య క్తులు, నాయకులను కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చేలా శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యురాలు మేరీ రవీంద్ర నాథ్, యాదవ నాయకుడు కట్టెల శ్రీనివాస యాదవ్ తదితరులను తాజాగా ఆదివారం రేవంత్ రెడ్డితో పరిచయం చేశారు.

షరోన్‌గాస్పెల్ చర్చ్‌లో ఈస్టర్ వేడుకలు

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఉన్నదానితో సంతృప్త పడి అందరి ఆశీస్సులు తీసుకొని శాంతియు తమైన వాతావరణంలో హింసకు తావు లేకుండా జీవించే వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని ఆ విధమైన విషయాలను ప్రస్తుత యువతీ యువకు లకు విద్యతో పాటు గుడ్డి బోధన తప్పనిసరి చేస్తే సమ సమాజ నిర్మాణంలో వారి పాత్రను తెలుసుకుంటారని మినిస్టర్ పండగ సందర్భంగా చర్చ్ ఫా దర్ ప్రభుదాస్ తెలిపారు. ఈ పండగ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని షారోన్ గాస్పెల్ చర్చ్లో ఆదివారం జరిగిన ఈ వేడుకకు స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ తో పాటు ప్రముఖులు పాల్గొని వారి సందేశాన్ని అం దించారు. అనంతరం ఏర్పాటుచేసిన ప్రత్యేక భోజనాలను అందరికీ పంపిణీ చేశారు.

రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు



తెలంగాణ-సంతోష్‌నగర్

రాష్ట్రంలో కుల మతాల అతిథుల ముస్లిం సోదరులకు అత్యంత గొప్ప గా జరుపుకొనే పండుగల్లో రంజాన్ పండుగ ఒకటని షేక్ మున్వర్ అన్నా రు. ఈ సందర్భంగా ఆదివారం నియోజకవర్గంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు సభ్యులు అభి మానులు పాల్గొన్నారు. ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా రాష్ట్రం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ అని అయన ఆకాం క్షిన్నారు. ప్రతి కుటుంబాల్లో కొత్త బట్టలతో పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థాని కులు నాయకులు కార్యకర్తలు అభిమానులు సభ్యులు యువకులు పెద్దలు మహమ్మద్ నాజిక్, మహమ్మద్ అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఓయూతో ఐసీఎస్ఐ ఒప్పందం

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం తో ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ)లు శనివారం రాత్రి యంఓయూ చేసుకున్నారు. ఓయూ, ఐసీఎస్ఐల మధ్య బహుళ డొమైన్లలో సహకారాన్ని పెంపొందించ డానికి అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయు) ఓయూ నుంచి పలువురు ప్రొఫెసర్ల బృందం ఐసిఎస్ఐ ప్రతినిధి బృందంలో ఐసిఎస్ఐ అధ్యక్షుడు సిఎస్ బి నరసింహన్, పలువురు సభ్యులు సంతకాలు చేసుకొని పరస్పరం ఒప్పందానికి సంబంధించిన పత్రాలు మార్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం క్రింది వాటితో సహా అనేక కీలక సహకారాలను కలిగి ఉంటాయని, కంపెనీ సెక్రటరీ అర్హత గుర్తింపు కంపెనీ సెక్రటరీ అర్హతను పీహెచ్డీ కోసం పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీకి సమానమైనదిగా అంగీకరించడం, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు వృత్తిపరమైన సామర్థ్యాలను పెంచడానికి, సమగ్రమైన విద్యా అనుభవాన్ని నిర్ధారించడానికి కేంద్రీకృత శిక్షణా కార్యక్రమాలను అమలు చేయడం లాంటి ఇంకా పలు అంశాలపై ఇరువురు ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్టర్ ప్రొ. లక్ష్మీ నారాయణ, ప్రొ. బి. రెడ్డి నాయక్, ప్రొ.వి.అప్పారావు, ప్రొ.డి. చెన్నప్ప, ప్రొ.కె. కృష్ణ చైతన్య, ప్రొ.వి.సుధా, ప్రొ. శ్రీరాములు, ప్రొ. వెంకటయ్య, ప్రొ. రాధికా యాదవ్, ప్రొ. జి. నరేష్ రెడ్డి, ప్రొ. ఎ. పాట్రిక్,ఐ. శేఖర్‌లు అదే విధంగా ఐసిఎస్ఐ-ఎస్ఐఆర్సి చైర్మన్ సిఎస్ ఎస్ నారాయణ గుప్తా గమిని, ఐసిఎస్ఐ-ఎస్ఐఆర్సి కార్యదర్శి సిఎస్ మహాదేవ్ తిరుంగరి, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సిఎస్ ఆర్ వెంకట రమణ, ఐసిఎస్ఐ హైదరా బాద్ చాప్టర్ సభ్యులు తదితరులు ఈ ఒప్పందంలో పాల్గొన్నారు.



ఘనంగా ప్రొ.సీపీ వర్ధని పదవీ విరమణ..పలువురు సత్కారం

- బోధన, పరిశోధన, అకాడమీక్‌గా సత్తాచాటారు : ప్రొ.లింబాద్రి

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్రం(ఫిజిక్స్),సీనియర్ ప్రొఫె సర్ ప్రొ.చుండూరు పర్వత వర్ధని బోధనలో పరిశోధనలో ఆడమిక్‌గా అన్ని రంగాల్లో రాణించిన గొప్ప ప్రొఫెసర్ అని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మె న్ ప్రొ.ఆర్.లింబాద్రి ఆమె విద్యా సేవాలు కొనియాడారు. ప్రొ.సీపీ వర్ధని పదవీ విరమణ సందర్భంగా ఇటు ఫిజిక్స్ విభాగంలో అటు ఓయూ వీసీ ఆమెను ఘనంగా సన్మానించారు. ఓయూలో కోఠి ఉమెన్స్ కాలేజీకి, ఓయూ ఫిజిక్స్ విభాగానికి ,పరిక్షల విభాగంలో ఆమె సేవలు ప్రొ.లింబాద్రి, ఓయూ వీసీ ప్రో.రవీందర్, రిజిస్టర్ ప్రొ.లక్ష్మీ నారాయణలు ప్రశంసించారు. ప్రో.వర్ధని 34 సంవత్సరాలు బోధన రంగంలో పని చేశారు. 1999 నుండి 2007 వరకు ఆంధ్రమహిళ సభలో లెక్చరర్‌గా, 2007 నుండి 2015 వరకు కోఠిఉమెన్స్ కళశాలాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జాయిన్ అయి అక్కడ కంట్రోలర్ గా, పనిచేస్తు ఆటో మెషిన్ పరీక్షల ఫలితాల సాఫ్ట్వేర్ ను అభివృద్ధి చేశారు. కోఠి ఉమేన్స్ కాలేజ్ ఫిజిక్స్ హెడ్ గా మైక్రో వైవ్స్ అభివృద్ధి చేశారు. రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ గా పనిచేసి ఉమేన్ ఎంటర్ ప్రెన్యూర్ కోర్సును ప్రత్యేకంగా నడిపారన్నారు. అనంతరం ఆమెను పలువురు ఓయూ ప్రిన్సిపాల్స్, డీన్స్, డైరెక్టర్స్, హెడ్స్, అధికారులు,తన విద్యార్థులు కలిసి ఘనంగా సన్మానించారు.



ఈటలకు ఆర్య కటిక సమాజం మద్దతు

- ఆర్య కటిక సమాజ ప్రతినిధి ఈశ్వర్ చౌదరి వెల్లడి

నవతెలంగాణ-కంటోన్మెంట్



మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈటల రాజేంద్రకు ఆర్య కటిక సమాజం మద్ద తిస్తోందని ఆర్య కటిక సంఘం చూడు ఈశ్వర్ చౌదరి ఆదివారం తెలిపారు. పార్లమెంట్ నియో జకవర్గంలో అసెంబ్లీ స్థానాల్లో ఉన్న ఒక్కొక్క నియోజకవర్గంలో సమావేశా న్ని ఏర్పాటు చేసుకొని మద్దతు ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. బోయినపల్లిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఈటల రాజేంద్ర బీసీ కులానికి చెందిన వాడని, అణగారిన వర్గా లకు వెనుకబడిన వర్గాలకు చేయూతనిస్తూ ప్రజా సంక్షేమం కోరే వ్యక్తిని, అలాంటి వ్యక్తికి వెన్నంటి ఉండి తమ కులస్తులతోపాటు తమకు తెలిసిన వారందరితో ఓట్లు వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఆయన వెల్లడించారు.

ఇఫ్తార్ విందులో సాయిబాబా



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

గచ్చిబౌలిలో సయ్యద్ పాషా అండ్ సన్స్ (లడ్డుభాయ్) ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాషాభాయ్, తాహెర్, నవాజ్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లిగుండ్లలో ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం



నవతెలంగాణ-శంకర్‌పల్లి

మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో ఆదివారం మల్లన్న కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, మహారాజ్‌పేట్ మాజీ సర్పంచ్ దోసాడ నరసింహారెడ్డి, పిల్లిగుండ్ల మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ధరణి ఐలయ్య గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రైతు సేవా సహకార సంఘం సమావేశంలో రగడ

- ఇరువర్గాల మధ్య తోపులాట
- పోలీసుల రంగ ప్రవేశం
- సమావేశం నుంచి నిష్క్రమించిన పాలకవర్గం
- మధ్యలోనే ఆగిపోయిన సర్వసభ్య సమావేశం
- మేనేజర్ ఐలేష్ తీరుపై జెడ్పిటిసి, డైరెక్టర్‌ల ఆగ్రహం





నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

బాటసింగారం రైతు సేవా సహకార సంఘం 54 వ మహాజన సర్వసభ్య సమావేశం చైర్మెన్ చేగురి భరత్ కుమార్ అధ్యక్షతన నాలుగు ఎజెండా అంశాలతో మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు చేగురి భరత్ కుమార్ సర్వసభ్య సమావేశంలో పొందుపరిచిన అంశాలతో పాటు స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం ఎఫ్ఎస్‌సిఎస్ మేనేజర్ ఐలేష్ సెప్టెంబర్ 1, 2023 నుండి ఫిబ్రవరి 29, 2024 వరకు సంఘం పరిపాలన నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు సహకార సంఘం సభ్యులు మాటాడుతూ బాటిసింగారం గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన సహకార సంఘం భవనం నిర్మాణం సంబంధించిన ఖర్చులను సర్వసభ్య సమావేశంలో ఎందుకు పొందుపరచలేదని ప్రశ్నించారు. అలాగే సంఘం సంబంధించిన ఫంక్షన్ హాల్ 30 లక్షల అద్దెకు 20 లక్షలు మాఫీ చేయాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. 50 వేల రూపాయలు రుణాలు ఉంటేనే రైతులను పీడించి వసూలు చేసే మీరు ఇంత పెద్ద ఎత్తున వచ్చే అద్దెను ఎందుకు వదిలి పెట్టాల్సి వచ్చిందని, అందుకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే బ్యాంకు లాకర్స్ ఇతర వస్తువులు కొనుగోలు చేసిన వాటి వివరాలు కూడా సర్వసభ్య సమావేశం నివేదికలో ఎందుకు పొందుపరచలేదని ప్రశ్నించారు. సంఘం సభ్యులు అడిగిన ప్రశ్నలను డైరెక్టర్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి ఏకీభవిస్తూ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మేనేజర్ ఐలేష్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎం సి మీటింగ్ లో చర్చించిన విషయాలు సర్వసభ్య సమావేశంలో ఎందుకు పొందుపర్చలేదన్నారు. ఆంధలో ఉన్నవారికి కనీసం15 వేలు రుణం ఇవ్వకుండా, కొందరికి 10 లక్షలు రుణాలు ఎలా ఇచ్చారని సభ్యులు బుర్ర జంగం మేనేజర్‌ను నిలదీశారు. రైతులకు రుణాలు అందించడంలో మేనేజర్ వివక్షను చూపుతూ తను అనుకున్న వారికి అధిక రుణాలు ఇచ్చే పద్ధతిని మార్చుకోవాలని సభ్యులు హితవు పలికారు. ఈ సందర్భంగా జడ్పిటిసి బింగిదాస్ గౌడ్ కల్పించుకుని రైతులకు రుణాలు అందించడంలో మేనేజర్ ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. ఇకనుంచి కడుపుకు అన్నం పెట్టే రైతులకు నష్టం చేయకుండా వారు కష్టకాలంలో ఉన్నప్పుడు రుణాలు ఇవ్వాలని సూచించారు. గత సర్వసభ్య సమావేశంలో కూడా మేనేజర్ ఐలేస్ వ్యవహార తీరుపై అనేక అనుమానాలు వ్యక్తం చేసిన ఆయన నివృత్తి చేసుకోకుండా కళ్ళబొల్లి కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మేనేజర్ వివరణ ఇస్తూ పాలక వర్గం సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడమే సంఘం విధి. ఎవ్వరికీ వ్యక్తి గతంగా,ఇష్టానుసారంగా రుణాలు ఇచ్చే అవకాశం లేదన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మ జంగమయ్య, డైరెక్టర్లు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మొగుళ్ల చిన్న యాదిరెడ్డి, గంట శ్రీనివాస్ రెడ్డి, చింతల లక్ష్మమ్మ, కందాడ మహిపాల్ రెడ్డి, మేకల రాములు, బాల నరసింహ, బాల్ రెడ్డి, సంఘం మేనేజర్ ఐలేష్ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

ఇరువర్గాల మధ్య తోపులాట : ఇటీవల అవిశ్వాస తీర్మానంలో రైతు సేవా సహకార సంఘం చైర్మన్ పదవిని కోల్పోయిన లెక్కల విఠల్ రెడ్డి ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి కొంత మంది సభ్యులతో కలిసి వస్తుండగా రిజిస్టర్‌లో సంతకాలు చేసే విషయంలో రిజిస్టర్‌ను సంఘం సిబ్బంది తీసుకొని వెళ్తుండగా విఠల్ రెడ్డి వెంట ఉన్న సభ్యులకు ప్రస్తుత చైర్మెన్ భరత్ కుమార్ మద్దతు దారుల సభ్యుల మధ్య కొంతసేపు తోపులాట జరిగింది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని ఇరువురిని అక్కడి నుంచి పంపించారు. దింతో గొడవ సద్దుమణిగింది.

తొలి దళిత సాహిత్య సాంస్కృతిక ఉద్యమ కారుడు దున్న ఇద్దాసు



నవతెలంగాణ-కల్చరల్

సాహిత్యం,,సంస్కృతిని, సామాజిక సమైక్యత కోసం కృషి చేసిన మహనీయలలో అగ్రగణ్యుడు దున్న ఇద్దాసు అని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా తొలి దళిత కవి, తెలంగాణ వేమన దున్న ఇదాసు సంస్మరణ సభ ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదికపై గానసభ నిర్వహణలో జరిగింది.అధ్యక్షుడు కళా విఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన వహించిన సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి పరిశోధకులు ఇద్దాసును 'మాదిగ మహాయోగి'గా కీర్తించారని. సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటి చరిత్రకారులు, సాహిత్య చరిత్ర రచయితలు ఇద్దాసును 'తొలి దళిత కవి'గా గుర్తించారని అన్నారు. అచల యోగిగా, సంకీర్తనాకారుడిగా, తత్త్వకవిగా, ప్రసిద్ధుడైన దున్న ఇద్దాసు అట్టడుగు కులాల్లో చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడు అని కీర్తించారు. కార్యక్రమంలో స్వర కిన్నెర చింతలపూడి త్రినాథ రావు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్ కుమార్, గాయకుడు. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వసంతపురి కాలనీలో చెత్త డంపింగ్ యార్డ్‌గా మారిన

జీహెచ్ఎంసీ పార్క్





- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ వసంతపురి కాలనీలోని జీహెచ్ఎంసి పార్క్ డంపింగ్ యార్డ్‌గా మారింది. గత కొంత కాలంగా జీహెచ్ఎంసీ పార్క్‌లో చెత్త పడవేయడంతో భరించలేక దుర్వాసన వస్తుందని ఇండ్లల్లో తాము ఉండలేక పోతున్నా మని సమీప ఇండ్ల యజ మానులు వాపోతున్నారు. పార్క్‌లో చెత్త చెదారం నిండి అపరి శుభ్రంగా మారినా పట్టించుకునే నాథుడే లేక పోవడంతో చెత్తతో ఇష్టం వచ్చి నట్లు పార్క్‌లో నింపేస్తుండటం శోచనీయం. ఈ సమస్యను పలు మార్లు తాము జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఉప యోగం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు చెత్త చెదారం పారేస్తుండటంతో ఆవులు, బర్రెలు ఇక్కడే తిష్ట వేస్తు న్నాయని, వాటి మలమూత్ర విసర్జన మరింత కంపు కొడుతోం దని స్థానికులు లబోదిబో మంటున్నారు.ముఖ్యంగా వర్షం కాలంలో మరింత ఇబ్బందిగా మారుతుంద ని,చిన్న జల్లు పడితేనే ఈ పార్క్ లోని పరిసరాలు దుర్గంధ భరితంగా తయా రవుతున్నాయని స్థానికులు ఆవేదన వెలిబు చ్చారు.అంతే కాకుండా ఖాళీగా ఉండటంతో దీనిలోనే కొందరు కార్లు, ఇతర వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ఈ పార్క్ కాస్తా వాహనాలకు పార్కింగ్ అడ్డగా మారి పోయిందని కాలనీ వాసులు తెలిపారు.అంతే గాకుండా రాత్రి పూట గృహ నిర్మాణ వ్యర్థాలతో పాటు చెత్తను తెచ్చి ఇక్కడే డంపింగ్ చేస్తుం డడంతో పార్క్ చెత్తకు ప్పలకు నిలయంగా మారింది. జీహెచ్ఎంసి పార్క్ నిర్వహణ లో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుం డటం వల్లనే వీటి దుస్థితి ఇలా ఉందని స్థానికులు మండిపడుతున్నారు.కాలనీలలో ఉండే పార్క్ పరిశుభ్రంగా ఉంచాలని, మంత్రులు ఆదేశించిన ఫలితం లేకుండా పోతుం దని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇకనైనా జీహెచ్ ఎంసీ అధికారులు స్పందించి పార్క్ లో చెత్త చెదారం తొలగించి, పరిశుభ్రం చేయించాలని , పార్క్ లో పార్కింగ్ చేసే వాహన యజమానులపై జరిమానా విధించి, పార్క్ నిర్వహణ పట్ల తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో

కాంగ్రెస్ విఫలం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ-అంబర్‌పేట

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ కు మద్దతుగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం అంబర్‌పేట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ అభ్యర్థి పద్మారావు గౌడ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసనసభ్యులు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పటేల్ నగర్, ప్రేమ్ నగర్ లలో పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో కేటీఆర్ నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ఎన్నికల్లో సికింద్రబాద్ ఎంపీ గా పద్మారావు ను భారీ మెజారిటీతో తో గెలిపించాలని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తిరుమలగిరిలో కార్డెన్ సెర్చ్

- 23వాహనాలను సీజ్





నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోనిలో తిరుమలగిరిలో పోలీసులు ఆదివారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 23 ద్విచక్ర వాహనాలు, ఒకటి త్రీ వీలర్ వాహనం పేపర్లు లేని వాహనాలు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా ఇండ్లలో కూడా తనిఖీలు నిర్వహించి ఎవరెవరు ఉంటున్నారని, కొత్త వారు ఎవరైనా ఉంటున్నారా! రౌడీషీటర్లు ఉన్నారా! ఈ విషయంపై పోలీసులు ఆరా తీశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరికి ఆశ్రయం ఇవ్వద్దని విజ్ఞప్తి ఈ కార్డెన్ సెర్చ్‌లో ఒక ఏసీ పి నలుగురు సీఐలు, 10మంది ఎస్ఐలు 70 మంది సిబ్బంది కానిస్టేబుల్ పాల్గొన్నారు.

సహారాలో చలి వేంద్రం ప్రారంభం



నవతెలంగాణ - హయత్‌నగర్

వేసవి తీవ్రతను గుర్తించి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా ఎస్టేట్స్‌లో ఆదివారం కాలనీ వాసుల ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చడంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వెంకట్రాద్రి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జానీ, రామేశ్వర్, సైనియా, పెంటయ్య, ప్రభాకర్‌రెడ్డి, గంగ దాసు కృష్ణారెడ్డి, ఆనంద్ రెడ్డి, విశ్వనాథ్, ఆనంద్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - సంతోష్‌నగర్

యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని దామోదర్ సంజీవనగర్ కాలనీలో శ్రీ నల్ల పోచమ్మ తల్లి నవమవార్షికోత్సవం ఉత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొమ్మల ప్రశాంత్, హరి, రమేష్, సాయి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



• ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ - నాగోల్

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. హైదరాబాద్‌లోని నాగోల్, బండ్లగూడ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ఆవరణలో ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ (సౌత్ జోన్ హైదరాబాద్) కార్యక్రమాన్ని జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. క్రీడాకారులు 75 మంది మెంబర్స్, అండర్-16, అండర్-18, అండర్-18ం జూనియర్స్ అండ్ సీనియర్స్ ఉమెన్స్ క్రీడాకారులు పాల్గొన్నట్టు తెలిపారు. క్రీడలు క్రీడాస్ఫూర్తిని పెంచుతాయని, గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ప్రతి ఆటను స్పోర్టివ్‌గా తీసుకోవాలని సూచించారు. క్రీడాకారులు క్రీడలలో రాణించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి.. దేశానికి, వారి తల్లీదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా ఉమెన్స్



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో మొత్తం ఫైవ్ స్టేట్స్ సౌత్ స్టేట్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కర్నాటక, కేరళ, తమిళనాడు నుంచి సైక్లింగ్ లీగ్ సౌత్ జోన్ కో ఆర్డినేటర్ డా. మాక్స్వెల్ ట్రావెర్, ఎస్ కే .పాషా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రేయాస్'లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో 12వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ హెచ్ రిజిస్టర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ మెరుగైన సాంకేతిక విద్యను విద్యార్థులు అభ్యసించాలని సూచించారు. అలాగే కోర్ సబ్జెక్టులతో పాటు ఆన్‌లైన్ కోర్సులపై దృష్టి సారించాలన్నారు. శ్రేయాస్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఇప్పటికే వివిధ రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 600 పైగా విద్యార్థులకు ప్లేస్ మెంట్స్‌తో 18 లక్షల అత్యధిక ప్యాకేజీ రావడం హర్షణీయమని కళాశాల వైస్ చైర్మన్ హృదయ్ రెడ్డి, సెక్రటరీ చింతల రవీంద్రనాథ్ యాదవ్ అన్నారు. అనంతరం అకాడమిక్ టాపర్స్, కల్చరర్ ఆక్టివిటీస్‌లో పాల్గొన్న వారిని అభినందిస్తూ.. బహుమతులను అందజేశారు. ప్రముఖ గాయకులు రామ్ మిర్యాల అద్భుతమైన గాలాపనలతో విద్యార్థును ఉర్రుతలూగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. సాగర్, వివిధ శాఖల అధిపతులు, ఏ ఓ రాజు, ఫ్యాకల్టీ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో
అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

• పరిషత్ చైర్‌పర్సన్ అనితా రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, రాబోయే చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి కోరారు. రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో సీనియర్ మైనార్టీ నాయకుడు ఎస్కే మహమ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మహేశ్వరం నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు తీగల కృష్ణారెడ్డి, అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందే విధంగా కృషి చేసిందని తెలిపారు. ఎన్టీఆర్ నగర్‌లోని ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా రావడం లేదని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు.

త్వరలోనే వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నుండి 175 మంది మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బేర బాల కిషన్, పగడాల ఎల్లన్న, భూపాల్ రెడ్డి, చామల శైలజ రెడ్డి, మాధవి, యశోద, రుకీయ, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్రతపై కోట్లు ఖర్చుపెట్టే
'జీహెచ్‌ఎంసీ' అపరిశుభ్రం



- ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో గోడలకు పాన్ పరాక్ మరకలు
- 20 ఏండ్లలో నీళ్లతో కడిగిన రోజుల్లేవ్.. గోడలకు రంగుల్లేవ్..
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న విజిటర్స్

నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో గోడలకు రంగులు వేయక దాదాపు 20 సంవత్సరాలు గడిచింది. అంతేకాదు ఎక్కడ చూసినా కార్యాలయంలోని గోడలకు పాన్ పరాక్ వేసుకొని ఉమ్మేసిన గుర్తులు దర్శనమిస్తున్నాయి. గోడలు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. దీంతో అక్కడ దుర్వాసన వెదజల్లుతోందని కార్యాలయానికి వచ్చిన వారు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. కానీ హయత్ నగర్, సరూర్ నగర్, ఎల్బీనగర్ సర్కిల్స్‌లోని గోడలు అపరిశుభ్రంగా ఉన్నాయి. గోడలకు రంగులు వేయాలన్న ఆలోచన అధికారులకు లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

కోట్ల రూపాయలు ఖర్చు చేసి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకునే జీహెచ్ఎంసీ అధికారులు.. సొంత భవనానికి రంగులు వేసే పరిస్థితిలో లేరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే ఆలోచన అధికారులకు లేకపోవడంతో మూడు సర్కిల్లో అపరిశుభ్రత నెలకొన్నది. ఎల్బీనగర్, హయత్ నగర్, సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయాలు ఒకే భవనంలో ఉన్నాయి. 20 సంవత్సరాల నుండి కార్యాలయాన్ని నీళ్లతో కడిగిన సందర్భాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

టాయిలెట్లలో కంపు...

కార్యాలయంలోని టాయిలెట్లను శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. పాన్ పరాక్ మరకలతో పాటు ఎక్కడ చూసినా పాత సామాన్లు దర్శనమిస్తున్నాయి. దీంతో వివిధ పనుల కోసం వస్తున్న విజిటర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి కార్యాలయం అపరిశుభ్రంగా ఉందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సామాన్లను ఇతర ప్రాంతాలకు తరలించారు. అయినా ఇప్పటికీ అపరిశుభ్రంగానే ఉందని విజిటర్స్ ఆరోపిస్తున్నారు. పరిశుభ్రత గురించి మాట్లాడే జీహెచ్ఎంసీ అధికారులు.. ముందు మీ కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని విజిటర్స్ కోరుతున్నారు.






రంజాన్‌ను ఘనంగా నిర్వహించాలి



• ఎమ్మెల్యే బలాల

నవతెలంగాణ- సంతోష్‌నగర్

రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని మలక్ పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కుర్మాగూడ, చావుని డివిజన్ పరిధిలోని ఎం ఎస్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ పరిధిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని సూచించారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎంఎ సలాం, సీనియర్ నాయకులు, యాక్టివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నెలకు 300-500 మంది మధుమేహ బాధితులు



• మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల

నవతెలంగాణ - సిటీబ్యూరో

మధుమేహంతో మానవ శరీరం స్పర్శ కోల్పోయి అవయవాలను (కాళ్ళు, చేతుల వేళ్ళు) కోల్పోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో మలక్‌పేట్ పీఎస్ ఎదురుగా డాక్టర్ కేవి ఎన్ ఎస్ అడ్వాన్స్‌డ్ వూండ్ హీలింగ్ క్లినిక్ ద్వారా చికిత్స అందించనున్నట్టు డాక్టర్ సంతోష్ మూర్తి, డాక్టర్ రిషికేష్ కొరడా తెలిపారు. ఆదివారం క్లినికల్‌లో పొడియాట్రి ఫ్లోర్‌ను మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలకు తెలంగాణలో 300-500 మంది మధుమేహం కారణంగా పాదాలు, కాళ్లను కోల్పోతున్నారని తెలిపారు. కాలిన గాయాలతో క్రానిక్ వుండ్స్‌తో బాధపడుతున్న పేషంట్స్‌కు నమ్మకంతో కూడిన చికిత్సను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నట్టు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఇది మొట్ట మొదటి క్లినిక్ అని పేర్కొన్నారు. డాక్టర్ సంతోష్ మూర్తి మాట్లాడుతూ హైదరాబాద్ నగరలో మధుమేహంపై ప్రజలకు అవగాహన ఉన్నప్పటికీ ఇలాంటి చికిత్సలపై అవగాహన అవసరం అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇప్పటికీ అవగాహన లేని కారణంగానే మధుమేహం పేషంట్స్ సంఖ్య నగరంలో కంటే గ్రామీణ ప్రాంతంలోనే పెరుగుతుందన్నారు. డాక్టర్ రిషికేష్ కోరాడ మాట్లాడుతూ తాము అడ్వాన్స్ వుండ్ హీలింగ్ చికిత్సపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. మధుమేహం ద్వారా గాయాలు, కాలిన గాయాల చికిత్సతోపాటు ప్రమాదవశాత్తు కాలిన గాయాలకు గురైన రోగులకు తమ క్లినిక్‌లో పూర్తి స్థాయి చికిత్సతోపాటు హైడ్రో థెరపీ చేయించడం, కాలిన గాయాలకు ఇన్ఫెక్షన్ రాకుండా చికిత్స చేయడం తమ ప్రత్యేకత అని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

• సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రావణ్ కుమార్

నవతెలంగాణ - సంతోష్‌నగర్

కనీస వేతనాల జీవోలను అవసరాలకు అనుగుణంగా సవరించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రావణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులకు ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ బీజేపీవి కార్మిక వ్యతిరేక విధానాలు అని, వాటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కోవిడ్ అనంతరం పేదలు పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారడానికి మోడీ ప్రభుత్వం కారణమైందని ఆరోపించారు. కార్మికుల నిజవేతనాల పెరుగుదల పూర్తిగా నిలిచి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాలు పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. రాముని పేరుతో రాజకీయాలు చేయడం, మతాన్ని చొప్పించడం సరైందని కాదని, మతాల మధ్య గొడవలు రేపడం అన్యాయమన్నారు. కార్మికుల చట్టాలకు తూట్లు పొడవడం, ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అవుతుందని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోతున్నా పట్టించుకోక పోవడం బీజేపీకే చెల్లుతుందన్నారు. ఇలాంటి అనేక సమస్యలను పరిష్కరించకుండా దేశం వెలిగిపోతుందని ప్రచారం చేయడం సిగ్గుమాలిన పని అని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని, ఈ రాజ్యాంగాన్నే మారుస్తామని బహిరంగంగా ప్రకటించిందని..ఇలాంటి ప్రజా వ్యతిరేక పాలనను ఓటు ద్వారా తిప్పి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం. మీన, ఉపాధ్యక్షులు ఎల్.కోటయ్య కార్మికుల సమస్యలపై, ప్రభుత్వ విధానాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కిషన్, జంగయ్య, రాంకుమార్, చుక్క నర్సింహ, మల్లేష్, సిద్ధులు, సీఐటీయూ నాయకులు, 60 మంది కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో
రంజిత్ రెడ్డి విజయం ఖాయం

• కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి విజయం ఖాయమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రామకృష్ణపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, యాదవ్ రెడ్డి, ముప్పిడి లింగస్వామి గౌడ్, శ్రీనివాసులు, ఎల్లయ్య, శ్యాంసుందర్ గౌడ్, శ్రీనివాసులు, రమేష్, మధు యాదవ్, శంకర్, సుజాతా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కృష్ణారావు, అంజరావ్, స్వామి గౌడ్, సాయి తేజ రెడ్డి, పురుష రాజ్‌లు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా వారికి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి.. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పదేండ్ల బీజేపీ దోపిడీ పాలనతో ప్రజలు విసిగి పోయారని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పిట్ట హరినాథ్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, మహేందర్, గట్ల రవీంద్ర, సురేష్, కాళిదాస్, సైదులు, శ్రీకాంత్ రెడ్డి, విప్లవ రెడ్డి పాల్గొన్నారు.



సుమైరా అబ్దులాలి... ప్రముఖ పర్యావరణవేత్త. పండుగల సమయంలో ఆడియోమీటర్‌తో నగరం చుట్టూ తిరుగుతూ కనిపిస్తారు. శబ్ద కాలుష్యంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాల వల్ల కలిగే తీవ్రమైన పర్యావరణ సమస్యలకు వ్యతిరేకంగా స్వరం పెంచి ప్రసిద్ధి చెందారు. దీని కోసం ఆవాజ్ ఫౌండేషన్ అనే సంస్థను కూడా స్థాపించారు. ప్రపంచంలోనే ధ్వని కాలుష్య నగరాల్లో ఒకటిగా ఉన్న ముంబయిలో శబ్ద కాలుష్యం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలను ఎత్తిచూపుతూ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...





ది లేడీ విత్ ది ఆడియోమీటర్

1961, మే 22న ముంబయిలో పుట్టిన సుమైర చిన్నతనం నుండి సామాజిక అవగాహనతో పెరిగారు. 'ఇరవై ఏండ్ల కిందట శబ్ద కాలుష్యం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి నేను మాట్లాడినప్పుడు ప్రజలు నవ్వారు. అయితే మీ ఆలోచనలు ఉన్నతమైనవి అన్నవారు కూడా ఉన్నారు. సహజంగా భారతీయులు శబ్దాన్ని ఇష్టపడతారు. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం శబ్ద కాలుష్యంపై పోలీసులు దాఖలు చేసిన ప్రథమ సమాచార నివేదికలు మహారాష్ట్రలో రెండవ అత్యధిక (వన్యప్రాణుల తర్వాత) పర్యావరణ నేరంగా మారింది' అని ఆమె చెప్పారు.

అవగాహన కల్పించేందుకు

శబ్ద కాలుష్యాన్ని తగ్గించేందుకు మొదటి నుండి ఆమె చేసిన ప్రయత్నాలు నిరంతరంగానూ, నిశితంగానూ ఉన్నాయి.



సుమైరా తరచుగా పండుగల సమయంలో తన చేతిలో ఆడియోమీటర్‌తో నగరం చుట్టూ తిరుగుతూ ఉంటారు. శబ్దం స్థాయిలు పెరిగినపుడు ముఖ్యంగా వృద్ధులు, రోగులకు తీవ్రమైన బాధ కలిగిస్తుంది. అందుకే ఆమె బహిరంగ ప్రచారాలు, డాక్యుమెంటరీలు, టెలివిజన్ చర్చలు, పత్రికా కథనాలు, చట్టపరమైన జోక్యాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. 2004లో ఇసుక మాఫియాకు వ్యతిరేంగా పని మొదలుపెట్టారు. దాంతో అనేక బెదిరింపులకు గురయ్యారు. అయినా వెనుదిరగలేదు. శబ్ద కాలుష్యానికి వ్యతిరేకంగా తన ప్రచారానికి సహాయంగా ఆవాజ్ ఫౌండేషన్ అనే పబ్లిక్ ట్రస్ట్‌ను స్థాపించారు. వాలంటీర్లు, న్యాయ నిపుణుల సహాయంతో అవగాహన కార్యక్రమాలు కొనసాగించారు.

విస్తృత ప్రచారం

సైరన్‌లు, హార్న్‌లపై తగిన శబ్ద స్థాయి పరిమితులకు సంబంధించి సుమైరా సిఫార్సులను మహారాష్ట్ర ప్రభుత్వం చట్టంగా నోటిఫై చేసింది. ఆమె ముంబయి మెట్రో నిర్మాణం వల్ల కలిగే శబ్దానికి వ్యతిరేకంగా పోరాడారు. హారన్‌లకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారంలో పనిచేశారు. ఆమె కృషి ఫలితంగా మహారాష్ట్ర అంతటా ప్రభుత్వం పండుగ సీజన్‌లో డీజేలపై నిషేధం విధించింది. అలాగే హారన్, బాణసంచా కాల్చడం, నిర్మాణ కార్యకలాపాలు మొదలైన వాటి వల్ల కలిగే శబ్దాన్ని తగ్గించాలని ఆమె ఆవాజ్ ఫౌండేషన్ ద్వారా అనేక పిటిషన్‌లను దాఖలు చేశారు. 2007లో ముంబై నాయిస్ మ్యాప్‌ను నగర అభివృద్ధి ప్రణాళికలో చేర్చాలని కోరారు. చివరకు 2016లో హైకోర్టు అన్ని రకాల శబ్ద కాలుష్యాన్ని తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల అమలు నిష్పక్షపాతంగా ఉంటుందని, ఇది అన్ని మతాల పండుగలు వేడుకలకు వర్తిస్తుందని ప్రకటించింది.

ఆమెపై భౌతిక దాడులు

అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. 2003లో అలీబాగ్‌లోని తన పూర్వీకుల ఇంటి దగ్గర అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారనే కేసు ఆమె దృష్టికి వచ్చింది. వీరితో ఘర్షణ పడటంతో మైనర్లు ఆమెపై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఎఫ్ఐఆర్‌ను అనుసరించి ఆమెపై దాడి చేసిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు పెట్టారు. 2006లో అక్రమ ఇసుక తవ్వకాలపై ఆవాజ్ ఫౌండేషన్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా అప్పీల్ చేసింది. అనేక విచారణలు తర్వాత హైకోర్టు అన్ని తీర ప్రాంతాలలో అక్రమ ఇసుక తవ్వకాన్ని నిషేధించాలని ఆదేశాలు జారీ చేసింది. చివరికి మహారాష్ట్ర అంతటా ఇసుక వెలికితీతను నిషేధించింది.

ప్రైవేట్ హెలిప్యాడ్‌లకు వ్యతిరేకంగా...

ఆమె కృషి ఫలితంగా 2016లో పండుగల సమయంలో శబ్దం స్థాయి గణనీయంగా తగ్గిన ఏకైక నగరం ముంబయి అలాగే ఆమె ముంబయిలో ప్రైవేట్ హెలిప్యాడ్‌లను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్ వేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2010లో ముఖేష్ అంబానీ, అనిల్ అంబానీల ఇళ్లపై రూఫ్‌టాప్ హెలిప్యాడ్‌లను అనుమతి ఇచ్చింది. అయితే పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అటువంటి హెలిప్యాడ్‌లను నిలిపివేయాలని ప్రకటించడంతో సుమైరా ప్రయత్నాలు ఫలించాయి. అక్కడే కాక భారతదేశం అంతటా వాటి వినియోగాన్ని నిషేధించింది. అలాగే 2010లో సుమైరా పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖను కఠినమైన శబ్ద నియమాలు పాటించాలని అభ్యర్థించారు. శబ్ద కాలుష్యం కోసం జాతీయ డేటాబేస్ అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆమె అందిం చిన అన్ని సూచనలను పొందుపరిచిన ఆ శాఖ నాయిస్ రూల్స్ లో అనేక మార్పులు చేసింది. ఇదే భారతదేశంలో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ యొక్క నేషనల్ నాయిస్ మానిటరింగ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి కూడా దారితీసింది.

కాలుష్య నియంత్రణ మండలిలో...

మహారాష్ట్ర ప్రభుత్వం వాహనాలపై 'హార్న్ ఓకే ప్లీజ్' అనే పదాన్ని కూడా నిషేధించింది. ఇది డ్రైవర్లను అనవసరంగా హారన్ చేయడాన్ని ప్రోత్సహించి శబ్ద కాలుష్యానికి కారణమవుతుందని పేర్కొంది. శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు సుమైరా మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కమిటీతో కలిసి పనిచేశారు.

దీనిపై ఆమె సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం చట్టంగా నోటిఫై చేసింది. సుమైరా అక్రమ ఇసుక తవ్వకాలను గుర్తించి వాటి ఫొటోలు, వీడియోల ద్వారా సాక్ష్యాలను స్వయంగా నమోదు చేశారు. దాంతో ఇసుక మాఫియా ఆమెను పదే పదే బెదిరించింది, దాడులకు కూడా దిగింది. ఒకసారి ఆమె కారును ట్రక్కుతో ఢీకొట్టిన సంఘటన కూడా ఉంది. భయపడకుండా ఆమె ఇతర కార్యకర్తలు, ఎన్‌జీఓలను కలుపుకొని వారి బెదిరింపులకు వ్యతిరేకంగా మిత్రా అనే ఉద్యమాన్ని స్థాపించారు

డాక్యుమెంటరీలు...

2012లో 'లైన్ ఇన్ ది శాండ్' అనే డాక్యుమెంటరీలో ఆమె భాగమయ్యారు. ఈ డాక్యుమెంటరీ ఇసుక తవ్వకాలు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది అనే అంశంపై దృష్టి సారించింది. చిత్రం ఘన విజయం సాధించింది. దీంతో సుమైరా జుహు బీచ్‌లో 'ఇసుక మైనింగ్ సమస్యను పాతిపెట్టవద్దు' అనే అవగాహన ప్రచారాన్ని ప్రారంభించారు. సుమైరా 2004లో 'దేవుడు చెవిటివాడా?' అనే షార్ట్ ఫిల్మ్‌లో కూడా తీశారు. పర్యావరణ సమస్యలకు వ్యతిరేకంగా ఆమె చేసిన ప్రయత్నాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. ఆమె చేసిన ఈ కృషికి మదర్ థెరిసా అవార్డు, అశోక పురస్కారాలు వంటి అవార్డులు పొందారు.

- సలీమ



బీజేపీలో ఉంటే నీతిపరులు.. లేకుంటే అవినీతిపరులా?

(మొదటిపేజీ తరువాయి)

భయంలో ఉన్నది. అందుకే ఈ నినాదాన్ని ముందుకు తెచ్చింది. భయం లేకుంటే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయాల్సిన అవసరం లేదు. ఓడిపోతామనే భయంతోనే వారిని అరెస్టు చేశారు. బీజేపీని ఈ ఎన్నికల్లో గద్దెదించడం తక్షణ రాజకీయ కర్తవ్యం. బీజేపీ మతోన్మాద విధానాలను ప్రశ్నిస్తూ విస్తారంగా దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ చేయాలని మా పార్టీ నిర్ణయించింది.'అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు చెప్పారు.

శనివారం టి.జ్యోతి అధ్యక్షతన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం, ఆదివారం చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలను కకావికలం చేస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను ప్రయోగించి భయభ్రాంతులకు గురిచేస్తున్నదన్నారు. ప్రతిపక్షాల ఎన్నికల క్యాంపెయిన్‌ను బలహీనపరిచే చర్యలు తీసుకుంటున్నదని, ప్రతిపక్ష నాయకుల ఫిరాయింపులను ప్రోత్సహించి వారికి బీజేపీ టికెట్లు ఇస్తున్నదని విమర్శించారు. బీజేపీకి బలముంటే ఇవన్నీ ఎందుకు చేస్తున్నదని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను ప్రలోభాలకు గురిచేసి లొంగదీసుకోవడం లేదంటే, ఈడీ, సీబీఐ, ఐటీని ఉపయోగించి భయభ్రాంతులకు గురిచేయడం, వినకుంటే అరెస్టు చేసి జైలులో పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'అవినీతిపరులు బీజేపీలో చేరితే నీతిపరులవుతున్నారనీ, నీతిపరులు బయట ఉంటే అవినీతిపరులవుతున్నారంటూ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు' అని రాఘవులు గుర్తుచేశారు. నీతికి నిర్వచనాన్ని బీజేపీ మార్చివేసిందన్నారు. బీజేపీలో ఉంటే నీతిపరులు, లేకుంటే అవినీతిపరులు అన్నట్టుగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దాన్ని సహించేది లేదన్నారు. బీజేపీకి భయం లేకుంటే ఎన్నికల తేదీలు ముందే తెలుసు కాబట్టి ప్రధాని దేశమంతా సుడిగాలి పర్యటన చేశారని గుర్తు చేశారు. కొత్త పనులకు శంకుస్థాపనలు



చేశారనీ, తెలంగాణ, ఏపీలోనూ పర్యటించారని చెప్పారు. ఎన్నికల బాండ్లలో అత్యధిక భాగం, రూ.6,566 కోట్లు బీజేపీకి వచ్చాయని వివరించారు. అధికారంలో ఎవరుంటారు, ప్రతిపక్షంలో ఎవరుంటారనేది తమకు ముఖ్యం కాదనీ, దేశంలో ప్రజాస్వామ్యం బతకాలనీ, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. ఆర్థికంగా గొప్ప ముందడుగు వేశామని బీజేపీ చెప్తున్నదన్నారు. బ్రిటీష్ వారి కాలం కంటే ఇప్పుడు అసమానతలు ఎక్కువయ్యాయంటూ ఓ సంస్థ ప్రకటించిందన్నారు. దేశంలో రాజ్యాంగ మౌలిక విలువలను రక్షించుకోవాలనీ, ప్రజలు ఆ పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రమాదం ముంచుకొస్తున్నదనీ, మతోన్మాద వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని నిలువరించాలనీ, ఈ రాష్ట్రంలో ఒక్క ఎంపీ స్థానం గెలవకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

ఫోన్‌ట్యాపింగ్ అప్రజాస్వామికం : ఎస్ వీరయ్య

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం అప్రజాస్వామికమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య విమర్శించారు. వ్యక్తిగత గోప్యతకు ఇది భంగం కలిగిస్తుందన్నారు. ట్యాపింగ్‌కు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలంటే కేంద్రం అనుమతి కావాలని చెప్పారు. ట్యాపింగ్ చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పోలీసులే చేశారా? లేదా గత ప్రభుత్వమే ట్యాపింగ్ చేయించిందా? అన్నది విచారణలో తేలాలనీ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రం స్పందించడం లేదన్నారు. మేడిగడ్డ కుంగిపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మత్తులు చేపట్టాలంటూ బీఆర్ఎస్ నేతలంటుంటే, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకూ పగుళ్లు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులంటున్నారని వివరించారు. ఎన్‌డీఎస్‌ఏ అధికారులు, నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. మేడిగడ్డలో అవినీతి, డిజైన్‌లో లోపాలు, ఎల్అండ్‌టీ సంస్థ వైఫల్యంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ముడుపుల కోసం ప్రయివేటు సంస్థలతో కుమ్మక్కై రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఖజానాను దుర్వినియోగం చేసిందని దుయ్యబట్టారు. దాన్ని తేల్చాలని కోరారు. వేసవితో పాటు కరువు ప్రారంభమైందని, కరువు పీడిత ప్రాంతాల్లో ఒక్క మంత్రి పర్యటించలేదనీ, రైతులకు భరోసా కల్పించలేదన్నారు.

ప్రాజెక్టులు, చెరువుల్లో నీళ్లు లేవనీ, భూగర్భ జలాలు పడిపోయాయని వివరించారు. రైతులు నష్టపోకుండా వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని రైతాంగాన్ని ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిందని, ఆ మాట నిలబెట్టుకోవాలని కోరారు. 19 జిల్లాల్లో లక్షల కుటుంబాలు గుడిసెలు వేసుకున్నాయనీ, ఇందిరమ్మ ఇండ్ల కింద వారికి రూ.ఐదు లక్షల సాయం చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెవాసులపై కేసులను రద్దు చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారనీ, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరణి భూ సమస్యలు అలాగే ఉన్నాయనీ, బాధితులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ధరణిలోని లోపాలను సరి చేయాలన్నారు. గొర్రెలు, మేకల కుంభకోణం జరిగిందనీ, విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. శాస్త్రీయ పద్ధతిలో కార్మికుల కనీస వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికలకు ఇంకా సమయముందని, పార్లమెంటు ఎన్నికల్లో వైఖరిపై సీపీఐ, సీపీఐ(ఎం) సంప్రదించుకుంటాయని వివరించారు. పరిణామాలను చూసి ఎవరికి మద్దతివ్వాలో తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని విలేకర్లు అడిగిన ప్రశ్నకు వీరయ్య సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గాజాలో కాల్పుల విరమణపై కైరోలో చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని బెంజామిన్ నెతన్యాహు అంగీకరించిన కొద్ది రోజుల తర్వాత ఆదివారం చర్చలు ప్రారంభమయ్యాయని ఈజిప్ట్ భద్రతా వర్గాలు ధ్రువీకరించాయి. జర్నలిస్టుల శిబిరంపై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడిలో ఇద్దరు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఇప్పటివరకు గాజాలో 32,782మంది మరణించగా, 75,298మంది తీవ్రంగా గాయపడ్డారు.

శాంతిని నెలకొల్పండి : పోప్

యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజాలో తక్షణమే శాంతి నెలకొనాలని, కాల్పుల విరమణ పాటించాలని పోప్ ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. ఈస్టర్ సందర్భంగా ఆయన ఈ సందేశం ఇచ్చారు. సెయింట్ పీటర్స్ బసిలికాలో సెంట్రల్ బాల్కనీ నుండి ఆయన నగర, ప్రపంచ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రధానంగా శాంతిని నెలకొల్పడంపైనే దృష్టి పెట్టాలని కోరారు. ఇంకా చిన్నారుల కళ్లలో కష్టాలను, దైన్యాన్ని ఎన్నాళ్లు చూడాలి? అని ఆయన ప్రశ్నించారు. యుద్ధ ప్రాంతాల్లో నివసిస్తున్న పిల్లలు నవ్వడం మరిచిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎందుకు ఈ మరణాలు? ఎందుకు ఈ విధ్వంసం? అని వారు మనల్ని ప్రశ్నిస్తున్నారు. యుద్ధం అనేది ఎల్లప్పుడూ అసంబద్ధమేనని' అన్నారు.

గాజాలో శాశ్వత కాల్పుల విరమణకై పిలుపు

గాజాలో తక్షణమే, శాశ్వత కాల్పుల విరమణ జరగాలని ఈజిప్ట్, ఫ్రాన్స్, జోర్డాన్ పిలుపునిచ్చాయి. హమాస్ చెరలో వున్న బందీలందరినీ విడుదల చేయాలని కోరాయి. కైరోలో శనివారం ఈ మూడు దేశాల దౌత్యవేత్తలు సమావేశమయ్యారు. అనంతరం వారు ముగ్గురు సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఈ యుద్ధానికి రాజకీయ పరిష్కారంగా తమ ప్రభుత్వం భద్రతా మండలిలో ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఫ్రాన్స్ విదేశాంగ స్టెఫాన్ సెజర్న్ తెలిపారు. రెండు దేశాల పరిష్కార మార్గానికి అవసరమైన అన్ని ప్రామాణికాలను ఇందులో పొందుపరచనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ గూటికి కడియం శ్రీహరి, కావ్య

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ గూటికి చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వారు చేరుకున్నారు. సీఎం, దీపాదాస్‌మున్షితో చర్చించిన తర్వాత వారు కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న తన కూతుర్ని ఓడిపోయే పార్టీ తరపున పోటీ చేయించదలచుకోలేదన్నారు. అందుకే పార్టీ మారుతున్నట్టు తెలిపారు. వరంగల్ పార్లమెంటు నియోజక వర్గం నుంచి పోటీ కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి పిలుపు వచ్చిందనీ, ఏఐసీసీ ప్రతినిధులు తమ నివాసానికి వచ్చి పార్టీలోకి ఆహ్వానించారని గుర్తు చేశారు. అయితే నియోజకవర్గ నేతలు, కార్యకర్తలను అడిగిన తర్వాతే తమ నిర్ణయాన్ని చెబుతానని వారికి చెప్పానన్నారు. వరంగల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా కావ్య పోటీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, నాయకులు అయోమయంలో ఉన్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ వద్దంటేనే కడియం కావ్యకు వరంగల్ టికెట్ ఇచ్చారన్నారు. పదేండ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా.. తన వెంట ఉన్న నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నట్టుగానే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడేమో అధికారం లేక ప్రతిపక్షంలో ఉన్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎవరికీ అన్యాయం చేయలేదనీ, కానీ తాటికొండ రాజయ్య, ఆరూరి రమేశ్, పసునూరి దయాకర్ పార్టీ మారినప్పుడు ఎవరూ మాట్లాడలేదన్నారు. ఇప్పుడు మాత్రం అందరూ మాట్లాడుతున్నారని తెలిపారు. కొంత మంది నెలల తరబడి పార్టీలో చేరతామని కాంగ్రెస్ వారి ఇండ్ల చుట్టూ తిరిగినా వారు చేర్చుకోలేదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదనీ, రియల్ ఎస్టేట్, భూకబ్జాలు చేయలేదని చెప్పారు. ప్రయివేటు యూనివర్సిటీలు పెట్టుకోలేదని అన్నారు. తనను విమర్శించే నైతిక అర్హత ఏ ఒక్కరికీ లేదని స్పష్టం చేశారు. తన 30 ఏండ్ల రాజకీయ జీవితంలో తనపై ఒక్క కేసు కూడా లేదన్నారు. చాలా మంది పార్టీని, ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ఆస్తులు కూడబెట్టుకున్నారని తెలిపారు. తనను ఆశీర్వదించినట్టే తన బిడ్డను ఆశీర్వదించాలని ప్రజలను కడియం విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ సీట్ల పంచాయితీకి నేడు శుభం కార్డు..!

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. వరంగల్ సీటు కోసం బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్‌తో పాటు డి. సాంబయ్య, అద్దంకి దయాకర్ పోటీ పడుతున్నారు. ఇది ఇలాఉండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు అతని కూతురు, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య కంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో మొదటి నుంచి టికెట్‌పై ఆశలు పెట్టుకున్న వారికి ఆశా భంగం తప్పదని రాజకీయ వర్గాలంటున్నాయి. పార్టీ మారిన సిట్టింగ్ ఎంపీ పసూనూరి సీటు గ్యారెంటీతోనే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే చివరి వరకు ఎవరికి సీటు దక్కుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కరీంనగర్ టికెట్ కోసం హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సంతోష్ కుమార్ మొదటి నుంచి పోటీ పడుతున్నారు. అల్గిరెడ్డి పేరు ఖరారైందని వార్తలు వచ్చినప్పటికి చివరి క్షణంలో తీన్మార్ మల్లన్న పేరు తెరపైకి వచ్చింది. హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి మస్కతితో పాటు ఫిరోజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. అనూహ్యంగా ఈ స్థానం నుంచి ఓ టెన్నిస్‌స్టార్‌తో పాటు సుప్రీంకోర్టు అడ్వకేట్, షానవాజ్ తుబుసుంపేర్లు వినిపిస్తున్నాయి. రాష్ట్ర, జిల్లా నేతలు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల అభిప్రాయాలను స్వీకరించిన ఏఐసీసీ, వారిచ్చిన సలహాలు, సూచనల మేరకు తుది జాబితాను సీఈసీకి పంపింది. ప్రజా బలం, కుల సమీకరణలు, పార్టీకి చేసిన సేవలు, విధేయత తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకుని చర్చించి సీట్లపై అధిష్టానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరగనున్న సీఈసీ భేటీలో మిగిలిన నాలుగు సీట్లకు అభ్యర్థులు ఖరారయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలంటున్నాయి.

అదనపు ఎస్పీ భుజంగరావుపై రియల్ వ్యాపారుల ఫిర్యాదులు

- మూడో రోజు కొనసాగిన విచారణ
- మరో ఇద్దరు కానిస్టేబుళ్లకు నోటీసులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడైన అదనపు ఎస్పీ బుజంగరావుపై కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పోలీసు అధికారులకు తాజాగా ఫిర్యాదు చేశారు. తమను పీడించి, బెదిరింపులకు గురి చేసి పెద్ద మొత్తంలో డబ్బులను దండుకున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా, ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ సంధ్యా కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీధర్‌రావు ఆదివారం పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు జరుపుతున్న అధికారులను కలిశారు. బుజంగరావుతో పాటు వారి బృందం తన ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేశారని ఫిర్యాదు చేశారు. అంతేగాక, ఆ సమయంలో పలుమార్లు తన కార్యాలయానికి పిలిపించుకుని డబ్బులను డిమాండ్ చేశారనీ, తన వ్యాపారంలో సహకరించాలని బుజంగరావు ఒత్తిడి తీసుకొచ్చారని ఆయన అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వారి మాట వినకపోతే మానసిక క్షోభకు గురి చేసేవారనీ, తనపై తప్పుడు కేసులు పెట్టించారని శ్రీధర్‌రావు ఆరోపించారు. రాధాకిషన్‌రావు కూడా టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా ఉన్న సమయంలో తన వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులను డిమాండ్ చేసి, తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీధర్‌రావును తనను వేధించిన తీరుపై విలేకరులు ప్రశ్నించగా.. ఈ సమయంలో ఏమీ చెప్పలేననీ, అంతా ఫిర్యాదులో అధికారుల దృష్టికి తీసుకొచ్చానని వెల్లడించారు. అంతేగాక, విచారణ దశలో ఆ విషయాలు బయట మాట్లాడటం సరికాదనీ, త్వరలోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బుజంగరావు అరాచకాలను వివరిస్తానని స్పష్టం చేశారు.

కాగా, మరికొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సైతం తాము ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావుల నుంచి ఎదుర్కొన్న ఇబ్బందులు, బెదిరింపులు, వారు తమ నుంచి డబ్బులు దండుకున్న తీరును కూలంకషంగా వివరించారని తెలుస్తున్నది. ఈ సందర్భంగా కొందరు కానిస్టేబుళ్ల పేర్లను కూడా వారు అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. దీంతో, సదరు కానిస్టేబుళ్లకు నోటీసులిచ్చి విచారణకు పిలవటానికి దర్యాప్తు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. తమ కస్టడీలో ఉన్న భుజంగరావు, తిరుపతన్నలను మూడో రోజు కూడా అధికారులు క్షుణ్ణంగా విచారించారు.

సన్‌రైజర్స్‌కు షాక్

- టైటాన్స్ చేతిలో పరాజయం
- గుజరాత్ బౌలర్ల సమిష్టి ప్రదర్శన
- హైదరాబాద్ 162/8, గుజరాత్ 168/3





సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఊహించని షాక్. గత మ్యాచ్‌లో రికార్డు బద్దలుకొట్టే స్కోరుతో అసమాన విజయం సాధించిన ఆరెంజ్ ఆర్మీ.. మొతెరా మైదానంలో గుజరాత్ టైటాన్స్ చేతిలో కంగుతింది. అరవీర బ్యాటింగ్ లైనప్ కలిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గుజరాత్ టైటాన్స్ బౌలర్లు ముకుతాడు వేశారు. మోహిత్ శర్మ (3/25), రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ సమిష్టిగా రాణించటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. ట్రావిశ్ హెడ్ (19), అభిషేక్ శర్మ (29), హెన్రిచ్ క్లాసెన్ (24) నిరాశపరచటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలుత 162 పరుగులే చేసింది. ఊరించే లక్ష్యాన్ని గుజరాత్ టైటాన్స్ మరో 5 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఐపీఎల్17లో సన్‌రైజర్స్‌కు ఇది రెండో పరాజయం కాగా, గుజరాత్ టైటాన్స్‌కు ఇది రెండో విజయం.

నవతెలంగాణ-అహ్మదాబాద్

కథ అడ్డం తిరిగింది. ముంబయి ఇండియన్స్‌పై ఐపీఎల్‌లో రికార్డు 277 పరుగుల భారీ స్కోరు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తన తర్వాతి మ్యాచ్‌లో బ్యాట్‌తో తడబడింది!. గుజరాత్ టైటాన్స్ బౌలర్లు కలిసికట్టుగా సన్‌రైజర్స్ బ్యాటర్లను కట్టడి చేయటంతో ఇది సాధ్యపడింది. 163 పరుగుల ఛేదనలో డెవిడ్ మిల్లర్ (44 నాటౌట్, 27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు), సాయి సుదర్శన్ (45, 36 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (36, 28 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 19.1 ఓవర్లలోనే లాంఛనం ముగించిన గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇక తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ వెటరన్ పేసర్ మోహిత్ శర్మ (3/25) మూడు వికెట్ల ప్రదర్శనతో 162 పరుగులకే పరిమితమైంది. అభిషేక్ శర్మ (29, 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలు), అబ్దుల్ సమద్ (29, 14 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), హెన్రిచ్ క్లాసెన్ (24, 13 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సలు) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. గుజరాత్ టైటాన్స్ పేసర్ మోహిత్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సాధించాడు.

అలవోకగా కొట్టారు

గుజరాత్ టైటాన్స్ లక్ష్యం 163 పరుగులు. ఐపీఎల్‌లో గత రెండు సీజన్లలో ఛేదనలో గుజరాత్ టైటాన్స్‌కు తిరుగులేని రికార్డుంది. సొంత మైదానంలో ఊరించే లక్ష్యం ముగించేందుకు టైటాన్స్ ఒత్తిడికి గురి కాలేదు. ఓపెనర్లు వృద్ధిమాన్ సాహా (25, 13 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సలు), శుభ్‌మన్ గిల్ (36, 28 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 36 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో సాహా దూకుడుగా ఆడాడు. షాబాజ్, భువనేశ్వర్ కుమార్‌లపై బౌండరీలు బాదాడు. ఓ ఎండ్‌లో కెప్టెన్ గిల్ కాస్త నెమ్మదిగా ఆడినా.. సాధించాల్సిన రన్‌రేట్ తక్కువగా ఉండటంతో టైటాన్స్‌కు సమస్య లేదు. సాయి సుదర్శన్ (45, 36 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి గిల్ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. శుభ్‌మన్ గిల్ వికెట్‌తో సన్‌రైజర్స్ పుంజుకునే ప్రయత్నం చేసినా.. డెవిడ్ మిల్లర్ (44 నాటౌట్) రాకతో టైటాన్స్ మరింత పట్టు బిగించింది. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లతో సన్‌రైజర్స్ ఒత్తిడి పెంచేందుకు చూసింది. డెత్ ఓవర్లలో టైటాన్స్‌ను దెబ్బతీసేందుకు హైదరాబాద్ ఎదురుచూడగా.. మయాంక్ మార్కండే ఓవర్లో 24 పరుగులు పిండుకున్న మిల్లర్, సాయి సుదర్శన్ టైటాన్స్ గెలుపు లాంఛనం చేశారు. ఆఖరు ఓవర్లో తొలి బంతిని సిక్సర్‌గా బాదిన డెవిడ్ మిల్లర్ గుజరాత్ టైటాన్స్‌కు 7 వికెట్ల తేడాతో ఘన విజయం అందించాడు. విజయ్ శంకర్ (14 నాటౌట్) ఫర్వాలేదనిపించే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో పాట్ కమిన్స్, మయాంక్ మార్కండే, షాబాజ్ అహ్మద్‌లు తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

బ్యాటర్లు విఫలం

టాస్ నెగ్గిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఛేదనలో తిరుగులేని రికార్డున్న గుజరాత్ టైటాన్స్‌కు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసే సదవకాశం కల్పించటం సన్‌రైజర్స్‌కు వ్యూహాత్మక తప్పిదమే!. గత మ్యాచ్ జోరు కొనసాగించటంలో ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లు విఫలమయ్యారు. ట్రావిశ్ హెడ్ (19), మయాంక్ అగర్వాల్ (16) తొలి వికెట్‌కు 34 పరుగులు జోడించి శుభారంభం అందించారు. కానీ ఓపెనర్లు ఇద్దరిలో ఎవరూ ఆశించిన దూకుడు చూపించలేదు. హెడ్ మూడు ఫోర్లు బాదగా, మయాంక్ రెండు బౌండరీలు కొట్టాడు. మయాంక్‌ను అజ్మతుల్లా.. హెడ్‌ను నూర్ అహ్మద్ వెనక్కి పంపారు. అభిషేక్ శర్మ (29), ఎడెన్ మార్‌క్రామ్ (17) నిరాశపరిచారు. అభిషేక్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో సానుకూలంగా కనిపించినా.. మార్‌క్రామ్ మళ్లీ మొదటికొచ్చాడు. 19 బంతుల్లో 17 పరుగులే చేసి ఇతర బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు!. హెన్రిచ్ క్లాసెన్ (24, 13 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సలు), అబ్దుల్ సమద్ (29, 14 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడారు. క్లాసెన్ రెండు సిక్సర్లు, ఓ ఫోర్ బాదగా.. సమద్ మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగాడు. క్లాసెన్ దండయాత్రకు రషీద్ ఖాన్ ముగింపు పలుకగా.. సమద్ రనౌట్‌గా నిష్క్రమించాడు. షాబాజ్ అహ్మద్ (22, 20 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) సాదాసీదా ఇన్నింగ్స్‌తో సరిపెట్టాడు. వాషింగ్టన్ సుందర్ (0) తేలిపోయాడు. దీంతో 20 ఓవర్లలో 8 వికెట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ 162 పరుగులు చేసింది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో మోహిత్ శర్మ మూడు వికెట్లతో మెరువగా.. రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, అజ్మతుల్లా ఓమర్‌జాయ్, ఉమేశ్ యాదవ్ కీలక వికెట్లు పడగొట్టారు.

స్కోరు వివరాలు :

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ : ట్రావిశ్ హెడ్ (బి) నూర్ (బి) అహ్మద్ 19, మయాంక్ అగర్వాల్ (సి) నల్కాండె (బి) అజ్మతుల్లా 16, అభిషేక్ శర్మ (సి) శుభ్‌మన్ (బి) మోహిత్ శర్మ 29, ఎడెన్ మార్‌క్రామ్ (సి) రషీద్ ఖాన్ (బి) ఉమేశ్ యాదవ్ 17, హెన్రిక్ క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 24, షాబాజ్ అహ్మద్ (బి) తెవాటియ (బి) మోహిత్ శర్మ 22, అబ్దుల్ సమద్ (రనౌట్) 29, వాషింగ్టన్ సుందర్ (సి)రషీద్ ఖాన్ (బి) మోహిత్ శర్మ 0, పాట్ కమిన్స్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 4, **మొత్తం :(20 ఓవర్లలో 8 వికెట్లకు) 162.**

వికెట్ల పతనం : 1-34, 2-58, 3-74, 4-108, 5-114, 6-159, 7-159, 8-162.

బౌలింగ్ : అజ్మతుల్లా ఓమర్‌జాయ్ 3-0-24-1, ఉమేశ్ యాదవ్ 3-0-28-1, రషీద్ ఖాన్ 4-0-33-1, నూర్ అహ్మద్ 4-0-32-1, మోహిత్ శర్మ 4-0-25-3, దర్శన్ నల్కాండె 2-0-18-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్ : వృద్ధిమాన్ సాహా (సి) కమిన్స్ (బి) షాబాజ్ అహ్మద్ 25, శుభ్‌మన్ గిల్ (సి) అబ్దుల్ సమద్ (బి) మయాంక్ మార్కండె 36, సాయి సుదర్శన్ (సి) అభిషేక్ శర్మ (బి) కమిన్స్ 45, డెవిడ్ మిల్లర్ నాటౌట్ 44, విజయ్ శంకర్ నాటౌట్ 14, ఎక్స్‌ట్రాలు : 4, **మొత్తం :(19.1 ఓవర్లలో 3 వికెట్లకు) 168.**

వికెట్ల పతనం : 1-36, 2-74, 3-138.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-27-0, షాబాజ్ అహ్మద్ 2-0-20-1, జైదేవ్ ఉనద్కత్ 3.1-0-33-0, వాషింగ్టన్ సుందర్ 3-0-27-0, మయాంక్ మార్కండె 3-0-33-1, పాట్ కమిన్స్ 4-0-28-1.

ఢిల్లీ మురిసింది

- చెన్నైపై క్యాపిటల్స్ ఘన విజయం
- ఛేదనలో సూపర్‌కింగ్స్ చతికిల
- అర్థ సెంచరీతో మెరిసిన పంత్
- ఢిల్లీ 191/5, చెన్నై 171/6

నవతెలంగాణ-విశాఖపట్నం



ఎట్టకేలకు ఢిల్లీ క్యాపిటల్స్ ఓ విజయం సాధించింది. ఐపీఎల్17లో వరుసగా తొలి రెండు మ్యాచుల్లో తేలిపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆదివారం విశాఖపట్నంలో అగ్రజట్టు చెన్నై సూపర్‌కింగ్స్‌పై 20 ఘన విజయం సాధించింది. వైజాగ్‌లో తొలి రెండు ఆతిథ్య మ్యాచులు ఆడుతున్న ఢిల్లీ క్యాపిటల్స్.. ఇక్కడ తొలి మ్యాచ్‌లోనే బోణీ కొట్టింది. 192 పరుగుల భారీ ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ చతికిల పడింది. లోతైన బ్యాటింగ్ లైనప్ కలిగిన సూపర్‌కింగ్స్‌ను క్యాపిటల్స్ చిత్తు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (1), రచిన్ రవీంద్ర (2), శివం దూబె (18), సమీర్ రిజ్వీ (0) నిరాశపరిచారు. డార్లీ మిచెల్ (34, 26 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సలు) అంచనాలను అందుకోలేదు. అజింక్య రహానె (45, 30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సలు), డార్లీ మిచెల్ (34, 26 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సలు), ఎం.ఎస్ ధోని (37 నాటౌట్, 16 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలు), రవీంద్ర జడేజా (21 నాటౌట్, 17 బంతుల్లో 2 ఫోర్లు) మెరిసినా చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 171 పరుగులే చేసింది. 20 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ సీజన్లో తొలి విజయం నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కెప్టెన్ రిషబ్ పంత్ (51, 32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలు), ఓపెనర్ డెవిడ్ వార్నర్ (52, 35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలు) అర్థ సెంచరీలతో రాణించారు. చెన్నై సూపర్‌కింగ్స్‌కు సీజన్లో ఇదే తొలి పరాజయం.

మెరిసిన పంత్ : సొంత మైదానం విశాఖలో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు డెవిడ్ వార్నర్ (52), పృథ్వీ షా (43, 27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు) తొలి వికెట్‌కు 93 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఓపెనర్లు భారీ స్కోరుకు గట్టి పునాది వేయగా కెప్టెన్ రిషబ్ పంత్ (51) దంచికొట్టాడు. పునరాగమనంలో సూపర్‌కింగ్స్‌పై అర్థ సెంచరీ నమోదు చేశాడు. మూడు సిక్సర్లు, నాలుగు బౌండరీలతో మెరిసిన రిషబ్ పంత్ తనదైన ఇన్నింగ్స్‌తో అభిమానులను అలరించాడు. మిచెల్ మార్ష్ (18), అక్షర్ పటేల్ (7 నాటౌట్) ఆఖర్లో ఫర్వాలేదనిపించారు. టాప్-3 బ్యాటర్లు కదం తొక్కటంతో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. సూపర్‌కింగ్స్ పేసర్ మతీశ పతిరణ (3/31) మూడు వికెట్ల ప్రదర్శనతో మెప్పించాడు.

నవచిత్రం

హాస్యభరిత వ్యంగ్య చిత్రం



సాయి తేజ, పావని

చిరంజీవి, బాలయ్య, అమితాబ్, రజని, సచిన్, ధోని లాంటి వాళ్ళకు అభిమానులు ఉండటం అత్యంత సహజం. కానీ అంబానీ లాంటి వారికి అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన అభిమానుల్లో ఒకడు శివ. 21 ఏళ్ల పిలగాడు. అంబానీకి వీర అభిమాని. ఉద్యోగం, వ్యవసాయం కాకుండా వ్యాపారం చేసి వేల కోట్లు సంపాదించాలని వీడి ఆశ. అదృష్టానికో, దురదృష్టానికో ఉన్న ఊళ్లోనే ఇతనికి కోట్లు సంపాదించే అవకాశం వస్తుంది. ఈలోపు వేట కుక్కలు, గుంట నక్కలు, హైనాలు, రాబందుల్లాంటి మనుషులను, వైకుంఠపాళి వ్యవస్థలోని అధికార పాములను తప్పించుకుంటూ తట్టుకొని ఈ శివ ఏ నిచ్చెనలెక్కి, ఏ చుక్కలనందుకున్నాడో చెప్పే హాస్య భరిత వ్యంగ్య చిత్రం 'పైలం పిలగా!' అని మేకర్స్ చెబుతున్నారు.

విలువ లేని వ్యవసాయం చేయలేక, వలస పోయి కార్పొరేట్ బానిస అవలేక ఉన్న ఊళ్లోనే ఎంట్రప్రెన్యూర్‌గా మారి పది మందికి పని కల్పించి, అంబానీలా కోట్లు సంపాదించాలని అత్యుత్సాహంతో కలలు కన్నా ఓ మధ్యతరగతి యువకుడు, పద్మవ్యూహం వంటి బ్యూరోక్రసీ వ్యవస్థలో సమస్త అవస్థలు పడుతూ ఏ ప్రస్థానం చేరుకున్నాడో చెప్పే ఈ చిత్రం అందరీ ఆలోచించేలా ఉంటుందంటున్నారు.

హ్యాపీ హార్స్ ఫిలిమ్స్ నిర్మాణంలో రామకృష్ణ బొద్దుల, ఎస్.కె. శ్రీనివాస్ నిర్మాతలుగా ఆనంద్ గుర్రం దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ చిత్ర పోస్టర్, ఫస్ట్ లుక్‌ను ఇటీవల విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీలో జరిగిన రామ్ మిర్యాల మ్యూజిక్ కన్సర్ట్‌లో విద్యార్థులతో లాంచ్ చేయించారు. ఇన్నోవేటివ్‌గా, ఫన్నీగా ఉన్న ఈ ఫస్ట్ లుక్ విద్యార్థుల్లో అమితాకసక్తిని రేపింది. పిల్ల పిలగాడు' వెబ్ సిరీస్ ఫేమ్ సాయి తేజ హీరోగా, 'పుష్ప' ఫేమ్ పావని కారణం హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో డబ్బింగ్ జానకి, చిత్రం శ్రీను, మిర్చి కిరణ్ తదితరులు నటించారు.

చౌరస్తా యశ్వంత్ నాగ్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రంలో ఆరు పాటలను రామ్ మిర్యాల, చిత్ర, శ్రావణి భార్గవి ఆలపించారు. ఈ చిత్రానికి కెమెరా: సందీప్ బద్దుల, ఎడిటింగ్ : రవితేజ కూర్మన, స్టైలిష్ : హారిక పొట్ట, లిరిక్స్ : ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : సంతోష్ వాడ్నలా, సహ నిర్మాతలు : కృష్ణమసునూరి, రవి వాషింగ్టన్, విజయ్ గోపు.


విజయ్ దేవరకొండ


ఫ్యామిలీ స్టార్ రిలీజ్‌కి రెడీ

హీరో విజయ్ దేవరకొండ నటించిన తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. ఈ సినిమా వచ్చే శుక్రవారం గ్రాండ్‌గా థియేటర్స్‌లోకి వచ్చేందుకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టికెట్ బుకింగ్స్ ప్రారంభమైనట్టు మేకర్స్ తెలిపారు. టీజర్, లిరికల్ సాంగ్స్, ట్రైలర్‌తో ఈ సినిమా మీద భారీ హైప్ క్రియేట్ అయ్యింది.

ఇది టికెట్ బుకింగ్స్‌లోనూ క్లియర్‌గా కనిపిస్తోందని, థియేటర్స్, మల్టీప్లెక్స్‌లో టికెట్స్ బుకింగ్స్ చాలా ఫాస్ట్‌గా జరుగుతున్నాయని, హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కావడంతో ఫ్యామిలీస్‌తో కలిసి ప్రేక్షకులు ఈ చిత్రాన్ని చూసేందుకు అమితాసక్తి చూపిస్తున్నారని చిత్ర బృందం తెలిపింది.

ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాకు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను ఈనెల 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.


దసరా లాంటి బ్లాక్‌బస్టర్ కోసం..


నాని

2023లో రిలీజైన పీరియడ్ లవ్, మాస్ యాక్షన్ డ్రామా 'దసరా' బిగ్గెస్ట్ హిట్స్‌లో ఒకటి. ఈ చిత్రానికి పని చేసిన త్రయం మరోసారి ప్రేక్షకులకు సరికొత్త చిత్రాన్ని చూపించేందుకు రెడీ అవుతున్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్న కొత్త చిత్రం కోసం దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టారు.

శ్రీకాంత్ ఓదెల 'దసరాతో రచయితగా, దర్శకుడిగా తన సత్తా చాటి ప్రశంసలు అందుకున్నారు. మునుపెన్నడూ లేని మాస్ క్యారెక్టర్‌లో నానిని ప్రెజెంట్ చేశారు. ఈ కొత్త సినిమా అనౌన్స్ మెంట్ పోస్టర్ ఎరుపు రంగులో పెయింట్ చేయబడింది. ఇది వైలెన్స్‌ని సూచిస్తోంది. నాని గడ్డం, మెలితిప్పిన మీసాలతో మ్యాసీవ్ అవతార్‌లో కనిపించారు. నానిని పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో ప్రెజెంట్ చేయడానికి శ్రీకాంత్ మరో విన్నింగ్ స్క్రిప్ట్ రెడీ చేశారని చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రాన్ని 2025 వేసవిలో విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు.

సిసలైన స్నేహానికి నిర్వచనం



సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధాన పాత్రలలో చిదంబరం ఎస్ పొదువల్ దర్శకత్వం వహించిన మలయాళ సర్వైవల్ థ్రిల్లర్ 'మంజుమ్మల్ బాయ్స్'.

మలయాళంలోనే రూ.200 కోట్లకు పైగా గ్రాస్‌తో ఈ సంవత్సరం ఇండియాలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ తెలుగు ప్రేక్షకులకు ముందు ఈ సర్వైవల్ థ్రిల్లర్‌ను తీసుకువస్తోంది.

తెలుగు వెర్షన్‌ను నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పిస్తున్నారు. ఈనెల 6న తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదల కానుంది. తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. డెవిల్స్ కేవ్‌గా పిలవబడే గుణా కేవ్స్‌కి కొంతమంది స్నేహితులు వెళ్తారు. ఆ గుహలోకి వెళ్లిన స్నేహితుల్లో ఒకడు అనుకోకుండా ఒక లోతైన గుంతలో పడిపోతాడు? ఆ స్నేహితుడ్ని బతికించుకోవడం కోసం ఆ స్నేహితులు ఏం చేశారనేది సినిమా అని మేకర్స్ తెలిపారు.

ఆటో డ్రైవర్ల బతుకుల్ని మార్చే సినిమా



సహచారి క్రియేషన్స్ బ్యానర్‌పై రోహన్ కులకర్ణి నిజజీవిత కథ ఆధారంగా తెరకెక్కిన వెబ్ సిరీస్ 'కైజర్'. వికాస్ చిక్కబల్లాపూర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆదివారం ప్రేక్షకుల ముందుకొచ్చింది.

ఈస్ట్ వెస్ట్ ఎంటర్‌టైన్మెంట్ డిస్ట్రిబ్యూటర్ ద్వారా అమెజాన్ ప్రైమ్, ఎమ్ఎక్స్ ప్లేయర్లలో ఇది స్ట్రీమింగ్ అవుతోంది.

ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్ వికాస్ చిక్కబల్లాపూర్ మాట్లాడుతూ, 'ఆటో డ్రైవర్ల కష్టాలు ఎలా ఉంటాయి?, వారిని ఆదుకోవడానికి రోహన్ కులకర్ణి ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు?, రోకు యాప్ ఆటో డ్రైవర్లకు ఎలా ఉపయోగపడుతుందో ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం. ఈ కథను ప్రతీ ఆటో డ్రైవర్‌కు చేరవేయాలనేదే మా సినిమా లక్ష్యం. సినిమాలో చాలా మంది రియల్ ఆటో డ్రైవర్లను చూపించాం, ఈ సిరీస్‌ను జనాల వద్దకు నేను తీసుకెళ్తా అని ముందుకొచ్చిన ఈస్ట్ వెస్ట్ ఎంటర్ టైన్మెంట్ అధినేత రాజీవ్‌కు ధన్యవాదాలు' అని తెలిపారు. 'డైరెక్టర్ వికాస్ ఒక నెలలోనే సినిమాని పూర్తి చేయడమంటే మాములు విషయం కాదు. దాన్ని వికాస్ సాధించి చూపించారు. రోహన్ రోల్ చేసిన రవి మహాదాస్యం చాలా నేచురల్‌గా చేశారు. సుశాంత్ ఆటో డ్రైవర్‌గా బాగా చేశారు. ఈ చిన్న చిత్రానికి పేరున్న నటులు కోటేశ్వరరావు, బీహెచ్ఎల్ ప్రసాద్ 'పెద్ద ఆస్తి' అని స్టోరీ, స్క్రీన్ ప్లే రైటర్ సృజన గోపాల్ చెప్పారు.

హీరో రవి మహదాస్యమ్ మాట్లాడుతూ,'స్టోరీ విన్న వెంటనే చాలా బాగుంది చేద్దాం అని ఫిక్స్ అయ్యాను. అయితే ఇంత తొందరగా సినిమా అయిపోయి ప్రేక్షకుల ముందుకు వస్తుందని అనుకోలేదు. ఈ క్రెడిట్ మొత్తం డైరెక్టర్ వికాస్‌కే ఇవ్వాలి. రోహన్ క్యారెక్టర్ చేస్తున్నప్పుడు ఆయన గురించి తెలుసుకున్నాను. ఆయన చాలా సేవలు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ల కోసం యాప్‌ను తీసుకురావడమే కాదు, వారి పిల్లలను కూడా చదివించడం అంటే మాములు విషయం కాదు. ఈ సినిమా చూసిన తరువాత ఆటో వాళ్లను చూసే విధానం మారిపోతుంది' అని అన్నారు.

రోహన్ మాట్లాడుతూ,'కైజర్ అంటే రాజు అని అర్థం. సుభాష్ చంద్రబోస్‌ను హిట్లర్ కైజర్ అని పిలిచేవారు. అందుకే ఈ చిత్రానికి కైజర్ అని టైటిల్ పెట్టాం. సినిమా చాలా తొందరగా, ఇంత అద్భుతంగా రావడం వెనుక డైనమిక్ టీమ్ పని చేసింది. ఆటో డ్రైవర్ల బతుకుల్ని మార్చే సినిమాగా దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది' అని చెప్పారు. 'రోహన్ నా కొడుకు అయినందుకు చాలా సంతోషంగా ఉంది. నా కొడుకు అద్భుతం చేసి చూపించాడు' అని రోహన్ తండ్రి దేవ్ చెప్పారు.

నవ్వుతూనే ఉంటారు



సూర్య తేజ హీరోగా పరిచయం అవుతూ నటించిన చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కెవిఆర్ మహేంద్ర దర్శకత్వం వహించారు. పిఆర్ ఫిలింస్ పతాకంపై పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి కథానాయిక. వేసవి కానుకగా ఈనెల 5న విడుదలకు కానుంది. ఈ నేపథ్యంలో హీరో ఆనంద్ దేవరకొండ ముఖ్య అతిథిగా మేకర్స్ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌ని చాలా గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ వేడుకలో హీరోయిన్ శివాత్మిక, జీవిత రాజశేఖర్, నవదీప్, దర్శకులు శ్రీరామ్ ఆదిత్య, విరించి వర్మ నిర్మాతలు అభిషేక్ అగర్వాల్, మధుర శ్రీధర్, లగడపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, 'భరతనాట్యం' చాలా ఆసక్తికరమైన కథ. వివేక్ సాగర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. 'దొరసాని' సినిమా మా అందరికీ చాలా మంచి పేరు తీసుకొచ్చింది. దర్శకుడు కెవిఆర్ మహేంద్ర, నేను, శివాత్మిక.. ఇలా దాదాపు అందరం కొత్తవాళ్లతో ఆ సినిమా చేశాం. ఆ సినిమా మా అందరి కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచింది. ఇదే నమ్మకంతో చెబుతున్నా... ఈ సినిమా కూడా సూర్య తేజతో పాటు సినిమా యూనిట్ అందరికీ చాలా మంచి పేరు తీసుకొస్తుంది' అని అన్నారు. 'ఒక సినిమా అవ్వాలంటే నేచర్ సపోర్ట్ చేయాలని మా దర్శకుడు చెప్పేవారు. మా సినిమాకి ఆ నేచర్ హితేష్. ఆయన వలనే ఈ సినిమా సాధ్యపడింది. మాపై చాలా నమ్మకంతో ఈ సినిమా చేశారు. మహేంద్ర సినిమాని అద్భుతంగా తీశారు. ఇందులో ఆయనలోని వైలెన్స్‌ని చూస్తారు' అని హీరో సూర్య తేజ ఏలే చెప్పారు.

దర్శకుడు కెవిఆర్ మహేంద్ర మాట్లాడుతూ,'ఈ సినిమాని చాలా ఎంటర్‌టైనింగ్ హ్యూజ్ వరల్డ్ క్రియేట్ చేసి చెప్పడం జరిగింది. సినిమా మొదలైన ఐదు నిమిషాల తర్వాత ఆ ప్రపంచంలోకి వెళ్ళిపోతారు. ఈ సినిమా ఆద్యంతం కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది. డార్క్ కామెడీ హిలేరియస్‌గా వర్కవుట్ అయ్యింది' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.